
ప్రతిపక్షం

www.prathipaksham.in



రెండో టెస్టు నుంచి కెప్టెన్ గిల్ ఔట్ 12

శనివారం 22.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 242 పేజీలు:12 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu

25న తెలంగాణ కేబినెట్ భేటీ

డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులకు ఆమోదం

ఆ వెంటనే రిజర్వేషన్ ప్రక్రియ షురూ



- పాత పద్ధతిలోనే పంచాయతీ ఎన్నికలు
- 50 శాతానికి మించకుండా కసరత్తు
- లాటరీల ద్వారా రిజర్వేషన్ నిర్ధారణ
- హైకోర్టు విచారణకు ముందే నిర్ణయం
- ఒకే రోజు ఎన్నికలు, ఫలితాల ప్రకటన
- కొత్త డిస్కమ్, విద్యుత్ సంస్థలపై కేబినెట్ చర్చ
- పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్న మంత్రిమండలి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 21: తెలంగాణ మంత్రివర్గ సమావేశం ఈ నెల 25న జరుగనుంది. ఉదయం 11 గంటలకు సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే కేబినెట్ భేటీలో డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులకు ఆమోద ముద్ర వేయనున్నట్లు సమాచారం. గ్రామ పంచాయతీ ఎన్నికలలో రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా ఉండేలా చూడాలని కమిషన్ సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. బీసీలకు 42 శాతం కోటాపై కోర్టులో వివాదాలు ఉన్నందున పాత పద్ధతిలోనే పంచాయతీల ఎన్నికలు జరపాలని ఈ నెల 17న కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా సిఫార్స్ చేయాలన్న కేబినెట్ సూచన మేరకు బూసాని వెంకటేశ్వర రావు సారథ్యంలోని డెడికేటెడ్ కమిషన్

..:: మిగతా 2లో



భారతీయ కళా మహోత్సవం వంటి కార్యక్రమాలు మన దేశంలోని వివిధ ప్రాంతాలలో నివసించే ప్రజలు ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి సహాయపడతాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు ఈ అవగాహన మన దృష్టికోణాన్ని విస్తృతం చేస్తుందని చెప్పారు. ఈ విధమైన కార్యక్రమాలు మన సాంస్కృతిక వారసత్వంపై గౌరవం పెంపొందించి, దానిని కాపాడేందుకు ప్రేరణనిస్తాయని తెలిపారు.ఈ మహోత్సవానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరై ఆనందిస్తారనే నమ్మకం ఉందన్నారు. నిరుడు ఈశాన్య భారతదేశపు సమృద్ధి చెందిన సాంస్కృతిక వారసత్వాన్ని పరిచయం చేశామని, ఈసారి పశ్చిమ భారతదేశపు సాంస్కృతిక సంపదను చూసే, అర్థం చేసుకునే అవకాశం లభిస్తోందన్నారు

'ఈశాన్య' సంస్కృతి చాలా గొప్పది

ఆ ఘనత దేశ ప్రజలకు తెలియాలి

- దీంతో ఒకరినొకరు అర్థం చేసుకోవచ్చు
- సాంస్కృతికత మీద గౌరవం పెరుగుతుంది
- యువతను ఆ వారసత్వంతో అనుసంధానించాలి
- వంటలు, సంప్రదాయాలను ఆస్వాదించవచ్చు
- యేటేటా ఈ వేడుకకు ఆదరణ పెరుగుతోంది
- భారత ప్రభుత్వం కూడా ఇందుకు కృషి చేస్తోంది
- కళా ఉత్సవంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- రాష్ట్రపతి నిలయంలో రెండో ఎడిషన్‌ప్రారంభం
- నేటి నుంచి 30 వరకు ప్రజలకు అందుబాటులో
- ఉదయం 10 నుంచి రాత్రి 8 వరకు ఉచిత ప్రవేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 21: దేశ ప్రజలకు నిరుడు ఈశాన్య భారతదేశపు సమృద్ధి చెందిన సాంస్కృతిక వారసత్వాన్ని పరిచయం చేశామని, ఈసారి పశ్చిమ భారతదేశపు సాంస్కృతిక సంపదను చూసే, అర్థం చేసుకునే అవకాశం లభిస్తోందని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము అన్నారు. సికింద్రాబాద్ రాష్ట్రపతి నిలయంలో శుక్రవారం ఆమె భారతీయ కళా మహోత్సవం ద్వితీయ సంచికకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 22 నుండి 30 వరకు ఉత్సవం ప్రజలకు అందుబాటులో ఉంటుంది. తొమ్మిది రోజులపాటు జరిగే వేడుకను రాష్ట్రపతి నిలయం, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, పత్తులు మంత్రిత్వ శాఖ, పర్యాటక మంత్రిత్వ శాఖలతో కలిసి నిర్వహిస్తోంది. గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, గోవా, దాద్రా, నగర్ హవేలీ, దమన్, దీవ్‌ల సమృద్ధి, వైవిధ్య భరిత సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శించడానికి ఉద్దేశించబడింది. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ ఈ మహోత్సవం ద్వారా సందర్శకులు గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, గోవా, దమన్, దీవ్, దాద్రా నగర్

..:: మిగతా 2లో

'సిర్' మీద విచారణకు 'సుప్రీం' ఓకే

కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా తలపెట్టిన 'సమగ్ర ఓటరు జాబితా ప్రత్యేక సవరణ' మీద నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కేరళ, ఉత్తరప్రదేశ్ సహా ఇతర రాష్ట్రాలలో ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పటిషన్ల విచారణకు సుప్రీంకోర్టు శుక్రవారం అంగీకరించింది.



..:: 11లో



ఢిల్లీకి చేరిన కర్ణాటక సీఎం 'పంచాయితీ'

కర్ణాటక సిద్ధరామయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. కొంతకాలంగా ఇక్కడ ముఖ్యమంత్రి మార్పు ఖాయమని, ఇక ఆయన స్థానంలో డీకే శివకుమార్ ను ముఖ్యమంత్రిగా చేస్తారని ప్రచారం మొదలైంది.

11



రేషన్ కార్డుదారులకు బిగ్ అలర్ట్

ఇటీవల రేషన్ కార్డుల నుంచి పెద్ద సంఖ్యలో పేర్లు తొలగిస్తున్నారనే అంశం వెలుగులోకి వచ్చింది. అనేక చోట్ల మరణించిన వ్యక్తుల పేర్లతో కూడా సంవత్సరాలుగా రేషన్ తీసుకుంటున్నట్లు తనిఖీలలో తేలింది.

11



భారీ ఉగ్ర కుట్రను ఛేదించిన గుజరాత్ ఏటీఎస్

హరిద్వార్ , ఢిల్లీ, లక్నో, అహ్మదాబాద్,, ముంబై, కోల్‌కతా సహా ప్రధాన నగరాలలో ప్రాణాంతక రసాయనాలతో ఉగ్రదాడులకు కుట్రలు చేశారని గుజరాత్ ఉగ్రవాద వ్యతిరేక దళం (ఏటీఎస్) గుర్తించింది.

11

తెలంగాణ–ఈశాన్య సినీ బంధానికి నాంది

- కలిసిపోతే జాతీయ సమైక్యత బలోపేతం
- సినిమా ఎలాంటి సరిహద్దులు లేని భాష
- ప్రాంతాలు, భాషలు, జాతులు దాటి ఏకం చేస్తుంది
- దేశంలో తెలుగు సినిమాలకు ఆదరణ
- 'టీఎన్‌ఈసీ' చిత్రోత్సవం ప్రారంభంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 21: ప్రసాద్ ఐమ్యాక్స్, హైదరాబాద్‌లో 'టీఎన్‌ఈసీ కనెక్ట్' రెండు రోజుల చిత్రోత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చిత్రోత్సవాన్ని ప్రారంభించి,

..:: మిగతా 2లో

తెలంగాణలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

- 33మంది అధికారులకు స్థాన చలనం
- పలు కీలక జిల్లాలలో కొత్త వారికి పోస్టింగ్
- డీజీపీ (పర్సనల్) గా దేవేంద్ర సింగ్ చౌహాన్
- సీఐడీ డిప్యూటీ ఐజీగా పరిమళ హనా నూతన్ జాకబ్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 21 : రాష్ట్రంలో భారీగా ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న పలువురికి పోస్టింగులు లభించగా, పలు జిల్లాలలో పని చేస్తున్న ఎస్పీలకు స్థాన చలనం కలిగింది. కొంతమందికి ఇతర జిల్లాలలో పోస్టింగులు లభించగా, మరికొంత మంది హైదరాబాద్, సైబరాబాద్

..:: మిగతా 2లో

మెట్రో స్వాధీనానికి ముహూర్తం ఖరారు

- మార్చిలోగా పక్రియ పూర్తి చేసే అవకాశం
- అనుమతుల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు
- సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి ఖట్టర్
- ఎంఎంటీఎస్ తో తప్పని ప్రయాణికుల కష్టాలు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 21 : మొదటి దశ మెట్రోను ఎల్అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియ మార్చి 31 లోగా పూర్తి చేయాలని సర్కారు భావిస్తోంది. రెండోదశలో విస్తరణ ప్రతిపాదనలలో సాధ్యాసాధ్యాలు పరిశీలించి మార్చిలోపు అనుమతులపై నిర్ణయం తీసుకుంటామని కేంద్రం చెబుతోంది. మెట్రో రైలు 2 (ఎ) లో ఐదు మార్గాలు ఉన్నాయి. 2(బి)లో మూడు మార్గాలు ఉన్నాయి. ఈ రెండు మార్గాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉమ్మడి భాగస్వామ్యంలో నిర్మించాలని నిర్ణయించారు. అనుమతుల కోసం కేంద్రానికి రాష్ట్ర సర్కారు ప్రతిపాదనలు పంపింది. మొదటి దశను నిర్వహిస్తున్న ఎల్అండ్ టీ హైదరాబాద్ మెట్రోతో జరిగిన చర్చలలో

..:: మిగతా 2లో



5 లక్షల కోట్ల భూ కుంభకోణం!

- నగరంలో తెర లేపిన సీఎం రేవంత్ రెడ్డి
- దేశ చరిత్రలోనే అతిపెద్ద స్కామ్‌కు కుట్ర
- ఇది పాలసీ కాదు, కోట్ల రూపాయల కుంభకోణం
- విలువైన భూమిని ప్రయివేట్ వ్యక్తులకు ఇస్తున్నారు
- 30 శాతం రేట్లకి రెగ్యులరైజేషన్ అవినీతికి నిదర్శనం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 21: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ పేరిట ముఖ్యమంత్రి రూ. ఐదు లక్షల కోట్ల విలువైన భూకుంభకోణానికి పాల్పడాలని చూస్తున్నారని ఆరోపించారు. దీనిని భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద భూ కుంభకోణంగా అభివర్ణించారు. ముఖ్యమంత్రికి సన్నిహితంగా ఉండే రాజకీయ మధ్యవర్తులు, బంధువులు, రియల్ ఎస్టేట్ గ్రూపులకు లబ్ధి చేకూర్చేందుకే ఈ విధానం రూపొందించారని ధ్వజమెత్తారు. పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ, మార్పు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన హెచ్ఐఎల్‌టీపీ వాస్తవానికి వేలాది ఎకరాల పారిశ్రామిక భూములను అత్యంత తక్కువ ధరకు బహుళ ఉపయోగ విలువైన రియల్ ఎస్టేట్‌గా మార్చడానికి రూపొందించారని కేటీఆర్ పేర్కొన్నారు. ఇది కేవలం పాలసీ కాదని, రూ. ఐదు లక్షల కోట్ల స్కామ్ కోసం రూపొందించిన బ్లూప్రింట్ అని ఆరోపించారు. పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ ముసుగులో, రేవంత్ రెడ్డి భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద భూ కుంభకోణానికి తెరలేపారన్నారు.

కీలక పారిశ్రామిక క్లస్టర్‌లలో

బాలానగర్, జీడిమెట్ల, సనత్‌నగర్, ఆజామాబాద్ సహా నగరంలోని కీలక పారిశ్రామిక క్లస్టర్‌లలో ఉన్న సుమారు 9,292 ఎకరాల విలువైన భూమిని

..:: మిగతా 2లో



దుబాయి ఎయిర్ షోలోఅపశ్రుతి: పైలట్ మృతి

దుబాయి ఎయిర్ షోలో శుక్రవారం అపశ్రుతి చోటు చేసుకుంది. విన్యాసాల సందర్భంగా భారత్‌కు చెందిన తేజస్ ఫైటర్ జెట్ ఒక్కసారి కుప్పకూలింది. వేగంగా నేలను తాకింది. కొన్ని క్షణాల వ్యవధిలో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది.

11

రాష్ట్రీయం

మెట్రో స్వాధీనానికి ముహూర్తం ఖరారు

మొదటిపేజీ తరువాయి

ప్రాజెక్టును సర్కారుకు స్వాధీనం చేసేందుకు సుముఖంగా ఉన్నట్లు చెప్పింది. దీంతో ప్రతిష్ఠంభన తొలగింది. ఇలా స్వాధీనం ప్రక్రియను మార్చి 31 వరకు పూర్తి చేసేందుకు సర్కారు చర్యలను తీసుకోనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది మార్గాలలో విస్తరణకు ప్రతిపాదించింది. హైదరాబాద్‌లో కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ మీడియాతో మాట్లాడుతూ, మార్చిలోపు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈలోపే టోకోవర్ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే హైదరాబాద్ మెట్రోకి రూ.13 వేల కోట్ల రుణాలు ఉన్నాయి. అయితే ఇక్కడ సాంకేతిక అవరోధాలు ఎన్నో ఉన్నాయి.

ఎంఎంటీఎస్ కష్టాలు

సికింద్రాబాద్ , సనత్ నగర్ , ఖైరతాబాద్ , సుచిత్ర, అల్వాల్ , ఘట్ కేసర్, మల్కాజిగిరి నుంచి ఐటీ ఉద్యోగులు ఎంఎంటీఎస్‌లో రాకపోకలు సాగిస్తుంటారు. తిరుగు ప్రయాణంలో సరిపడా రైళ్లు అందుబాటులో ఉండటం లేదు. ఈ సమస్యకు పరిష్కారంగా 15 కోచ్ ల మెమూ రైళ్లు, 10 నుంచి 15 నిమిషాల ఫ్రీక్వెన్సీని అమలు చేస్తే ప్రయాణికుల సంఖ్య అనేది పెరిగే అవకాశం ఉంది. 15 కోచ్ లతో ఎంఎంటీఎస్ రైళ్లు : ప్రస్తుతం ఎంఎంటీఎస్ 12 కోచ్ ల సామర్థ్యం(3500 నుంచి 3800 మంది), అదే 15 కోచ్‌లున్న మెమూ రైలు సామర్థ్యం 4500 నుంచి 5000 మంది వరకు (ఇందులో స్టాండింగ్ సహా). అలా కోచ్ లను పెంచడం వల్ల 30 నుంచి 40 శాతం అధిక సామర్థ్యం పెరుగుతుంది. దీంతో రద్దీని నియంత్రించడంతో పాటు ఫ్రీక్వెన్సీ పెరగనుంది. అలాగే రైల్వే ప్రజా రవాణా మెరుగుపడనుంది. ప్రస్తుతం లింగంపల్లి నుంచి ఫలక్‌నుమాకు ప్రతి 15 నుంచి 20 నిమిషాలకో రైలు నడుస్తోంది. ఈ సమయాన్ని 10 నిమిషాలకు తగ్గిస్తే మెరుగైన సేవలు అనేవి అందనున్నాయి. ఫలక్‌నుమాలింగంపల్లి మార్గంలో నడిచే ఒక్కో ఎంఎంటీఎస్ రైలులో నిత్యం 3 వేల నుంచి 4 వేల మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తుంటారు. ఇంత డిమాండ్ ఉన్నా ఆయా మార్గాల్లో రైళ్లు నడపడం లేదు. దీంతో చాలా మంది ప్రత్యామ్నాయాలను ఎంచుకొని ట్రాఫిక్ నరకాన్ని అనుభవిస్తున్నారు. ఈ మార్గంలో రైళ్లు నడపాలని ప్రయాణికులు సైతం కోరుకుంటున్నారు.

మేడారం జాతరకు రండి

- రాష్ట్రపతికి మంత్రి సీతక్క ఆహ్వానం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 21 : వచ్చే యేడాది జనవరిలో జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతరకు రావాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు మంత్రి సీతక్క ఆహ్వానం పలికారు. తెలంగాణ ప్రభుత్వం, ఆదివాసీ సమాజం తరఫున ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. బొల్లారం రాష్ట్రపతి నిలయంలో శుక్రవారం నాడు జరిగిన భారతీయ కళా మహోత్సవ్ లో రాష్ట్రపతిని ఆమె కలుసుకున్నారు. భారతీయ కళా, వంటకాల, ప్రజా సంప్రదాయాల వైభవాన్ని ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కలిసి అందిస్తున్న ఈ మహోత్సవం 'భిన్నత్వం లో ఏకత్వం' అనే భారత ఆత్మను ప్రతిఫలిస్తుందన్నారు. రాష్ట్రపతి మహాజాతరకు విచ్చేస్తే గిరిజన సమాజానికి ప్రోత్సాహకంగా ఉంటుందని అన్నారు. భారతీయ కళా మహోత్సవం ద్వారా భారత దేశం ఒకే స్వరంతో, ఒకే భావంతో ప్రతిధ్వనిస్తోందని సీతక్క పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్రపతి భవన్‌కు, సంబంధిత శాఖలకు మంత్రి గారు అభినందనలు తెలియజేశారు.



ప్రపంచంతో పోటీ పడేలా టీ ఐఐహెచ్‌టీ

- యేడాదిన్నర లో చేనేత రంగానికి వెయ్యి కోట్లు
- ప్రయోగశాల ప్రారంభోత్సవంలో మంత్రి 'తుమ్మల'

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 21 : ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణ ఐఐహెచ్టీని తీర్చిదిద్దుతామని మంత్రి తుమ్మల ప్రకటించారు శుక్రవారం నాడు నారాయణ గూడలోని చేనేత భవన్ లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్ లూమ్ టెక్నాలజీ సంస్థ ప్రయోగశాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో వెంకటగిరి లో ఐఐఎచ్టీ ఉందని, .రాష్ట్ర విభజన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో ఒప్పించి మన రాష్ట్రానికి రప్పించారన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ గౌరవార్థం ఐఐచెట్టీకి పేరు పేరున పెట్టామన్నారు. దేశంలోనే మంచి సంస్థగా నిలపాలని అధికారులకు మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేనేత రంగానికి మహర్దశ పట్టనుందని మంత్రి తుమ్మల వెల్లడించారు. యేడాదిన్నరలోనే వెయ్యి కోట్లు చేనేత రంగానికి నిధులు విడుదల చేశారన్నారు. గత ప్రభుత్వంలో రాజకీయ స్వార్థంతో హడావిడిగా పథకాలు ప్రారంబించి వదిలేశారని గుర్తు చేసారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్ లూమ్ అండ్ టెక్స్ టైల్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

మొదటిపేజీ తరువాయి

తో పాటు ఆబీవీఆర్ పోలీసుశిక్షణ కేంద్రానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. దేవేంద్ర సింగ్ చౌహాన్ అదనపు డీజీపీ మల్టిజోన్-II నుంచి డీజీపీ ఆఫీస్ (పర్సనల్)కు బదిలీ. పరిమళ హనా నూతన్ జాకబ్ జాయింట్ కమిషనర్ హైదరాబాద్ సిటీ నుంచి సీఐడీ డిప్యూటీ ఐజీగా బదిలీ. చేతన మైలబత్తుల వుమెన్ సేఫ్టీ వింగ్ ఎస్పీ నుంచి డిప్యూటీ డైరెక్టర్ టీజీపీఏ. వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి మహేశ్వరం జోన్ డీసీపీగా బదిలీ. పద్మజ డీసీపీ మల్కాజిగిరి నుంచి ఎస్పీ (అడ్మిన్), యాంటీ నార్కొటిక్స్ బ్యూరో. పాటిల్ సంగ్రామ్‌సింగ్ గణపత్రావ్ ఎస్పీ సీఐడీ నుంచి నాగర్‌కర్నూల్ ఎస్పీగా బదిలీ. ఖరే కిరణ ప్రభాకర్, అలాగే జయశంకర్ భూపాలపల్లి ఎస్పీ నుంచి హైదరాబాద్ డీసీపీ సౌత్ జోన్‌కు బదిలీ. చెన్నూరి రూపేశ్ ఎస్పీటీజీ యాంటీ నార్కోటిక్ నుంచి డీసీపీ ఎస్ఎం, ఐటి, హైదరాబాద్‌కు బదిలీ శబరీశ్, ఎస్పీ ములుగు నుంచి మహబూబాబాద్ ఎస్పీగా బదిలీ. నితికా పంత్.. కమాండెంట్ రెండో బెటాలియన్ నుంచి కొమరంభీం ఆసిఫాబాద్ ఎస్పీగా బదిలీ. గిరిధర్.. వనపర్తి ఎస్పీ నుంచి యాంటీ నార్కొటిక్స్ బ్యూరోకు ఎస్పీ టీజీ (ఎస్పీటీజీ)గా బదిలీ. స్నేహ మెహ్రా డీసీపీ సౌత్ జోన్ నుంచి వికారాబాద్ ఎస్పీగా బదిలీ. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా వైభవ్ గైక్వాడ్కేకన్ సుధీర్ రామనాథ్.. ములుగు ఎస్పీగా బదిలి చేశారు. సిరిసెట్టి సంకీర్త్ గవర్నర్ ఏడీసీ నుంచి జయశంకర్ భూపాలపల్లి ఎస్పీగా బదిలీ అయ్యారు. పాటిల్ కాంతిలాల్ సుభాశ్ గవర్నర్ ఏడీసీ గా నియామకం. బి.రామ్ రెడ్డి.. ఎస్పీ సీఐడీ నుంచి పెద్దపల్లి డీసీపీగా బదిలీ అయ్యారు.

మరికొందరికి ఇలా

సి.శ్రీధర్ ఎస్పీ ఇంటెలిజెన్స్ మల్కాజిగిరి డీసీపీగా బదిలీ. అవినాశ్ కుమార్ ఎస్డీపీఓ భద్రాద్రి కొత్తగూడెంకు అడిషనల్ ఎస్పీగా బదిలీ. కాజల్ ఎస్డీపీఓ ఆదిలాబాద్‌కు అడిషనల్ ఎస్పీ గా బదిలీ. కంకనాల రాహుల్ రెడ్డి ఎస్డీపీఓ భువనగిరి అడిషనల్ ఎస్పీగా బదిలీ. శేషాద్రిని సురుకొంటి ఎస్డీపీఓ నుంచి రాజన్న సిరిసిల్లకు అడిషనల్ ఎస్పీగా బదిలీ. శివం ఉపాధ్యాయ ఎస్డీపీఓ నుంచి ములుగు అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్) గా బదిలీ అయ్యారు.భైంసా ఎస్డీపీఓ గా రాజేశ్ మీనా.మౌనికా.. ఎస్పీ నుంచి ఆదిలాబాద్‌కు అడిషనల్ ఎస్పీ అడ్మిషన్‌గా గా బదిలీ అయ్యారు. మనన్ భట్.. ఏఎస్పీ గ్రేహౌండ్స్ నుంచి ఏటూరునాగారం ఏఎస్పీగా బదిలీ చేశారు.పతిపాక సాయి కిరణ్.. ఏఎస్పీ గ్రేహౌండ్స్ నుంచి నిర్మల్‌కు ఏఎస్పీ గా బదిలీ. రుత్విక సాయి కొట్టే.. ఏఎస్పీ గ్రేహౌండ్స్ నుంచి వేములవాడ ఏఎస్పీగా బదిలీ.యాదవ వసుందర ఫౌరెబి.. ఏఎస్పీ నుంచి సతుపల్లి, ఖమ్మంకు ఏఎస్పీగా బదిలీ.ఎస్. శ్రీనివాస్.. వెయిటింగ్ లిస్ట్ నుంచి ఎస్పీటీజీ ట్రాన్స్‌కోలో నియామకం.డి.సునీత.. వెయిటింగ్ లిస్ట్ నుంచి వనపర్తి ఎస్పీగా బదిలీ.కె.గుణశేఖర్.. వెయిటింగ్ లిస్ట్ నుంచి రాచకొండ డీసీపీ క్రైమ్స్‌కు బదిలీ అయ్యారు.



వర్సిటీల్లో ఖాళీగా ఉన్న 4,300 అధ్యాపక పోస్టులను భర్తీ చేస్తాం. త్వరలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లిస్తాం. కాలేజీలు, వర్సిటీల్లో రాజకీయ ప్రసంగాలకు అనుమతించబోం. విద్యాసంస్థల పనివేళలు పూర్తయిన తర్వాత రాజకీయేతర సమస్యలు చెప్పకోవడానికి ప్రత్యేక వేదికపై అవకాశం కల్పిస్తాం.

- ఏపీ మంత్రి నారా లోకేశ్

'ఈశాన్య' సంస్కృతి చాలా గొప్పది

మొదటిపేజీ తరువాయి



హవేలీల ప్రజల జానపద సంస్కృతిని హస్తకళలు, నృత్యం, సంగీతం, సాహిత్యం వంటకాల ద్వారా ఆస్వాదించగలరనే నమ్మకం వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం ప్రజలను, ముఖ్యంగా మన యువతను, మన సాంస్కృతిక వారసత్వంతో అనుసంధానించే దిశగా అనేక చర్యలు తీసుకుంటోందని అన్నారు.

వివిధ ప్రాంతాలలో నివసించే ప్రజలు

భారతీయ కళా మహోత్సవం వంటి కార్యక్రమాలు మన దేశంలోని వివిధ ప్రాంతాలలో నివసించే ప్రజలు ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి సహాయపడతాయన్నారు. ఈ అవగాహన మన దృష్టికోణాన్ని విస్తృతం చేస్తుందని చెప్పారు. అంతేకాక, ఈ విధమైన కార్యక్రమాలు మన సాంస్కృతిక వారసత్వం మీద గౌరవాన్ని పెంపొందించి, దానిని కాపాడేందుకు ప్రేరణనిస్తాయని తెలిపారు.ఈ మహోత్సవానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరై ఆనందిస్తారనే నమ్మకాన్ని రాష్ట్రపతి వ్యక్తం చేశారు. తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెఖావత్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, రాజస్థాన్ గవర్నర్ హరిభౌ బగ్డే, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు, తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా - శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క, గుజరాత్ ప్రభుత్వం గిరిజన అభివృద్ధి, ఖాదీ, హస్త, గ్రామీణ పరిశ్రమల శాఖ మంత్రి నరేశ్ మగన్‌భాయి పటేల్ కార్యక్రమానికి హాజరయ్యారు. భారతీయ కళా మహోత్సవం ఈ నెల 22 నుండి 30 వరకు రోజు ఉదయం 10:00 నుండి రాత్రి 8:00 వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ప్రవేశం ఉచితం. అంతకు ముందు హైదరాబాద్ కు విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు బేగంపేట విమానాశ్రయంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సాదర స్వాగతం పలికారు.

25న తెలంగాణ కేబినెట్ భేటీ

మొదటిపేజీ తరువాయి

పంచాయతీలు, వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ కోటాలను సిఫార్స్ చేస్తూ గురువారం సీఎస్‌కు నివేదిక సమర్పించింది. ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం, బీసీలకు కులగణన డేటా ప్రకారం 50 శాతం కోటా మించకుండా సిఫార్స్ చేసినట్లు సమాచారం.

హైకోర్టు విచారణకు ముందే

డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులను కేబినెట్ ఆమోదించాక నివేదిక ఆధారంగా పంచాయతీరాజ్ శాఖ గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా రిజర్వేషన్లు ఖరారు చేయనుంది. ఎంపీడీవోలు ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో లాటరీ ద్వారా మహిళా రిజర్వేషన్లు ప్రకటించనున్నారు. ఈ నెల 24న జరిగే హైకోర్టు విచారణకు ముందే ఈ ప్రక్రియ పూర్తయ్యేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మూడు విడతలలో పంచాయతీ ఎన్నికలు జరుగుతాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా పంచాయతీ ఎన్నికల నిర్వహణకు వేగంగా ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేస్తే ఈ నెల 24న హైకోర్టులో విచారణ పూర్తికాగానే అదే రోజు లేదా మరుసటి రోజు షెడ్యూల్ ప్రకటించాలని ఎస్ఈసీ భావిస్తోంది. డిసెంబరు 17 వరకు వార్డు సభ్యులు, సర్పంచ్‌ల ఎన్నికలు పూర్తి చేసేలా కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో దాదాపు 12,733 పంచాయతీలు, 1 లక్షా 12 వేల 288 వార్డులు ఉన్నాయి. మధ్యాహ్నం వరకు పోలింగ్ నిర్వహించి, అదే రోజున ఫలితాలు ప్రకటించేలా ఎస్ఈసీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 23న ఓటర్ల తుది జాబితా ఉంటుంది. కమిషనర్ రాణి కుముదినీ గురువారం ఉన్నతాధికారులు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పంచాయతీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఓటర్ జాబితాలో తప్పులను సరిదిద్దే ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. 23న ఓటర్ల తుది జాబితా ప్రచురించనున్నారు. బ్యాలెట్ బాక్సులు, ఇంకు తదితర ఎన్నికల సామగ్రిని ఇది వరకే ఎన్నికల సంఘం సేకరించింది. బీసీ రిజర్వేషన్లపై కోర్టులో తేలిన తర్వాతే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరపాలని మంత్రివర్గం నిర్ణయించింది. 25 న జరిగే మంత్రివర్గ సమావేశంలో కొత్త డిస్కమ్, విద్యుత్ సంస్థల ఆర్థిక పరిస్థితి, గ్రేటర్ హైదరాబాద్ లో భూగర్భ కేబుల్ వ్యవస్థ, డిమాండ్ తీర్చేందుకు కొత్త థర్మల్ ప్లాంట్ ల నిర్మాణం, ఇంధన పాలసీ అమలు, భారీగా ఉన్న సింగరేణి బొగ్గు ధర , విద్యుత్ సంస్థల అప్పులు, నష్టాలపై చర్చించనున్నారు. గడిచిన 12 యేండ్లలో విద్యుత్ రంగానికి సంబంధించిన అంశాలపై మంత్రివర్గంలో చర్చ జరుగనుండడం ఇదే ప్రథమం.

5 లక్షల కోట్ల భూ కుంభకోణం!

మొదటిపేజీ తరువాయి

క్రమబద్ధీకరించడానికి ఈ పాలసీ ప్రయత్నిస్తోందని తెలిపారు. ఈ భూముల మార్కెట్ విలువ ప్రస్తుతం ఎకరాకు రూ. 40 నుంచి 50 కోట్ల వరకు ఉందని, దీని మొత్తం విలువ రూ. 4 లక్షల కోట్ల నుంచి రూ. 5 లక్షల కోట్ల మధ్య ఉంటుందని అంచనా వేశారు. ఆ భూములను రేవంత్ కేవలం ప్రభుత్వ విలువలో 30 శాతానికే అప్పగించాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఆజామాబాద్ పారిశ్రామిక భూములను క్రమబద్ధీకరించినప్పుడు, ఎస్ఆర్ఓ రేట్ల కంటే 100 శాతం నుండి 200 వాతం అధికంగా వసూలు చేయాలని ఒక చట్టం చేశామన్నారు. కానీ కాంగ్రెస్ 30 వాతానికే చేయాలని చూస్తోందని, ఎందుకు? ఎవరికి లాభం చేకూర్చడానికి? అని ప్రశ్నించారు. మార్కెట్ ధరలు, ఎస్ఆర్ఓ విలువ కంటే నాలుగైదు రెట్లు ఎక్కువగా ఉన్నాయని వాదించారు. మిగిలిన లక్షల కోట్ల రూపాయలు నేరుగా ప్రైవేట్ వ్యక్తుల జేబులకు వెళ్తాయని ఆరోపించారు. ఈ పాలసీని ప్రభుత్వం ఆమోదించే వేగం అత్యంత అనుమానాస్పదంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. 7 రోజులలో దరఖాస్తులు, 7 రోజులలో ఆమోదాలు, 45 రోజులలో క్రమబద్ధీకరణ చేయమని చెప్పడంపై అనుమానం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి సోదరులు, అనుచరులు, మధ్యవర్తులు ఇప్పటికే ఈ భూముల కోసం ముందస్తు ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపించారు. పాలసీ ఆమోదం పొందడానికి ముందే డీల్స్ కుదిరాయని కేటీఆర్ విమర్శించారు. సమావేశంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, గణేష్ గుప్తా, మాజీ ఎంపీ మలోతూ కవిత, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, జడ్పీ మాజీ చైర్మన్ తుల ఉమా, క్రిషాంక్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ–ఈశాన్య సినీ బంధానికి నాంది

మొదటిపేజీ తరువాయి

త్రిపుర చిత్రం 'యార్వింగ్' ను వీక్షించారు. ఈ చిత్రానికి జాతీయ పురస్కార గ్రహీత ఫాదర్ జోసెఫ్ దర్శకత్వం వహించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ ఈశాన్య రాష్ట్రాలు, తెలంగాణల మధ్య సాంస్కృతిక, సాంకేతిక, యువశక్తి, మహిళా సాధికారత, ఐటీ, ఆరోగ్య రంగాలలో విస్తృత భాగస్వామ్యానికి ఈ వేదిక తోడ్పడుతుందని తెలిపారు. ఈశాన్య భారత వైవిధ్యం, తెలంగాణ చైతన్యం కలిస్తే మరింత బలోపేతమైన జాతీయ ఐక్యత సాధ్యమవుతుందన్నారు. సినిమా సరిహద్దులు లేని భాష అని, అది ప్రాంతాలు, భాషలు, జాతులు దాటి మనుషులను ఏకం చేస్తుందన్నారు. త్రిపుర, మణిపూర్, అసోం రాష్ట్రాల కథలు, సంస్కృతి దేశవ్యాప్తంగా మరింత గుర్తింపు పొందాలని అభిలషించారు. ఈ చిత్రోత్సవం ద్వారా సహ-నిర్మాణాలు, సాంకేతిక మార్పిడి, సృజనాత్మక ప్రయోగాలు పెరగాలని సూచించారు.

తెలుగు చిత్రాలను ప్రత్యేకంగా క్యూరేట్ చేసి

ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సీహెచ్ ప్రియాంక ప్రతినిధులను, అతిథులను స్వాగతించి టీజీఎఫ్‌డీసీ లక్ష్యాలు, పరిధిని వివరించారు. ఈ చిత్రోత్సవం 'తెలంగాణ - నార్త్ ఈస్ట్ కనెక్ట్' కార్యక్రమంలో భాగమని చెప్పారు. రెండు రోజుల పాటు త్రిపుర, మణిపూర్, అసోం, మేఘాలయ, సిక్కిం, తెలంగాణ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించే 12 చిత్రాలను ప్రదర్శిస్తున్నామని తెలిపారు. జాతీయ అవార్డులు పొందిన చిత్రాలతో పాటు, తెలంగాణ గ్రామీణ జీవనవిధానం, కళాశైలులు, సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబించే ప్రముఖ తెలుగు చిత్రాలను ప్రత్యేకంగా క్యూరేట్ చేసి ప్రదర్శిస్తున్నామని వివరించారు. వాటిలో తారా (సిక్కిం-నేపాలీ), కుకీ (హిందీ), ఓనాతా (ఖాసీ- మేఘాలయ), ఈఖోయిగి యుమ్ (మణిపూర్), రాడార్ అండ్ ఫాకీ (అసోం) ఉన్నాయి. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ప్రశంసలు పొందిన నా బంగారుతల్లి, పొట్టేల్, మల్లేశం, బలగం చిత్రాలు ప్రదర్శించబడతాయి. ఈ కార్యక్రమములో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వాకిటి శ్రీహరి, టీజీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు, ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, ఐఅండ్ పీఆర్ డైరెక్టర్ కిషోర్ బాబు, అదనపు డైరెక్టర్ డీఎస్ జగన్, ఈశాన్య రాష్ట్రాల ప్రతినిధులు, దర్శకులు, సినీ ప్రముఖులు పాల్గొన్నారు.




విద్యార్థులకు సీఎం రేవంత్ అభినందన

వివిధ క్రీడా పోటీలలో అవార్డులు సాధించిన క్రీడాకారులను సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం నాడు అభినందించారు. ఈఎంఆర్ఎస్ నేషనల్ స్పోర్ట్స్ మీట్-2025లో తెలంగాణ విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించారు. కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మన్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

– ప్రతిపక్షం, హైదరాబాద్

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

- అప్పుడే మానవాళికి మనుగడ
- అటవీ శాఖ ప్రధాన సంరక్షణాధికారి డా. సి. సువర్ణ



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 21 : 'పట్టణీకరణ, నగరీకరణతో పర్యావరణ కాలుష్యం పెరుగుతోంది, వ్యర్థాలు పేరుకు పోతున్నాయి. ఇలాగే కొనసాగితే భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది' అని తెలంగాణ అటవీ శాఖ ప్రధాన సంరక్షణాధికారి డా. సి. సువర్ణ అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం కేంద్రంలోని అటవీ, పరిశోధన సంస్థలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, తెలంగాణ ఉన్నత విద్యా మండలి, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సౌజన్యంతో 'పర్యావరణం - వ్యర్థాల నిర్వహణ సమస్యలు, ప్రభావాలు, సవాళ్లు మరియు అవకాశాలు' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవాం ప్రారంభమైంది. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల పరిశోధకులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పర్యావరణ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ సదస్సుకు కళాశాల డీన్ వి. కృష్ణ అధ్యక్షత వహించగా, హార్టికల్చర్ వర్సిటీ వీసీ డా.డి.రాజిరెడ్డి, తెలంగాణ అటవీ సంరక్షణాఅధికారి డా. ప్రియాంక వర్గీస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. సువర్ణ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకుంటేనే మానవాళి మనుగడ, భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రజలలో పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తర్వాత డా. డి. రాజిరెడ్డి మాట్లాడుతూ వ్యర్థాల నుండి సంపదను సృష్టించే పద్ధతులు కనిపెట్టి, కొత్త తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి, పర్యావరణాన్ని కాపాడే బాధ్యతను యువత, పరిశోధకులు, విద్యార్థులు తీసుకోవాలని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని డా. ప్రియాంక వర్గీస్ సూచించారు. ఈ సదస్సులో కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, సదస్సు కార్య నిర్వాహక కార్యదర్శి డా.ఎన్.ఎస్.శ్రీనిధి, కళాశాల అధ్యాపకులు ప్రొ.మమత, డా.శ్రీధర్, డా. రీజా, డా. శాలిని, డా. చిరంజీవి, డా. ప్రియా, డా. జగదీష్, డా. నికిత, డా. అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

కొందరి తెలంగాణ కాదు, అందరి తెలంగాణ కావాలి

- కబ్జాలు, భూసేకరణపై ప్రభుత్వానికి ప్రశ్నల వర్షం
- కబ్జాలు, ఆర్ఆర్ఆర్, ఫార్మా సిటీపై ఘాటు వ్యాఖ్యలు
- జనం బాటలో గళమెత్తిన జాగృతి కవిత



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 21: 'కొందరి తెలంగాణ కాదు, అందరి తెలంగాణ కావాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. రంగారెడ్డి జిల్లాలో రెండు రోజులపాటు సాగనున్న 'జనం బాట' కార్యక్రమంలో కవిత శుక్రవారం మహేశ్వరం, కందుకూరు, ఇబ్రహీంపట్నం, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, చేవెళ్ల, షాద్‌నగర్ ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. మహేశ్వరంలో పాండురంగారెడ్డి ఏర్పాటు చేసిన తెలంగాణ జాగృతి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం ఎలిమినేడులో ఏరోస్పేస్ పార్క్ నిర్మాణం కారణంగా భూములు కోల్పోతున్న నిర్వాసిత మహిళలతో సమావేశమై వారి బాధలు తెలుసుకున్నారు. భూములు కోల్పోయిన ప్రతి కుటుంబానికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. తరువాత మీడియాతో మాట్లాడిన కవిత, జిల్లాలో భూసేకరణ, చెరువు కబ్జాలు, ఆర్ఆర్ఆర్ ప్రాజెక్ట్, ఫార్మా సిటీ సహా పలు అంశాలపై తీవ్రమైన విమర్శలు చేశారు. ట్రిపుల్ ఆర్ భూసేకరణలో భారీ అక్రమాలు జరిగాయని, ఆర్ఆర్ఆర్ ఆలైన్‌మెంట్‌ను సీఎం, మంత్రులు, కొందరు బీఆర్ఎస్ నేతల ప్రయోజనాలకు అనుగుణంగా నాలుగుసార్లు మార్చారని ఆరోపించారు. పేద రైతుల భూములే ఎక్కువగా పోతున్నాయని, దీనిపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని బాధితులతో కలిసి కలుస్తానని, రీసర్వే చేయాల్సిందేనని అన్నారు.

భూ భారతి రైతులకు భారంగా మారింది

- మండిపడిన మాజీ మంత్రి హరీశ్ రావు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 21: రాష్ట్రంలో భూ రిజిస్ట్రేషన్లు, భూ సమస్యలు తీవ్రమవుతున్న నేపథ్యంలో వరుస ఆత్మహత్యాయత్నాలపై ప్రభుత్వం వైఖరిని మాజీ మంత్రి, హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. భూ భారతి వ్యవస్థ అమలులోకి వచ్చిన తర్వాత రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. 'మొన్న మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలో భూమి రిజిస్ట్రేషన్ సాగడం లేదన్న కారణంతో ఇద్దరు అన్నదమ్ములు పురుగుల మందుతో ఆందోళన చేసిన ఘటన తాజాగా నిలిచింది. నిన్న నాగర్ కర్నూలులో భూమి రిజిస్ట్రేషన్ ఆలస్యంపై అసహనం వ్యక్తం చేస్తూ ఒక రైతు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన మరోసారి భూ సమస్యలపై చర్చను రగిలించింది. ఎన్నికల సమయంలో రైతుల భూ హక్కులను 100 శాతం కాపాడతామని, ఎవరూ భూ సంబంధిత సమస్యలతో ఆత్మహత్యలు చేసుకోరాదని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి మాటలు ఇప్పుడు అమలు కాలేదని' హరీశ్ రావు విమర్శించారు. 'ధరణిని విమర్శించి తెచ్చిన భూ భారతి రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైంది. భూ భారతి అవినీతి, అక్రమాలు, అడ్డగోలు వసూళ్లకు కేంద్రంగా మారిందని ప్రజల ఆవేదన' అని ఆరోపించారు. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు సాకులు చెబుతోందని, ఇకనైనా రెవెన్యూ శాఖ మేల్కొని పెండింగ్ సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



నగరంలో చారిత్రిక నాణేల జాతీయ సదస్సు

- బ్రోచర్‌ను ఆవిష్కరించిన మంత్రి 'జూపల్లి'

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 21 : మరో జాతీయ సదస్సుకు హైదరాబాద్ వేదిక కాబోతున్నది. రాష్ట్రంలో తొలిసారిగా జాతీయస్థాయిలో చారిత్రిక నాణేల సదస్సు నిర్వహణకు రంగం సిద్ధమైంది. రాష్ట్ర వారసత్వ శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 11, 12 తేదీలలో107వ వార్షిక జాతీయ నాణేల సదస్సు, సెమినార్ నిర్వహించనున్నారు. సదస్సు బ్రోచర్‌ను శుక్రవారం నాడు సచివాలయంలో పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. న్యూమిస్మాటిక్ సొసైటీ ఆఫ్ ఇండియా సహకారంతో తెలంగాణ వారసత్వ శాఖ సంయుక్తంగా ఈ ప్రతిష్టాత్మక సదస్సును నిర్వహిస్తోంది. రాష్ట్ర ఆవిర్భావం తరువాత నాణేల అధ్యయనంపై ఇంతటి ముఖ్యమైన జాతీయ స్థాయి కార్యక్రమం హైదరాబాద్‌లో జరగడం ఇదే మొదటిసారి కావడం విశేషం.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ నాణేల చరిత్ర ద్వారా తెలంగాణ రాష్ట్ర గొప్ప చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని దేశానికి చాటి చెప్పేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని పేర్కొన్నారు.

కేటీఆర్ చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలు

- భూముల కన్వర్షన్ కోసమే ఇంపాక్ట్ ఫీజు
- కుంభకోణంగా చిత్రీకరించడం దారుణం
- ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 21 : పారిశ్రామిక భూముల కన్వర్షన్ కోసం ఇంపాక్ట్ ఫీజు వసూలు చేయాలని నిర్ణయిస్తే దానిని 56 లక్షల కోట్ల కుంభకోణంగా చిత్రీకరిస్తూ కేటీఆర్ దుష్ప్రచారం సాగిస్తున్నారని ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు మండిపడ్డారు. ప్రభుత్వం పరిశ్రమలకు లీజుకిచ్చిన భూములపై యాజమాన్య హక్కులు కల్పిస్తూ 'ఫ్రీహోల్డ్' రైట్స్ పేరిట 2023 ఆగస్టులో మూడు జీఓలు ఇచ్చింది వారి ప్రభుత్వ హయాంలో కాదా! అని ప్రశ్నించారు. అంబేడ్కర్ సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ ఆరోపణలను ఆధారాలతో శ్రీధర్ బాబు తిప్పికొట్టారు. 'కేటీఆర్ చెబుతున్న 9,292 ఎకరాల భూమిలో పరిశ్రమలకు ప్లాటింగ్ చేసి కేటాయించింది 4740 ఎకరాలే. మిగిలిన భూమి రోడ్లు, డ్రెయినేజి లాంటి మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించారని' శ్రీధర్‌బాబు వివరించారు. ఈ కేటాయింపులు ఒక్కరోజులో చేసినవి కాదని, పరిశ్రమల అభివృద్ధి కోసం దశాబ్దాల కాలంగా ఇస్తూ వచ్చినవని అన్నారు. ఆజామాబాద్, కూకట్ పల్లి, హఫీజ్ పేట పరిశ్రమల భూములను ఫ్రీ హోల్డ్ పేరిట యాజమాన్య హక్కులు కల్పించినది బీఆరెస్ ప్రభుత్వమేనన్నారు. ఇప్పుడు ఆ భూములకు కన్వర్షన్ అవకాశం కల్పిస్తున్నామన్నారు. 30, 50 శాతం స్లాబులతో ఇంపాక్టు ఫీజు నిర్ణయిస్తూ ఈనెల 17 న జరిగిన కేబినెట్ లో ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, 2023లో ఎన్నికలకు నాలుగు నెలల ముందు ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించారని తెలిపారు. అప్పుడు ఎన్ని లక్షల కోట్లు వసూలు చేసుకున్నారో చెప్పాలంటూ కేటీఆర్ కు మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. ఆ జీఓల విషయం దాచిపెట్టి ప్రభుత్వంపై నిరాధార నిందలు వేస్తున్నారని మండిపడ్డారు.



షాద్ నగర్ లో కార్డన్ సర్చ్

- భారీగా మోహరించిన పోలీసులు
- శంషాబాద్ డీసీపీ రాజేశ్ ఆధ్వర్యంలో తనిఖీలు

ప్రతిపక్షం, షాద్ నగర్, నవంబర్ 21: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ఫరూక్ నగర్ ప్రాంతంలో పోలీసులు శుక్రవారం పెద్ద ఎత్తున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణ నేతృత్వంలో పట్టణ సీఐ విజయకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేశారు. శంషాబాద్ డీసీపీ రాజేశ్, అడిషనల్ డీసీపీ పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు. ఫరూక్ నగర్ ప్రాంతాలలో పలుచోట్ల తిరుగుతూ వాహనాలను తనిఖీ చేశారు. సోదాలు జరిపారు. తనిఖీలు ముమ్మరంగా కొనసాగాయి.



పోలవరంలో కేంద్ర బృందం పర్యటన

- ప్రాజెక్ట్ నిర్మాణ తీరు పరిశీలన

ప్రతిపక్షం ప్రతినిధి, విజయవాడ, నవంబర్ 21: ఏపీలోని పోలవరం ప్రాజెక్ట్‌ను శుక్రవారం నాడు కేంద్ర జల సంఘం ప్రతినిధులు పరిశీలించారు. కేంద్ర జల సంఘం డిజైన్లు, పరిశోధన విభాగం సభ్యుడు ఆదిత్యశర్మ, కేంద్ర జల సంఘం చీఫ్ ఇంజనీర్ ఎస్ ఎస్ భక్షితో పాటు పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సభ్య కార్యదర్శి ఎం. రఘురాం ప్రాజెక్టును సందర్శించినవారిలో ఉన్నారు. ప్రాజెక్ట్ లో జరుగుతున్న పనులను వారు ఆసాంతం పరిశీలించారు. జలవనరుల శాఖ ఈఎన్సీ కె. నరసింహమూర్తి, పోలవరం ఎస్ఈ కె రామచంద్రరావు, క్వాలిటీ కంట్రోల్ విభాగం సీఈ కె శేషబాబు, డీఈలు కె బాలకృష్ణ, డి . శ్రీనివాస్, ప్రేంచంద్, ఎంఈఐఎల్ జీఎం ఏ గంగాధర్, డీజీఎం మురళి తదితరులు పనులు జరుగుతున్న తీరును వారికి చూపించటంతో పాటు వివరాలు అందించారు. పోలవరం ప్రాజెక్ట్ వ్యూ పాయింట్ నుంచి మొత్తం పనుల వివరాలను కేంద్ర బృందానికి వివరించారు. ఆ తరువాత వారు మోడల్ డ్యామ్ ను, స్పిల్ వే, గేట్లు, గేట్లను పరిశీలించారు.

పెట్టుబడులకు స్వర్గధామం హైదరాబాద్



- వ్యాపార వేత్తల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 21: దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ పెట్టుబడులకు స్వర్గధామమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన ప్రజా భవన్ లో కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డెల్లాయిట్, ఈవై, కేపీఎంజీ, బీసీజీ, పీడబ్ల్యూసీ, జెఎల్ఎల్ సహా పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. తమ ప్రజాప్రభుత్వం 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ స్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతోందన్నారు. రాష్ట్ర అర్థికాభివృద్ధికి, పెట్టుబడులకు వాతావరణ పరిస్థితులు, భౌగోళిక అంశాలతో పాటుగా నైపుణ్యంతో కూడిన తక్కువ ధరలకే మానవ వనరులు అందుబాటులో ఉండడం కలిసివచ్చే అంశాలని అన్నారు. దేశంలో ఈ విధమైన రాష్ట్రం మరెక్కడా లేదని పెట్టుబడిదారులకు వివరించారు. రాష్ట్రంలో డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కూడా బలంగా ఉందన్నారు. సైబర్ క్రైమ్ విషయంలో తెలంగాణ దేశంలోనే పేరెన్నికగన్నదని చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పట్ల పూర్తిస్థాయి నమ్మకం కలగడంతో అంతర్జాతీయ పెట్టుబడిదారులు తెలంగాణ రాష్ట్రంలో సురక్షితంగా ఉంటారని ధైర్యంగా చెప్పగలను అని డిప్యూటీ సీఎం అన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఎనర్జీ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, ఇండస్ట్రీస్, ఐటీ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్ రంజన్, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్, సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్, స్పెషల్ సెక్రెటరీ సంజయ్ కుమార్ పాల్గొన్నారు.



ఎన్‌ఫోర్స్ మెంట్‌ను కఠినతరం చేయాలి

- అధికారులకు రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 21: రవాణా శాఖలో ఎన్ ఫోర్స్ మెంట్ ను మరింత కఠినతరం చేయాలని రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి కొత్తగా ఏర్పడిన 33 జిల్లా స్థాయి బృందాలు ,3 రాష్ట్ర స్థాయి ఫ్లైయింగ్ స్క్వాడ్ నిరంతర తనిఖీలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ సంబంధిత ట్రాక్టర్లు, సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. పది రోజుల వ్యవధిలో కొత్తగా ఏర్పడిన బృందాల ద్వారా రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 4,748 కేసులు, 3, 420 వాహనాలు సీజ్ అయ్యాయన్నారు. హెవీ వెహికిల్ డ్రైవర్స్ కి పునశ్చరణ ట్రైనింగ్ ఏర్పాటు చేయాలన్నారు. మైనింగ్ శాఖతో సమన్వయం చేసుకుంటూ వాహనాలలో ఓవర్ లోడ్ కాకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. ఓవర్ లోడ్ చేసిన వాహనాల సీజ్, రెండవ సారి పట్టుబడితే పర్మిట్ రద్దు ,డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయాలని సూచించారు. జనవరిలో జరిగే రోడ్డు భద్రతా మాసంపై కార్యాచరణ రూపొందించాలని కూడా మంత్రి అధికారులను ఆదేశించారు.

జగిత్యాల జిల్లాలో 31 మందికి గల్ఫ్ ఎక్స్ గ్రేషియా

- ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 21: గల్ఫ్ దేశాలలో మృతి చెందిన 31 మంది జగిత్యాల జిల్లావాసుల వారసులకు రూ. ఐదు లక్షల చొప్పున రూ. ఒక కోటీ 55 లక్షల గల్ఫ్ ఎక్స్ గ్రేషియాను ప్రభుత్వం మంజూరి చేసిందని ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వీరికి నిధుల విడుదలకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. జిల్లాలో 31 మార్చి వరకు 50 మందికి రూ. రెండున్నర కోట్లు, గల్ఫ్ ఎక్స్ గ్రేషియా చెల్లింపు జరిగిందని, రాష్ట్రంలో ఇప్పటివరకు 165 గల్ఫ్ మృతుల కుటుంబాలు లబ్ది పొందారని మంద భీంరెడ్డి వివరించారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నదని ఆయన అన్నారు.

వారం రోజుల పాటు ఆధార్ సేవలు నిలిపివేత

- మరొకొన్ని కేంద్రాలలో కొనసాగనున్న సేవలు




ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 21: కొన్ని కేంద్రాలలో ఆధార్ సేవలు వారం రోజులపాటు నిలిచిపోనున్నాయి. కొన్ని కేంద్రాలలో యథాతథంగా కొనసాగనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఈఎస్డీ (ఎలక్ట్రానిక్స్ సర్వీస్ డెలివరీ) ఆధార్ కేంద్రాలలో సేవలు గురువారం నుంచి నిలిచిపోయాయి. ఈ నెల 26 వరకు సేవలు అందుబాటులో ఉండవని సమాచారం. కొత్త ఐడీలు, అప్‌డేట్ వెర్షన్లు ఇన్‌స్టాల్ అవుతున్నందున సేవలు నిలిచిపోయాయని జిల్లా మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. తపాలా కార్యాలయాలు, పాఠశాలలు, బ్యాంకులలోని ఆధార్ సేవలు యథావిధిగా కొనసాగుతాయని చెప్పారు. ఇకపై హోటల్, రెస్టారెంట్, అపార్ట్‌మెంట్ ఇలా ఎక్కడికి వెళ్లినా ఆధార్ యాక్సెస్ తప్పనిసరి కావొచ్చు. ఎందుకంటే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఓ కీలక మార్పు ఇందుకు కారణం. ఆ మేరకు యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా త్వరలో కొత్త విధానం కూడా తీసుకురానుంది. అదే ఆఫ్‌లైన్ వెరిఫికేషన్. ఇందుకు సంబంధించి కొత్త యాప్‌ను సైతం తీసుకురాబోతున్నట్లు ప్రకటించింది. ఆఫ్‌లైన్ ఐడీ చెక్‌ను కూడా ప్రవేశపెడితే ఆధార్ హార్డ్ కాపీలు చూపించాల్సిన అవసరం ఉండదు.

స్వదేశీ వస్తువుల వినియోగం పెరగాలి

- 'ఆత్మనిర్భర్ భారత్' సదస్సులో రామచంద్రరావు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 21: దేశంలో స్వదేశీ వస్తువుల వినియోగం పెరగాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సూచించారు. ప్రజల ఆలోచనా స్వదేశీ వస్తువులని వినియోగించేలా ఉండాలని కోరారు. భారతదేశం ఇతర దేశాల వస్తువుల మీద ఆధారపడకూడదని ప్రధానమంత్రి మోడీ 'ఆత్మనిర్భర్ భారత్'కు పిలుపునిచ్చారని గుర్తుచేశారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం 'ఆత్మనిర్భర్ భారత్' వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడారు. యాంటీ ఇండియా ఐడియాలజీ ఉన్నవారికి కాంగ్రెస్ నిన్న ఇందిరాగాంధీ అవార్డులు ఇవ్వడం దుర్మార్గమని మండిపడ్డారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా మనమందరం ముందుకెళ్లాలని సూచించారు. చైనా, అమెరికా తమ ఉత్పత్తులను పెంచి.. ప్రపంచ దేశాలను తమ గుప్పిట్లో పెట్టుకున్నాయని విమర్శించారు. గతంలో మాదిరిగా ఇప్పుడు ఎవరి మీద భారతదేశం ఆధారపడే పరిస్థితి లేదని తెలిపారు. ఆపరేషన్ సింధూర్ స్వదేశీ ఆయుధాలతో జరిగిందని.. అందుకే ఈ ఆపరేషన్ అంత సక్సెస్ అయ్యిందని రామచంద్రరావు పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ నేత చంద్రశేఖర్ తివారి పాల్గొన్నారు.



రాష్ట్రంలో అందరికీ గృహాలు అందించేందుకు భారీ ప్రణాళికను రూపొందిస్తున్నాం. వచ్చే ఉగాది నాటికి 5 లక్షల లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందించాలి. మూడేళ్లలో 17 లక్షల ఇళ్లను నిర్మించేలా కార్యాచరణ చేపట్టాలి. అర్హులను గుర్తించేందుకు సర్వేను వేగవంతం చేయాలి. పెండింగ్‌లో ఉన్న బిల్లులు వచ్చేలా కేంద్రంతో చర్చించాలి.

-అధికారులతో ఏపీ సీఎం చంద్రబాబు

ఓపెన్ వాయిస్

‘గడువు’కు రాజ్యాంగం అనుమతించదు

రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులకు సమ్మతి తెలిపే విషయంలో గవర్నర్లకు, రాష్ట్రపతికి న్యాయస్థానం కాలపరిమితిని నిర్దేశించలేదని సుప్రీంకోర్టు తెలిపింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సంధించిన ప్రశ్నలకు జవాబిస్తూ, పెండింగ్ బిల్లుల ఆమోదంపై గడువు విధించడం రాజ్యాంగానికి తగదని కోర్టు స్పష్టం చేసింది. అయితే, ఈ తీర్పు ద్వారా గవర్నర్‌కు అపరిమిత అధికారం లభించలేదని ధర్మాసనం తేల్చి చెప్పింది. ఆర్టికల్ 200 కింద గవర్నర్లకు విచక్షణ అధికారం ఉన్నప్పటికీ, కారణం చెప్పకుండా బిల్లులను శాసనసభకు తిరిగి పంపడం కుదరదని స్పష్టం చేసింది. ఆర్టికల్ 143 కింద పంపిన ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్ పై సుప్రీంకోర్టు స్పందిస్తూ బిల్లులపై నిర్ణయం తీసుకునేందుకు రాష్ట్రపతి, గవర్నర్లకు కోర్టు ఎటువంటి కాలపరిమితిని నిర్ణయించలేదని తెలిపింది. గవర్నర్ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేశారంటూ కోర్టు బిల్లును ఆమోదించలేదని కూడా పేర్కొంది. ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్ పై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ, ఆర్టికల్ 200/201 ప్రకారం బిల్లు మీద నిర్ణయం తీసుకునేందుకు గవర్నర్, రాష్ట్రపతికి సుప్రీం కోర్టు కాలపరిమితిని నిర్ణయించలేమని కోర్టు తెలిపింది. బిల్లుపై నిర్ణయం తీసుకునేందుకు వారిని కాలపరిమితిలో బంధించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంది. ఆర్టికల్ 200 ప్రకారం, గవర్నర్ బిల్లును ఆమోదించవచ్చు, అసెంబ్లీకి తిరిగి పంపవచ్చు లేదా రాష్ట్రపతికి పంపవచ్చు, అయితే అసెంబ్లీ ఏదైనా బిల్లును తిరిగి పంపితే, గవర్నర్ దానిని ఆమోదించాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు తెలిపింది. బిల్లులకు ఆమోదం తెలిపేటప్పుడు రాష్ట్రపతి లేదా రాష్ట్ర గవర్నర్లు నిర్ణీత సమయాలను పాటించాలని బలవంతం చేయరాదని తీర్పు ఇచ్చింది. వారి చర్యలు ‘న్యాయబద్ధం’ కాదని, బిల్లు చట్టంగా రూపొందించిన తర్వాత మాత్రమే న్యాయ సమీక్ష ప్రారంభించవచ్చని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. ఆర్టికల్స్ 200 ,201 ప్రకారం కోర్టులు కాలపరిమితితో కూడిన చర్యను నిర్దేశించవచ్చా లేదా అనే దానిపై స్పష్టత కోరుతూ రాష్ట్రపతి సూచనకు ప్రతిస్పందిస్తూ, అటువంటి గడువును విధించడం రాజ్యాంగ విరుద్ధమని ధర్మాసనం అభిప్రాయపడింది. చట్టాన్ని నిర్వహించేటప్పుడు అధికారులు నిర్ణీత వ్యవధిలో తగు చర్యలు తీసుకోవాలని న్యాయపరంగా బలవంతం చేయవచ్చనే భావనను ఈ తీర్పు సమర్థంగా పక్కన పెడుతుంది.

ప్రతిపక్షం
హైదరాబాద్
శనివారం
22.11.2025

న్యాయ పరిశీలన పరిమితిని వివరిస్తూనే, సుప్రీం నిష్క్రియాత్మకతకు వ్యతిరేకంగా బలమైన హెచ్చరిక జారీ చేసింది. గవర్నర్ నిర్ణయం యోగ్యతలను పరిశీలించలేకపోయినా, ‘బిల్లులను నిరవధికంగా నిలిపివేయడం, విధానపర ప్రతిష్టంభనను సృష్టించడం రాజ్యాంగానికి విరుద్ధమని అది నొక్కి చెప్పింది. భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయి న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహా, ఎఎస్ చందూర్కర్‌తో కూడిన ధర్మాసనం పది రోజుల పాటు విచారించింది. సెప్టెంబర్ 11న ఈ కోర్టు తన అభిప్రాయాన్ని రిజర్వ్ చేసింది. తమిళనాడు గవర్నర్ కేసులో ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో ప్రెసిడెన్షియన్ రిఫరెన్స్ వివాదం మే నెలలో వెలుగులోకి వచ్చింది. ఈ తీర్పు ప్రకారం రాష్ట్రపతి, గవర్నర్లు నిర్ణయం తీసుకోవడానికి కాలపరిమితిని నిర్దేశించింది. ఇప్పుడు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు అధికారిక మార్గదర్శకత్వాన్ని అందించనుంది. తమిళనాడు రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించి పంపిన 11 బిల్లులలను అక్కడి గవర్నర్ బీఎన్ రవి ఆమోదించకుండా పక్కనబెట్టేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పంజాబ్, కేరళ గవర్నర్లు కూడా అసెంబ్లీలు పంపిన బిల్లులను ఆమోదించలేదు. వీటిపై దాఖలైన పిటిషన్లపై స్పందించిన సుప్రీంకోర్టు, రాష్ట్రపతి, గవర్నర్లు మూడు నెలలలో బిల్లులను ఆమోదించి పంపాల్సిందేనని, లేదా ఆటోమేటిగ్గా అవి ఆమోదం పొందినట్లేనని కీలక తీర్పు ఇచ్చింది. అప్పటికే తమిళనాడు గవర్నర్ పెండింగ్ లో పెట్టిన 11 బిల్లులను ఆటోమేటిగ్గా అమోదిస్తూ ఆదేశాలు కూడా ఇచ్చింది. దీనిపై ఆ తర్వాత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సుప్రీంకోర్టు వివరణ కోరారు. రాజ్యాంగంలో ఈ మేరకు ఉన్న నిబంధనలను పరిశీలించాలని కోరారు. దీంతో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపింది. రాష్ట్రపతి, గవర్నర్లకు బిల్లుల ఆమోదం విషయంలో గడువులు పెట్టలేమని తేల్చి చెప్పేసింది.

చరిత్ర మరిచిన ఝల్కారీ బాయి

1857 స్వాతంత్ర్య సంగ్రామంలో ఝాన్సీ రాణి లక్ష్మీబాయి సైన్యంలో ఆమెకు సమానంగా సాహసంగా రాణి రూపంలో బ్రిటీష్ సైనికులతో పోరాడిన ధీరవనిత ఝల్కారీబాయి. యుద్ధంలో, ఝల్కారీ బాయి తనే రాణిగా చెప్పి మోసగించి, బ్రిటిష్ సైన్యాన్ని తీవ్ర గందరగోళానికి గురిచేసి రాణి లక్ష్మీబాయి సురక్షితంగా తప్పించుకునే అవకాశాన్ని కల్పించి కాపాడింది. ఇక్కడ నిజమైన యుద్ధం చేసిన మహిళ ఝల్కారీ బాయే కదా! ఇప్పటికీ అనేక మంది సాహిత్యకారులు తమ రచనలలో రాణి లక్ష్మీబాయి వీరత్వాన్ని ఎంతగానో కొనియాడారు. పాఠ్య పుస్తకాలలో, చరిత్ర పుస్తకాలలో, అకాడెమీలలో ఆమెను వీర పోరాట వనితగా చిత్రీకరించడం గమనార్హం.



సంపతి రమేశ్ మహారాజ్
7989579428


భారతీయ చరిత్రలో వక్రీకరణ, వివక్షతల జాడ్యం వలన బహుజనుల వీరత్వం, పోరాటాలకు స్థానం ఇవ్వలేదు. ఈ దేశ సంఘసంస్కర్తలుగా, విప్లవ పోరాట యోధులుగా ఆధిపత్య కులాల వాళ్లే బ్రాండ్ వేసుకున్నారు. వారి చరిత్రనే మన విద్యా వ్యవస్థలో చదువుకుంటున్నాం. చరిత్ర ఎరుగనీ అసమాన్యులుగా ఎంతో మంది దళిత పీడిత వర్గాల నుంచి ఉన్నారు. ఇందులో ప్రధానంగా చెప్పుకోవాల్సిన గొప్ప పోరాట వీరనారి ఝల్కారీ బాయి గురించి. భారతదేశ చరిత్ర తిరగేస్తే అణగారిన కులాల మహిళలు, పురుషులు కనిపించరు. వివక్ష కారణంగా అణగారిన కులాల మహిళల త్యాగాలు, బలిదానాలు, చరిత్ర అంచులను కూడా తాకలేదు. ఆంగ్లేయులతో వీరోచిత పోరాటం చేసిన వీరవనిత ఝల్కారీ బాయి 1857 తిరుగుబాటు చరిత్రకు అందకుండా పోయింది. భారతదేశ ప్రథమ స్వాతంత్ర్య తిరుగుబాటులో రాణి లక్ష్మీబాయి, నానాసాహెబ్, తాంతియా తోపే, బహదూర్ షా జఫర్, మంగళ్ పాండే, బేగం హజ్రత్ మహల్, కున్వర్ సింగ్ వంటి కొందరు ముఖ్యులనే చరిత్రలో ప్రస్తావించారు. అగ్రకుల ఆధిపత్యం కారణంగా బ్రిటిష్ సైన్యంతో తలపడని, ఎదుర్కోని ఝాన్సీ రాణి లక్ష్మీబాయి వీరవనితగా చరిత్రలో నిలిస్తే, ప్రాణాలు పణంగా పెట్టి యుద్ధం చేసిన వీరనారి ఝల్కారీబాయి దళిత కులానికి చెందిన కారణంగా చరిత్రలో లేకుండా పోయింది. ఆమె 1857నాటి స్వతంత్ర సమరంలో ఝాన్సీ రాణి లక్ష్మీబాయి సైన్యంలో పనిచేసింది. కానీ, సావర్కార్ తన పుస్తకంలో ఝల్కారీ బాయి ఝాన్సీరాణికి దాసిగా ప్రస్తావించారు. వాస్తవంగా ఝల్కారీబాయి ఝాన్సీలక్ష్మీభాయి ఏర్పాటు చేసిన మహిళా సైన్యంలో కమాండర్.


రాణి లక్ష్మీబాయితో సమానంగా

1857 స్వాతంత్ర్య సంగ్రామంలో ఝాన్సీ రాణి లక్ష్మీబాయి సైన్యంలో ఆమెకు సమానంగా సాహసంగా రాణి రూపంలో బ్రిటిష్ సైనికులతో పోరాడిన ధీరవనిత ఝల్కారీబాయి. యుద్ధంలో, ఝల్కారీ బాయి తనే రాణిగా చెప్పి మోసగించి, బ్రిటిష్ సైన్యాన్ని తీవ్ర గందరగోళానికి గురిచేసి రాణి లక్ష్మీబాయి సురక్షితంగా తప్పించుకునే అవకాశాన్ని కల్పించి కాపాడింది. ఇక్కడ నిజమైన యుద్ధం చేసిన మహిళ ఝల్కారీ బాయే కదా! ఇప్పటికీ అనేక మంది సాహిత్యకారులు తమ రచనలలో రాణి లక్ష్మీబాయి వీరత్వాన్ని ఎంతగానో కొనియాడారు. పాఠ్య పుస్తకాలలో, చరిత్ర పుస్తకాలలో, అకాడెమీలలో ఆమెను వీర పోరాట వనితగా చిత్రీకరించడం గమనార్హం.

బాల్యం నుంచే ధీర వనిత

ఝల్కారీబాయి 22 నవంబర్ 1830లో బుందేల్ ఖండ్ ఝాన్సీలోని భోజలా గ్రామంలో పుట్టింది. తల్లి దనియా, తండ్రి మాల్ చంద్ కోరి కులానికి చెందినవారు. చిన్ననాడే ఝల్కారీ బాయిలో వీరత్వం, సాహసం, ధైర్యం ప్రతిధ్వనించింది. పన్నెండేండ్ల వయస్సులో అడివిలో పశువులు కాస్తున్నప్పుడు పులి పశువుల మీద పడితే పులితోనే తలపడి చంపింది. ఈ విషయం ఝాన్సీరాణి లక్ష్మీబాయి దాకా చేరింది. అట్లాంటి వీరత్వం ఉన్న అమ్మాయిని కోడలుగా చేసుకోవాలని సైనికుడిగా ఉన్న పూరన్ తల్లి కూడా ఇష్టపడింది. ఝల్కారీ వివాహము పూరన్‌తో జరిగింది. పూరన్ కుటుంబం ఝాన్సీ కోటకు దగ్గరగా ఉన్న ‘నయాపూరా’లో నివసించేది. వారిది బట్టలు నేసే పేద ‘కోరి’ కులం. ఝల్కారీ రూపురేఖలు చూసిన ఝాన్సీ లక్ష్మీబాయి ఆమెను మహిళా సైనిక దళంలో చేర్చుకోవాలనుకున్నది. పూరన్ ప్రోత్సాహం, స్వతహాగా ఉన్న ఆసక్తితో ఝల్కారీ బాయి భర్త దగ్గర గుర్రపు స్వారీ, కత్తియుద్ధం, మల్లయుద్ధం, ఫిరంగులు పేల్చడం, బాణ విద్య వంటి యుద్ధ నైపుణ్యాలు నేర్చుకున్నది. అంటరాని ‘కోరి’ దళిత మహిళ మహిళా సైనిక దళానికి నాయకురాలుగా ఎదిగింది. దళిత సమాజం ఆమె ఘనతను స్ఫూర్తిదాయకంగా భావించింది. ఝాన్సీ, బుండెల్ ఖండ్ ప్రాంతాలలో కథలు, గీతాలు ఇంకా ప్రజా సంస్కృతిలో విస్తరిస్తున్నాయి. బ్రిటిష్ జనరల్ కూడా ఆమె సాహసాన్ని అభినందించారు. భోపాల్‌లో 2017లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఝల్కారీ బాయి విగ్రహాన్ని ఆవిష్కరించారు.





పోరాట వీరుల చరిత్రనే విముక్తి పాఠం

భారతదేశ చరిత్ర అంతా గెలిచిన వారిదే. పూలే, అంబేద్కర్ సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పోరాటంతో వాస్తవ చరిత్ర బయటకు వచ్చింది. ఇప్పుడు ఓడిపోయినవారు కూడా చరిత్ర రాసుకునే అవకాశం లభించింది. చరిత్ర కోణంలో పరిశీలిస్తే బహుజనులు అసలు చరిత్రను తెలుసుకోలేకపోయారు. దీంతో వారు చరిత్రలేని వారసులుగానే మిగిలారు. చరిత్ర తెలియనివాడు చరిత్ర సృష్టించలేరని అంబేద్కర్ అన్నాడు. తమ జాతి తాలూకు చరిత్ర, సాంస్కృతిక జ్ఞానాన్ని తెలుసుకున్నప్పుడే ప్రేరణ పొంది తమ విముక్తి కోసం యుద్ధం చేస్తారు. ఈ క్రమంలో అంబేద్కర్ ఉద్యమ రథాన్ని ముందుకు నడిపించిన విప్లవ సారథి మాన్యవార్ కాన్షీరాం, ఝల్కారీ బాయి నిలువెత్తు విగ్రహాన్ని ఝాన్సీ పట్టణంలో రాణి లక్ష్మీబాయి విగ్రహానికి అభిముఖంగా ఏర్పాటు చేశారు. దీంతో ఆమె చరిత్ర కాంతి రేఖల బయట సమాజానికి తెలిసింది. తెలంగాణలో కూడా చాకలి ఐలమ్మ చరిత్ర, పోరాటాన్ని తప్పుదారి పట్టించారు. ఆమె విస్నూర్ దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వీరనారి. ఆమె పోరాటం కేవలం భూమి కోసమే కాదు, ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం కోసం జరిగిన మహా సంగ్రామం. కానీ, ఆమె తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన యోధురాలు అనే చరిత్రలో లిఖించారు. వాస్తవికతను కనుమరుగు చేశారు. బహుజనులు విముక్తి మార్గం వైపు ప్రయాణించాలంటే చరిత్రకు తెలియని ఝల్కారీ బాయి వంటి వీర వనితల గురించి తెలుసుకోవాలి. ఇది మహిళా చైతన్యానికి, అట్టడుగు వర్గాల విముక్తికి తోడ్పడుతుంది.

(నేడు ఝల్కారీ బాయి జయంతి)

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు)

‘సమాచార హక్కు’ ఎండమావేనా!



డా. చంటి ముదిరాజ్
78010 01004

‘ప్రజలు ఎన్నుకునే ప్రభుత్వాలు నాలుగు గోడల మధ్యలో పాలన చేస్తున్నట్టు కాకుండా, పారదర్శకంగా చేస్తున్నట్టు ఉండాలి. పౌరులకు తెలియని స్థలమనేది ఉండకూడదు. రహస్య ప్రాంతాలలో అవినీతి పెరిగిపోతుంది. అదే బహిరంగ ప్రదేశాలలోనైతే నిర్మూలించబడుతుంది’ అని అమెరికా మాజీ అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ అన్నారు. మన దేశంలో సమాచార హక్కు చట్టం (రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ -2005) అమలులోకి వచ్చి 2025 అక్టోబర్ 12వ తేదీ నాటికి 20 యేండ్లు పూర్తి అయ్యింది. దేశ ప్రజాస్వామ్య పునాదిని పటిష్టంగా ఉంచే కీలక చట్టాలలో ఇది ఒకటి. ఓటు హక్కు తర్వాత అంతటి ప్రాధాన్యం కూడా దీనికే ఉంది. సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి రెండు దశాబ్దాలైన సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. ఇన్నేండ్లైనా ఆర్టీఐ అమలు తీరు ‘మేడి పండు చందం’గానే ఉంది. సమాచార పారదర్శకతపై ప్రభుత్వాలు, అధికారులు చెప్పే మాటలకు, చేతలకు పొంతనే లేదు. సమాచార హక్కు చట్టం ద్వారా ఆఫీసులలో పాలన రికార్డుల వివరాలను పొందడానికి ఎన్నో సవాళ్లను, అడ్డంకులను, వైఫల్యాలను ఎదుర్కొంటున్నారు. దీనికి పాలకులు, అధికారుల నిర్లక్ష్యం, పొరపాట్లు, వ్యవస్థాగత లోపాలు వంటివే కారణాలుగా ఉన్నాయని చెప్పొచ్చు.

దేశ చట్టాలలో ఇదొక మైలురాయి

రాజ్యాంగం తర్వాత అంతటి ప్రాముఖ్యత ఆర్టీఐకే దక్కింది. పార్లమెంట్ చేసిన చట్టాలలో ఇదొక మైలురాయిగా నిలిచిపోయింది. సమాజంలో అవినీతి నిర్మూలన, విధులలో బాధ్యతారాహిత్యాన్ని తగ్గించడంతోపాటు పారదర్శకతను పెంపొందించడం, సుపరిపాలన అందించడం ఈ చట్టం ముఖ్య లక్ష్యాలుగా ఉన్నాయి. పంచాయతీ నుంచి ప్రధాని ఆఫీసు దాకా వివిధ స్థాయిలలో జరిగే అవినీతిని బయటపెట్టడం, జవాబుదారీతనాన్ని పెంచడం, అభివృద్ధి, సంక్షేమాలపై తెలుసుకోవడం, ప్రభుత్వ రికార్డుల తనిఖీ ఆర్టీఐ సామాన్యులకు కల్పించిన ఒక ప్రధాన అస్త్రం కూడా. ఇది అమలులోకి వచ్చి 20 యేండ్లే అయినా, దీనికి తొలి అడుగు పడిందని దశాబ్దాల కిందటే అని చెప్పొచ్చు. 1976లో ఉత్తరప్రదేశ్ స్టేట్ వర్సెస్ రాజ్ నారాయణ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ ‘ప్రజాప్రతినిధులు, అధికారులు తమ పని తీరుకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు తప్పక ఇవ్వాల్సిందే.! సమాచార హక్కు రాజ్యాంగ ప్రాథమిక హక్కుల్లో అంతర్భాగమని, స్వేచ్ఛ హక్కు 19(1)(ఏ)లో ఇమిడి ఉందని’ స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీర్పు తర్వాతనే సమాచార హక్కు చట్టం రూపొందించుకోవాలనే ఆలోచన పాలకులలో వచ్చింది. అనంతరం 2005 నుంచి అమలులోకి వచ్చింది.



విజయాలెన్నో, అడ్డంకులన్నే

రెండు దశాబ్దాల కాలంలో సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తుదారులు సాధించిన విజయాలు ఎన్నో ఉన్నాయి. ఇందుకు ఉదాహరణగా 2జీ స్పెక్ట్రం కేటాయింపులు, కామన్వెల్త్ గేమ్స్, కోల్ గేట్ స్కామ్ అవినీతి గుట్టు బయట పెట్టడంలో ఆర్టీఐ కీలకంగా నిలిచింది. జాతీయ ఉపాధి హామీ పనుల సోషల్ ఆడిట్, రికార్డుల తనిఖీలలో ఎంతో సమర్థవంతంగా వినియోగించుకునేలా దోహదపడింది. ఇక దరఖాస్తుదారులకు అడ్డంకులు కూడా చాలా ఎక్కువే. సమాచారం ఇచ్చేందుకు అధికారులు కావాలనే ఆలస్యం చేయడం, లేదా అసంపూర్తిగా ఇవ్వడం, లేదంటే దరఖాస్తులను తిరస్కరించే పరిస్థితులను నూటికి తొంభై శాతం మంది ఎదుర్కొంటుంటారు. అవినీతి బహిరంగ పరిచే ఆర్టీఐ కార్యకర్తలపై బెదిరింపులకు పాల్పడడం, దాడులు వంటివి చేస్తున్నారు. ఇప్పటివరకు వందల మంది కార్యకర్తలు హత్యకు గురయ్యారు. వేల మంది దాడులు ఎదుర్కొన్నారు. దేశంలో సామాన్యులు సమాచార హక్కును పొందడంలో ఎన్నో ఇబ్బందులు, అడ్డంకులను ఎదుర్కొంటున్నట్టు సర్వేలు తేల్చిచెబుతున్నాయి. ఇటు, 30 రోజుల గడువు లోపు ఇవ్వాల్సిన సమాచారానికి నెలలు యేండ్లకు యేండ్లు ఎదురు చూడాల్సి పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వాలు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం, పారదర్శకత పాటించకపోవడం ఇందుకు కారణాలని సమాచార నిపుణులు పేర్కొంటున్నారు.

అవగాహన కల్పించని ప్రభుత్వాలు

దేశంలోని పౌరులకు ఆర్టీఐ ఒక శక్తిమంతమైన సాధనం అయినప్పటికీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడంలో సరిగా అవగాహన కల్పించడం లేదు. ప్రచారమూ చేయడం లేదు. గ్రామీణ ప్రాంతాలలోని చాలామందికి ఆర్టీఐ ఉందనేది కూడా తెలియదు. తద్వారా ఆఫీసులలో సమాచారాన్ని పొందే హక్కు సామాన్యులకు దక్కడం లేదు. పాఠశాల స్థాయి నుంచే సమాచార హక్కు ప్రాధాన్యం మీద అవగాహన పెంపొందించాలి. ఇటు కేంద్ర, రాష్ట్రాల కమిషన్ల వెబ్‌సైట్లు కూడా యూజర్ ఫ్రెండ్లీగా లేవు. అప్లికేషన్ల ఫాలోఅప్, ఓటీపీలలో లేట్, పేమెంట్ ఫెయిల్యూర్లు వంటి టెక్నికల్ ఇష్యూలు దరఖాస్తుదారులకు ఇబ్బందిగా మారాయి. సమాచారం పొందేందుకు నగదునుచెల్లిస్తున్నా, సరే సమాచారం ఇవ్వకుండా చట్టాన్ని సరిగా అమలు చేయకుండా నీరుగార్చుతున్నారు. ఆర్టీఐ విజయవంతం అమలవ్వాలంటే కమిషన్లను బలోపేతం చేస్తుండాలి. మౌలిక వసతులు కల్పిస్తుండాలి. దరఖాస్తులను, అప్పీళ్లను సకాలంలో పరిష్కరించాలి. ఇలా సమాచారం వేగంగా, స్పష్టంగా పొందినప్పుడే సామాన్యులు ప్రజాస్వామ్య వ్యవస్థలో చురుకుగా భాగస్వాములవుతారు. ఇలా చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉంది.

(వ్యాస రచయిత సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు)



ఫిరాయింపులు వర్సెస్ ‘ఫార్ములా 9292’



ఇల్లెందుల దుర్గాప్రసాద్
9440850384

కేటీఆర్ వ్యాఖ్యలు, స్టేట్మెంట్ లు ఆశ్చర్యం కలిగించడంలో కంటిన్యూటీకి విరామం ఉండడం లేదు. సాధారణంగానైతే ప్రభుత్వ యంత్రాంగం బాధ్యులు, పాలకులు ‘చట్టం తన పని తాను చేసుకుపోతుంది’ అంటుంటారు. తన కేసులో అనూహ్య కదలికలపై ‘చట్టం తన పని తాను చేసుకుపోతుంది’ అని కేటీఆర్ అనడమే రొటీన్ కు భిన్నం. నిస్సారమైన కేసు అని తాను బలంగా నమ్ముతున్నారని విదితం అవుతోంది. పదునైన కామెంట్లు వీడని కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైపు మరింత పరిశోధన ఎక్కుపెట్టారు. కేసీఆర్ కుటుంబ సభ్యుల మీద చర్యల్లో జాప్యం చేస్తున్నారనే ముద్ర ముఖ్యమంత్రిపై ఇదివరకే పడింది. ముఖ్యమంత్రి మాత్రం గుంభనంగా మెదులుతున్నారు. కేటీఆర్ ఎప్పటికప్పుడు ప్రతిపక్ష పాత్రలో లీనమై ఇదిగో లోగుట్టు అంటూ రాజకీయ వాతావరణాన్ని గంభీరం చేసేస్తున్నారు. జూబ్లీహిల్స్ బై ఎలక్షన్ ప్రక్రియ ముగిసింది. ఎవరి రొటీన్ యాక్టివిటీస్ లో వారు నిమగ్నమయ్యారు. ఇంతలోనే హఠాత్తుగా మళ్లీ సీఎం రేవంత్ రెడ్డి వర్సెస్ కేటీఆర్ ఫార్ములా ఈ కారు రేసు కేసులో ఆకస్మిక కదలిక! ఇటు ఫిరాయింపుల అంకె ‘10’లో మలుపులు, మెరుపులు, ఉరుములు ఏ గమ్యానికో అనే ఉత్కంఠ నడుమ ఈ యేడాదికి వీడ్కోలు ముంగిట. అదీ రూ. ఐదు లక్షల కోట్ల విలువైన మూల్యాంకన అంకె 9292 పరిశోధనాత్మకంగా 2026కు క్యారీ ఫార్వర్డుతో! ఒకటి సడెన్ గా, ఇంకోటి బ్లో అవుట్ గా.

న్యాయ పోరాటంలో పట్టు వీడకుండా

మొత్తానికి స్టేట్ పాలిటిక్స్ లో ఒక్కసారిగా గంభీరత. ఎమ్మెల్యేల ఫిరాయింపుల మీద న్యాయ పోరాటంలో పట్టు వీడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీరియస్ నెస్ ఏం జరుగనుంది? అనే ఉద్విగ్నతను ఎస్టాబ్లిష్ చేసింది. ఏదో ఓ కొలిక్కి తేవాలనే అనివార్యతను వ్యవస్థల ముందు కదలాడిస్తోంది. రెండు నెలలు (8 నుంచి 9 వారాలు) గడువు కావాలని పదే పదే రిక్వెస్ట్ చేస్తే, సగం అంటే 4 వారాల వ్యవధి స్పీకరుకు దక్కింది. ఆశించిన 8 వారాలలో గానీ, లభించిన 4 వారాల వెసులుబాటును ముఖ్యమంత్రి పరోక్షంగా ఏ స్థాయిలో, ఏ రకంగా సద్వినియోగం చేసుకుంటారోననే మతలబు మిగిలే ఉన్నది. స్థానిక ఎన్నికల కోసమా? ఆయా చోట్ల బై పోల్ రాకుండా, అసలు ఫిరాయింపుల కత్తే వేలాడకుండా జూబ్లీహిల్స్ ‘ఇంధనం’తో ‘మెర్జ్’ ప్రయోగానికా? అందుకే ఫార్ములాలో మూమెంట్ వచ్చిందా? ఇత్యాది లింకులతో అంతర్గతంగా ఏదైనా ప్లాన్ రంగరిస్తున్నారా? అసలలాంటివేవీ లేవా? అనేది అనుభవంలోనే తెలిసేది. ఇదంతా రేవంత్ రెడ్డి వైపు నుంచి! కానీ, కేటీఆర్ ఏమాత్రం తగ్గడం లేదు. తాజాగా 9292 అంకె బేస్ తో సుమారు రూ. ఐదు లక్షల కోట్ల మేర ప్రభుత్వానికి నష్ట ప్రణాళికల కోసం ‘చేయి’కి పని చెప్పారంటూ లెక్కా పత్రాలతో ఉదహరించారు. ఏకంగా 9,292 ఎకరాల పారిశ్రామిక భూముల వ్యవహారంలో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాల్సిన అవసరాన్ని సృష్టించారు. ఎవరి ఫార్ములాలో ఏ ట్విస్ట్ ఉంటుందో చూడడమే తరువాయి!

(వ్యాస రచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ ‘ఓపెన్ వాయిస్’కు, సాహిత్య పేజీ ‘బహుళ’కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com

జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- ప్రభుత్వానికి టీడబ్ల్యూజేఎఫ్ నేతల వినతి



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 21: మన రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్ యూజే టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు టీబ్ల్యూజేఎఫ్ అడ్ హక్ కమిటీ కన్వీనర్ పిల్లి రాంచందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య, హెచ్ యూజే కార్యదర్శి బి జగదీశ్వర్ నేతృత్వంలో హైదరాబాద్ అదనపు కలెక్టర్ కదిరవన్ పలనిని శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఇందుకోసం ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని సీఎంకు సూచించారు. అక్రిడిటేషన్ల గడువును మూడు నెలలకోసారి పొడగించడం సరైంది కాదన్నారు. అర్హులైన జర్నలిస్ట్ లకు కొత్త అక్రిడిటేషన్ కార్డులను ఇవ్వాలని, రాష్ట్ర, జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులను కార్పొరేట్, ప్రయివేటు ఆసుపత్రులు అనుమతించడం లేదని, నిమ్స్ లో మాత్రమే పాక్షికంగా పని చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సర్కారు కొత్త విధానం తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నదని, అదే విధానాన్ని జర్నలిస్టులకూ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. కంట్రీబ్యూషన్ ప్రభుత్వమే భరించాలన్నారు. రిటైర్డ్ జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని, మహిళా జర్నలిస్టులకు రాత్రి పూట రవాణా సౌకర్యం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిగ రఘు, మాణిక్ ప్రభు, రాష్ట్రకార్యదర్శి ఈ చంద్రశేఖర్, హెచ్ యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, కోశాధికారి బి రాజశేఖర్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు చిట్యాల మధుకర్, ఉపాధ్యక్షులు బి కాలేబ్, జి రేణయ్య, సంయుక్త కార్యదర్శులు వంగాల రమేష్, కే నర్సింహా, కార్యవర్గ సభ్యులు శ్రీధర్ మురహరి, కే వెంకటస్వామి, టీ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ విజయశాంతిని కలిసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్

ప్రతిపక్షం, సిటీబ్యూరో, నవంబర్ 21 : జూబ్లీహిల్స్ నియోజకవర్గ శాసనసభ్యులు వల్లాల నవీన్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ విజయశాంతి ని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి , ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై చర్చించారు. జూబ్లీహిల్స్ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్సీ విజయశాంతి అన్నారు. ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్ మాట్లాడుతూ ప్రజల అభ్యున్నతి కోసం ఎమ్మెల్సీ విజయశాంతి అనుభవం, మార్గనిర్దేశం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు జూబ్లీహిల్స్ ప్రజా సమస్యలతో పాటు ప్రాంతా అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



శ్రీశైలం నేషనల్ హైవేను పరిశీలించిన సబితా ఇంద్రారెడ్డి

ప్రతిపక్షం, సిటి బ్యూరో, నవంబర్ 21: మహేశ్వరం నియోజకవర్గంలోని శ్రీశైలం హైవే రహదారిని జల్పల్లి మున్సిపాలిటీ ఎర్రకుంట వద్ద మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలోనే ఈ రహదారిని నేషనల్ హైవే అథారిటీ పరిధిలోకి తీసుకుని, మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని ఉన్న రోడ్డును నాలుగు లైన్లుగా వెడల్పు చేయడానికి ₹80 కోట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా చంద్రయాన్‌గుట్ట నియోజకవర్గ పరిధిలోని 1.8 కిలోమీటర్ల మిగిలి ఉన్న రహదారి ఆర్ అండ్ బీ శాఖ ద్వారా ఇంకా ₹20 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. మొత్తం ₹100 కోట్లతో చంద్రయాన్‌గుట్ట నుంచి జల్పల్లి గేట్ వరకు 5.8 కిలోమీటర్ల ఫోర్ లైన్ రోడ్డు నేషనల్ హైవే అథారిటీ నొమ్స్ ప్రకారంగా నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. రోడ్డు పనులు అధికారికంగా ప్రారంభం కావడానికి కొంత సమయం పట్టినా, ప్రస్తుత రహదారి పరిస్థితులు దారుణంగా ఉన్నందున, రహదారిపై ఉన్న గోతులు, నీరు నిలిచే ప్రాంతాలను తక్షణమే సరిచేయాలని కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో తాత్కాలిక మరమ్మత్తులను వెంటనే చేపట్టి, నాణ్యతతో కూడిన శాశ్వత రహదారి పనులను త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జల్పల్లి మున్సిపాలిటీకి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ కోఆప్షన్ సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

480 కోట్లు వడ్ల బోనస్ విడుదల

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 21: సన్న ధాన్యం బోనస్, ఎల్పీజీ మహాలక్ష్మి, మైనార్టీ శాఖలకు సంబంధించిన 480 కోట్లను శుక్రవారం ఆర్థిక శాఖ విడుదల చేసింది. సన్నధాన్యం బోనస్ కు సంబంధించి 200 కోట్లు, ఎల్పీజీ మహాలక్ష్మి పథకానికి 60 కోట్లు, మైనార్టీ శాఖలకు సంబంధించిన 220 కోట్లు విడుదల చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం మేరకు ఆర్థిక శాఖ అధికారులు శుక్రవారం ఈ నిధులను విడుదల చేశారు.



ఘనంగా గ్రామ దేవత విగ్రహ ప్రతిష్టలు

ప్రతిపక్షం. ప్రతినిధి. మేడ్చల్, నవంబర్ 21: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి అత్వెల్లోలి గల పురాతనమైన పోచమ్మ ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మూడు రోజులపాటు నిర్వహించే ఉత్సవాలు శుక్రవారం ఉదయం ప్రారంభమయ్యాయి. పోచమ్మ ఆలయం శిథిలం కావడంతో గ్రామస్తులందరు కలిసి పునరుద్ధరించి నూతన ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో పోచమ్మ, ముత్యాలమ్మ, విగ్రహాలను ప్రతిష్ట చేసేందుకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మొదటిరోజు యాగశాల ప్రవేశం, అఖండ దీపా స్థాపకం, మాతృక అంకురార్పణ, వివిధ రకాల హోమాలు, గణపతి హావనం, మూలమంత్ర హావనం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో గ్రామ ప్రముఖులు నందారెడ్డి, మల్లేష్ గౌడ్, కొండల్ రెడ్డి, రాంచంద్రయ్య, ఈశ్వరయ్య, దశరథ, జైహింద్ రెడ్డి, సంజీవతో పాటు తదితరులు పాల్గొన్నారు.



లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన డీఈఈ

- 10 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ

ప్రతిపక్షం ప్రతినిధి, జనగాం, నవంబర్ 21: పాలకుర్తి సబ్ డివిజన్ పరిధి 'మిషన్ భగీరథ'లో డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న కునమల్ల సంధ్యారాణి లంచం తీసుకుంటూ శుక్రవారం పట్టుబడ్డారు. సాయంత్రం తన చాంబర్‌లో ఆమెను ఏబీసీ అధికారులు పట్టుకున్నారు. దేవురుప్పుల మండలంలో వేసిన పైప్‌లైన్లకు మేజర్‌మెంట్ చేసి ఫైనల్ బిల్లు కోసం బాధితుడు డీఈఈని సంప్రదించాడు. ఆమె లంచం డిమాండ్ చేయడంతో డీఈఈ నియమించుకున్న ప్రైవేట్ సహాయకుడు మహేందర్‌కు బాధితుడు ఫోన్ పే ద్వారా రూ.10 వేలను పంపించాడు. వెంటనే ఏసీబీ అధికారులు కార్యాలయంపై దాడి చేసి ప్రైవేట్ వ్యక్తిని, డీఈఈ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. లంచం తీసుకున్న డీఈఈని వరంగల్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టినట్లు అధికారులు వెల్లడించారు.



గ్రామ పాలన కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

మొయినాబాద్, ప్రతి పక్షం నవంబర్ 21: గ్రామ పాలన (జీపీఓ) కార్యాలయాన్ని ప్రారంభించిన చేవెళ్ల శాసనసభ్యులు కాలె యాదయ్య మొయినాబాద్ మండలంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన గ్రామ పాలన కార్యాలయా ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య ఈ సందర్భంగా తహసీల్దార్ గౌతమ్ కుమార్ తో కలిసి శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం నూతన గ్రామ పాలన కార్యాలయం ముందు వేసిన బోరును కూడా ఆయన ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్, పట్నం రాంరెడ్డి, రెవెన్యూ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ను కలిసిన కార్పొరేటర్

ప్రతిపక్షం, సిటి బ్యూరో, నవంబర్ 21 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భారీ మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిచిన వి నవీన్ యాదవ్ ను శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ యూసుఫ్ గూడా నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ నవీన్ యాదవ్ గెలుపుతో కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టిందన్నారు. నవీన్ యాదవ్ గారిని భారీ మెజార్టీతో గెలిపించిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ గెలుపులో ఎంతో కష్టపడి పని చేసిన కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు సైతం కృతజ్ఞతలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మారబోయిన రాజు యాదవ్, కొయ్యడ లక్ష్మణ్ యాదవ్, మారబోయిన సాయి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



శంకర్ దాదా డాక్టర్ సీటు వెనకాల మందులు



ప్రశ్నించగానే మెడికల్ షాపు మూసేసి వెళ్ళిపోయిన దృశ్యం

అర్హత లేని డాక్టర్లపై అధికారులు చర్యలు తీసుకోరా?

- ప్రజల ప్రాణాలు పోతేనే వైద్య శాఖ అధికారులు స్పందిస్తారా?..

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 21: అర్హత లేకున్నా కొందరు వైద్యుల అవతారమెత్తి వచ్చి రాని వైద్యం అందిస్తూ ప్రజల ప్రాణాలతో చాలగాటం ఆడుతున్నారు. 10వ తరగతి పాస్ లేనివారు కూడ మేడలో స్టేటస్ కోప్ వేసుకొని ఎంబీబీఎస్ లా డాక్టర్లమని బిల్డప్ ఇస్తూ శంకర్ దాదా ఎంబీబీఎస్ లా ఫీలవుతున్నారు. గల్లీ గల్లీలో క్లినిక్ లు తెరిచి రోగుల ప్రాణాలతో చలగాటమాడుతున్నారు. వివరాల్లోకి వెళితే మేడ్చల్ జిల్లా ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధి అక్బర్ జాపేటలో గొట్టిముక్కుల మహేష్ 5 సంవత్సరాల నుండి మెడికల్ షాపును నిర్వహిస్తున్నాడు. మెడికల్ షాపు నిర్వహిస్తూ అతను అదే షాపులో ఎంబీబీఎస్ చదివినట్టు పక్కనే ఉన్న షెట్టర్ లో పల్లవి ఫర్స్ట్ ఏయిడ్ సెంటర్ అనే బోర్డు నిర్వహించుకొని ఆసుపత్రినే నడుపుతున్నాడు. మెడికల్ షాపు నిర్వహించాలంటే ఫార్మసి చదివి సర్టిఫికెట్ పొందుండాలి. కానీ మహేష్ ఆర్ ఎం పి మాత్రం అతని సతీమణిని మెడికల్ షాపులో కూర్చోబెట్టి మందులు అమ్ముతున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు అనంతరం గొట్టిమొక్కుల మహేష్‌ను వెళ్లి వివరణ అడిగితే ఇది ఆసువత్రి కాదని తింగిరి సమాధానం ఇచ్చి మెడికల్ షాపును మూసుకొని అక్కడినుండి వెళ్ళిపోయాడు. అసలు మహేష్ నడుపుతున్న పల్లవి ఫర్స్ట్ ఎయిడ్ సెంటర్, మెడికల్ షాపుకు అనుమతులు ఉన్నాయా?. లేవా? అనే విషయాన్ని వైద్య శాఖ అధికారులు తనిఖీలు చేయడం లేదు. ఎస్టాబ్లీష్మెంట్ ఆండ్ రెగ్యులరైజెషన్ 2020 చట్టం ప్రకారం ధ్రువపత్రం ప్రతి ఆసుపత్రిలో ఉండాలి. అందులో పని చేస్తున్న డాక్టర్ల అర్హత మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ తదితర అంశాలపై పొందుపరిచాల్సి ఉంటుంది. అయితే ఈ నిభందనలు ఎవరు పాటించకపోవడం పై ప్రజలకు అనుమానాలను దారి తీస్తున్నాయి. ఇక మహేష్ నడుపుతున్న ఫార్మసీ సర్టిఫికెట్ వేరేవాళ్ళ పేరుపై తీసుకొని 5 సంరాల నుండి మెడికల్ షాపును నిర్వహించి అధిక మందులు రాసి డబ్బులు సంపాదిస్తున్నడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్న వైద్య శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తిన్నట్లు వ్యవహరించడంతో అతను కొంతకాలంగా ఆసుపత్రిని కూడా నిర్వహించుకొని రోగులకు హెవీ డోస్ ఇస్తున్నాడని, ఇతనిపై వైద్య శాఖ అధికారులు ఎందుకు ఇంత ప్రేమ చూపుతున్నారని, అధికారులకు ముడుపులు అందించి ఆసుపత్రిని నిర్వహిస్తున్నాడా?.. ఎల్లంపేట్ పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తెలిసి తెలియకుండా చేస్తున్న డుబ్లికెట్ డాక్టర్ మహేష్ వైద్యంతో రోగులకు ఏదైనా జరగరాని ఘటనలు జరిగి ప్రాణాలు కోల్పోతే సంభంధిత అధికారులు బాధ్యత వహిస్తారా అనే కోణంలో ప్రజలు ఆలోచిస్తున్నారు. ఇప్పటికైనా వైద్య శాఖ అధికారులు వెంటనే స్పందించి ఇలాంటి డుబ్లికెట్ డాక్టర్లపై, వారు చట్ట విరుద్ధంగా నడుపుతున్న ఆసుపత్రులు, మెడికల్ షాపులను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేస్తున్నారు.



ఇచ్చిన హామీలు మరచిన పాలకులు

- సమస్యల్లో జర్నలిస్టు కుటుంబాలు
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సలీమా
- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డికి వినతి పత్రం

ప్రతిపక్షం, మేడ్చల్ మల్కాజిగిరి, నవంబర్ 21 : టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా టిడబ్ల్యూజేఎఫ్ ఆడహాక్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి కి జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం ద్వారా కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి సలీమా మాట్లాడుతూ జర్నలిస్టులకు ఎక్రిడేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అన్నారు. జర్నలిస్టులకు మెడికల్ హెల్త్ కార్డులు అందించాలని కోరారు. మహిళా జర్నలిస్టులకు భద్రత కల్పిస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. మేడ్చల్ జిల్లా అడహాక్ కమిటీ కన్వీనర్ జి హరిప్రసాద్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా ఉన్నటువంటి జర్నలిస్టు ఇంటి స్థలాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. రాష్ట్రంలోనూ జిల్లాలోనూ అక్రిడేషన్ కమిటీలను ఏర్పాటు చేసి వాటి ద్వారా ఎక్రిడేషన్ కార్డులు ఇప్పించాలన్నారు. జర్నలిస్టులకు ఇచ్చే హెల్త్ కార్డులు అన్ని ప్రైవేటు కార్పోరేట్ ఆసుపత్రి లలో పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కో కన్వీనర్ పి మల్లేష్ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో జర్నలిస్టులపై దాడులు ఎక్కువయ్యాయని , జర్నలిస్టులకు భద్రత కల్పించాలని దానికై పోలీస్ అధికారులతో, రెవెన్యూ, సమాచార అధికారులతో జర్నలిస్టుల సంఘాలతో కమిటీలు ఏర్పాటు చేసి జర్నలిస్టులపై దాడి చేసే వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. దేనికై ప్రత్యేక చట్టాలను తేవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడహాక్ కమిటీ సభ్యులు సింగం రాజు, పాండు, రవి, నరేందర్ జర్నలిస్టులు బాలు, మోహన్ రెడ్డి, జె సుధాకర్, హుస్సేన్, రోజా రాణి, సత్య నారాయణ, అరుణ్ కుమార్, దుర్గాప్రసాద్, సురేష్, రామ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌హెచ్‌జీ మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి. సకాలంలో బ్యాంకు రుణాలు అందేవిధంగా చర్యలు చేపట్టాలి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 39,000 మందికి పైగా మహిళలు రూ.578 కోట్లతో వ్యాపారాలు ప్రారంభించారు. 2026 మార్చి నాటికి ఎస్‌హెచ్‌జీ లకు రూ.32,322 కోట్ల రుణాలు అందజేయాలి. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేసి, మద్దతు ఇవ్వాలి.

- అధికారులతో ఏపీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రాంతీయం



జర్నలిస్టుల జీవితానికి భద్రత కావాలి

- సీపీఎం నేత కే రాజయ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 21 : రామచంద్రపురం లోని ఫంక్షన్ హాల్లో జరిగిన విలేకరి గిరి ప్రసాద్ సంస్మరణ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే. రాజయ్య నివాళులర్పించి, ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ విలేఖరి గిరి ప్రసాద్ కు జోహార్లు అర్పించారు. వారికి వారి కుటుంబానికి సంతాపం తెలియజేస్తూ ప్రజా సమస్యలను పాలకుల దృష్టికి ఎప్పటికప్పుడు తేస్తున్న విలేకరుల వృత్తి చాలా కష్టాలతో కూడుకున్న వృత్తిని ఆయన అన్నారు, సమాజం కోసం నిరంతరం పాటుపడుతున్న వాళ్లు విలేకరులని ఆయన అన్నారు. ప్రజలకు ప్రభుత్వంకి వారధిగా పనిచేస్తున్న వాళ్ళు విలేకరులని అన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి ప్రజల సమస్యలను వెలికి తీస్తున్న వాళ్ళే విలేకరులని ఆయన అన్నారు. జీవితాంతం కష్టపడుతున్న విలేకరులకు ఎటువంటి భద్రత లేదని ఆయన అన్నారు. విలేకరుల జీవితానికి భద్రత కల్పించే చర్యలను పాలకు తీసుకోకపోవడం తీవ్ర అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు విలేకరుల కోసం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నరు. ఇన్సూరెన్స్ సౌకర్యం, ప్రమాద బీమా, వేతనాల బోర్డు తదితర సౌకర్యాలను వెంటనే కల్పించాలని, అప్పుడే విలేకరుల జీవితానికి భద్రత దొరుకుతుందని ఆయన అన్నారు.

మత్స్యకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- ప్రభుత్వానికి ముదిరాజ్ మహాసభ వినతి



ప్రతిపక్షం ప్రతినిధి, ఖమ్మం, నవంబర్ 21: తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు బండా ప్రకాష్ ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పిట్టల వెంకట నరసయ్య ముదిరాజ్ ఆదేశాల మేరకు శుక్రవారం నాడు ఖమ్మం నగరం 14, 15 డివిజన్ లలో కొత్తగూడెంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం, తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ సభ నిర్వహించారు. పెద్ద చెరువు మత్స్య పారిశ్రామిక సొసైటీ అధ్యక్షులు ముద్రబోయిన అప్పారావు అధ్యక్షత వహించారు. సీనియర్ నాయకులు చింతకాయల వెంకటేశ్వర్లు జెండా ఎగురవేసారు. అనంతరం తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు రావుల హనుమంతరావు ముదిరాజ్, ఖమ్మం జిల్లా మత్స్య పరిశ్రమకు హడక్ కమిటీ చైర్మన్ మామిడి వెంకటేశ్వర్లు, ముదిరాజ్ మహాసభ ఖమ్మం జిల్లా గౌరవ సలహాదారు పగడాల మల్లేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. మత్స్యకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అక్కి కోటయ్య ముదిరాజ్, లింగన్న బోయిన లక్ష్మణ్ ముదిరాజ్, ములకలపల్లి సంగమేశ్వర రావు ముదిరాజ్, గాదె రాంబాబు ముదిరాజ్, నర్ల శేషయ్య ముదిరాజ్, రాంబాబు, తిప్పట్ల నరసింహారావు ముదిరాజ్, చెన్నబోయిన వెంకటేశ్వర్లు ముదిరాజ్, ముద్రబోయిన రాంబాబు ముదిరాజ్, బుడిగ వెంకన్న ముదిరాజ్, రావుల సంజీవరావు ముదిరాజ్, పోతురాజు వెంకటేశ్వర్లు ముదిరాజ్ బోయిన వెంకన్న ముదిరాజ్ మాకనబోయిన నాగేశ్వరరావు ముదిరాజ్, చింతకాయల లక్ష్మీనారాయణ ముదిరాజ్, బుడిగ ఉపేందర్ ముదిరాజ్ పాల్గొన్నారు.



పెద్ద కంజర్లలో అన్యాక్రాంతవుతున్న భూములపై సమగ్ర విచారణ జరిపించాలి

- స్వాధీనం చేసుకుని గ్రామస్తులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి
- సీపీఎం పార్టీ పటాన్ చెరు ఏరియా కమిటీ కార్యదర్శి బి.నాగేశ్వరరావు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 21 : పెద్ద కంజర్ల గ్రామంలో అన్యాక్రాంతవుతున్న భూములపై సమగ్ర విచారణ జరిపించడంతోపాటు ఆ భూములను ప్రభుత్వము స్వాధీనం చేసుకుని గ్రామస్తులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం పార్టీ పటాన్ చెరు ఏరియా కమిటీ కార్యదర్శి బి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇండ్ల స్థలాల సాధన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంద్రేశం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పెద్ద కంజర్ల గ్రామంలో 120,121,125 సర్వే నెంబర్లలో గత 2022లో రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 240 ఎకరాల భూములను పరిశ్రమల ఏర్పాటు ట్రక్ టెర్మినల్స్ పేరుతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం భూములను సేకరించిందన్నారు. కానీ జిల్లా అధికార యంత్రాంగం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టినప్పుడు గ్రామస్తులకు ఇండ్ల స్థలాలు ఇస్తామని హామీనిచ్చారని, ఆ హామీని ప్రస్తుతం జిల్లా అధికారులు తుంగలో తొక్కారని ఆరోపించారు. పెద్ద కంజర్ల గ్రామంలో వందల ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్న జిల్లా రెవెన్యూ యంత్రాంగం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నదని వాపోయారు. అరబిందో తత్వ, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు, ఫామ్ హౌస్ యజమాన్యాలు చెరువు శిఖం భూములను ఆక్రమించి యదేచ్ఛగా వ్యాపారం చేసుకుంటున్నారని తెలిపారు. లక్షల గజాల రూపంలో సర్వేనెంబర్ 121 లో ప్రభుత్వ భూమి ఏ విధంగా రిజిస్ట్రేషన్ అవుతుందని ప్రశ్నించారు. గ్రామంలో కుటుంబాలు పెరిగాయని, ఇళ్ల స్థలాల డిమాండు మరింత పెరిగిందని అన్నారు. అందుకోసం పెద్దకంజర్ల గ్రామంలో అందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెద్ద కంజర్ల గ్రామ భూభాగోతం పై సమగ్రమైన విచారణ జరిపించి, భూములను కాపాడాలని డిమాండ్ చేశారు.



బీజాపూర్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు మృతి, మరో 9 మంది గాయాలు.

ప్రతిపక్షం,మొయినాబాద్, నవంబర్ 21 : మొయినాబాద్ ప్రాంతంలో తాజ్ హోటల్ సమీపంలోని బీజాపూర్ హైవేపై ఉదయం తీవ్ర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది.ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ కరీం అక్కడికక్కడే మృతి చెందాడు.మరో వ్యక్తి చికిత్స పొద్దుతూ మరణించాడు. గాయపడిన ఇతరులను స్థానికులు వెంటనే మొయినాబాద్ లోని భాస్కర్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రస్తుతం వారికి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పేదల సొంతింటి కల కాంగ్రెస్ పార్టీతోనే సాకారం

- చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జీ భీమ్ భరత్

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 21: మొయినాబాద్ మండల పరిధిలోని కనకమామిడి అనుబంధ గ్రామమైన సజ్జన్ పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించి ఇంటి పత్రాలను చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామెన భీమ్ భరత్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సొంతింటి కల సాధ్యమైందని, నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు ఇప్పిస్తానని, నిర్మాణాల్లో కృషి చేస్తున్న అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చేవెళ్ల –గచ్చిబౌలి బస్సు సర్వీసు ప్రారంభం

ప్రతిపక్షం,చేవెళ్ల, నవంబర్ 21: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం ప్రాంత ప్రజలకు శుక్రవారం ఆర్టీసీ శుభవార్త చెప్పింది. ఎప్పట్నుంచో ఎదురు చూస్తున్న సాఫ్ట్ వేర్ ఉద్యోగులు, చిన్నపాటి వ్యాపారస్తులకు సౌకర్యంగా ఉంఏడలా చేవెళ్ల నుంచి గచ్చిబౌలి వరకు బస్సు సర్వీసును ప్రారంభించినట్టు మెహిదీపట్నం డిపో మేనేజర్ ఓ ప్రకటనలో తెలిపారు. రూటు నెం.593/316 ద్వారా చేవెళ్ల మొయినాబాద్ అప్ప జంక్షన్,నార్సింగ్ నుంచి ఓ ఆర్ ఆర్ సర్వీస్ రోడ్డులో నేరుగా గచ్చిబౌలి వరకు ఉదయం ఒక్క ట్రిప్పు సాయంత్రం ఒక్క ట్రిప్పు తిరుగుతుంది అని చెప్పారు. ప్రస్తుతం చేవెళ్ల నుంచి ఉదయం 7:45 సాయంత్రం 4:05 గచ్చిబౌలి నుంచి ఉదయం 9:05 సాయంత్రం 5:25 ఉందని, ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉంటే ట్రిప్పుల సంఖ్యను కూడా పెంచుతామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఉస్మాన్ నగర్‌లో స్వల్ప ఉద్రిక్తత

- కూల్చివేతలపై రాస్తారోకో
- మున్సిపల్ కమిషనర్‌పై తీవ్ర విమర్శలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 21 : తెల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఉస్మాన్ నగర్ ప్రాంతంలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. లంచాలు తీసుకుంటూ బిల్డర్లకు సహకరిస్తూ, పేదవారి ఇళ్ల నిర్మాణాలను అన్యాయంగా కూల్చివేస్తున్నారనే ఆరోపణలతో తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ అజయ్‌పై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూల్చివేతలు కోర్టు స్టే ఆర్డర్‌ను ఉల్లంఘించి నిర్వహించారని బాధితులు ఆరోపించారు. స్టే ఉన్నప్పటికీ అధికారులే నిర్లక్ష్యంగా చర్యలు తీసుకోవడం తీవ్ర అన్యాయమని వారు పేర్కొన్నారు. కూల్చివేతల ప్రాంతంలోనే రోడ్డు మీద రాడ్లు, ఇనుప వస్తువులు వేసి రాస్తారోకోకు దిగిన నిరసనకారులు—ఏకపక్ష నిర్ణయాలతో పేదవారిపై దాడి జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, కమిషనర్ స్వయంగా అక్కడికి రావాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా "కమిషనర్ డౌన్ డౌన్" అంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేసారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని నిరసనకారులతో చర్చలు జరిపి పరిస్థితిని శాంతింపజేశారు. అనంతరం తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట కూడా బాధితులు బైఠాయించి నిరసను కొనసాగించారు.



నీటి వసతి కై వినతిపత్రం

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయపేట్, నవంబర్ 21: అయ్యప్ప దీక్ష కాలం పురస్కరించుకొని నారాయణపేట జిల్లా, మక్తల్ పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో నీటి కొరత ఉన్నందున, సమీప ట్యాంకు నుండి నీటి వసతి కల్పించాలని కోరుతూ అయ్యప్ప దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో గురుస్వాములు మక్తల్ మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఇట్టి విషయమై అధికారులు సానుకూలంగా స్పందించాని, గురు స్వాములు రంజిత్ రెడ్డి కార్తీక్, అశోక్, ఓంకార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



జిల్లాస్థాయి అండర్ 19 క్రికెట్ పోటీలకు సర్గం మహేష్

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయపేట్, నవంబర్ 21: చిన్నప్పటి నుండి క్రికెట్ పై ఉన్నటువంటి మక్కువతో చురుకుగా వ్యాయామం, చేయడంతో పాటు క్రికెట్లో అత్యున్నత ప్రతిఫలం కనపరచడం స్కాలర్ జూనియర్స్ కాలేజీలో చదువుకుంటు, ప్రతిభను కనపరిచిన మహేష్‌గైడ్ తో ట్రైనింగ్ తీసుకొని రాష్ట్రస్థాయిలో అండర్ 19 క్రికెట్ కు ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా సర్గం మహేష్ ను పుడమి ఫౌండేషన్ చైర్మన్ వెంకటపతి రాజు శాలువాతో సన్మానిచారు. అయన మాట్లాడుతూ పేద అట్టడుగు వర్గాల విద్యార్థులు విద్యారంగంతో పాటు, క్రీడల్లో కూడా మంచి ప్రావిణ్యతను సాధించి, అత్యున్నత స్థాయికి ఎదగాలని, మక్తల్ పట్టణానికి చెందిన మహేష్‌దేశానికే ప్రాతినిధ్యం వహించాలని ఆశిస్తూ, కష్టపడి మరింత ముందుకు వెళ్లాలని కోరారు. మహేష్ కు పుడమి ఫౌండేషన్ వెన్నుదన్నుగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పుడమి ఫౌండేషన్ ఈసీ మెంబర్ ప్యాట పవన్ కళ్యాణ్, కడెచూర్ ఆంజనేయులు, శ్రీను, ఎల్లలింగ, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు గిరి ప్రసాద్ సంస్మరణ సభ

- నివాళులు అర్పించిన జర్నలిస్టులు, నాయకులు



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 21: రామచంద్రాపురం లోని లక్ష్మి గార్డెన్ లో శుక్రవారం జర్నలిస్టు గిరిప్రసాద్ సంస్మరణ సభను పటాన్ చెరు నియోజకవర్గ జర్నలిస్టుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి పలువురు రాజకీయ నాయకులు, అధికారులు, నియోజకవర్గస్థాయి జర్నలిస్టులు, గిరి ప్రసాద్ చిన్న నాటి మిత్రులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ గిరిప్రసాద్ తో నాకు 20 ఏళ్ల అనుబంధం ఉన్నదని , తను ఎప్పుడు ఏ బాధ ఉన్న తన ముఖంలో కనిపించకుండా చిరునవ్వుతో పలకరించేవాడని , జర్నలిస్టు వృత్తిలో అలాంటి వారు అరుదుగా ఉంటారని అన్నారు. గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు అంటే కత్తి మీద సాము లాంటి పని అని, వారికి అనేకనేక ఒత్తిడీలు, బెదిరింపులు ఉంటాయని అన్నిటినీ అధిగమించి అందరి మనుషులను గెలుచుకున్న గిరి గొప్ప మనస్తత్వం కలవారని అన్నారు. డీఎస్పీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో పోలీసుల వృత్తి, జర్నలిస్టుల వృత్తి ఒకటేనని తమ ఆరోగ్యాలను లెక్క చేయకుండా కవరేజ్ కోసం ఉరుకులు పరుగులు పెడుతుంటారని ఎప్పుడు తింటారో తెలియదు అన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు సమాజం కోసమే కాకుండా తమ తమ ఆరోగ్యాలను కూడా చూసుకోవాలని, అప్పుడే తన కుటుంబం కూడా మంచిగా ఉంటుందని అన్నారు. ప్రతి ఒక జర్నలిస్టు తమ ఆరోగ్యం కోసం పట్టించుకోని రోజులో ఒక గంట అయినా ఎక్ససైజ్ లాంటివి చేసి ఫిట్నెస్ గా ఉండాలని అన్నారు. పలువురు జర్నలిస్టు నాయకులు మాట్లాడుతూ గిరి తో 20 సంవత్సరాల అనుబంధాన్ని జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తక్కువ ఏజ్ లో హార్ట్ ఎటాక్ వచ్చి చనిపోవడం చాలా కలిచి వేసిందని అన్నారు. తను 2008 నుండి ఎమ్మెల్సీ, డీజీకేబుల్ , మోజో టీవీ మొదలుకొని హెచ్ఎంటీవీ లాంటి చానల్లో పనిచేసిన అనుభవాలను పంచుకున్నారు. తను అందరితో కలివిడిగా ఉండేవాడని, ఎవరితో వృత్తిపరంగా కానీ వ్యక్తిగతంగా కానీ విభేదాలు పెట్టుకోకుండా మెదులుకునేవాడని అన్నారు. జర్నలిస్ట్ గిరి మరణం నియోజకవర్గ స్థాయి జర్నలిస్టులకు తీరని లోటని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ రెడ్డి, తొంట అంజయ్య, టెంపుల్ చైర్మన్ సుధాకర్ యాదవ్, శశిధర్ రెడ్డి, నరసింహారెడ్డి మేరాజ్ ఖాన్, సీనియర్ పాత్రికేయులు సుధాకర్, ఖాన్, మెట్టు శ్రీధర్ , బంధం కొమ్ము సాయి, ఓం ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



కృష్ణా జలాల విషయంలో మరోసారి సంక్లిష్ట పరిస్థితి ఏర్పడింది. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపైనే రాష్ట్ర హక్కులను కాపాడాల్సిన బాధ్యత ఉంది. రాబోయే కృష్ణా జలాల ట్రిబ్యూనల్ విచారణలో తెలంగాణ 763 టీఎంసీలను డిమాండ్ చేస్తోంది. బచావత్ ట్రిబ్యునల్ ఏపీకి కేటాయించిన 512 టీఎంసీల్లో ఒక్క చుక్కనూ కోల్పోకుండా ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి.

- ట్విట్టర్లో వైసీపీ అధినేత జగన్

ప్రాంతీయం

రాష్ట్రంలోని టాప్ 10 స్కూళ్లలో ఇందిరానగర్

- మూడో స్థానంలో నిలవడం గర్వకారణం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు
- పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 21: రాష్ట్రంలోని టాప్ 10 స్కూళ్లలో ఇందిరానగర్ టాప్ 3లో నిలవడం గర్వకారణమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సిద్దిపేట ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో నూతన కంప్యూటర్ ల్యాబ్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇందిరానగర్ పాఠశాల తనకు ఎంతో ఇష్టమైన పాఠశాల అని, ఇక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎల్లప్పుడూ తనకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చే వారు అని పేర్కొన్నారు. పాఠశాలని అభివృద్ధి చేసే విషయంలో చూపుతున్న పట్టుదల, నిబద్ధతకు ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఇందిరానగర్ స్కూల్‌లో పనిచేయాలని చాలా మంది ఉపాధ్యాయులు తొలుత సంకోచించినా, ఒకసారి వచ్చిన తరువాత ఇష్టంతో పనిచేస్తూ అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని ఆయన అన్నారు. "నేను దత్తత తీసుకుంటా, సహాయం చేస్తా... కానీ నిజమైన కృషి మా ప్రధానోపాధ్యాయులది, మా ఉపాధ్యాయులది, మా చిన్నారులది" అని పేర్కొన్నారు. పాఠశాలకు ల్యాబ్, డైనింగ్ హాల్ అవసరమని ఉపాధ్యాయులు కోరగా, అవి నెలరోజుల్లో ఏర్పాటు చేయిస్తానని, అవసరమైతే తన వ్యక్తిగత నిధులతో కూడా పూర్తి చేస్తానని ప్రకటించారు. సిద్దిపేట విద్యా అభివృద్ధి కోసం తీసుకున్న విభిన్న చర్యలను గుర్తుచేసిన ఆయన ఇందిరానగర్ స్కూల్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ల్యాబ్ కూడా ఇంజినీరింగ్ స్థాయి తరహాలో ఉందని తెలిపారు. ఈ ఏడాది స్కాలర్‌షిప్‌లలో సిద్దిపేట మొత్తం 45 సీట్లలో 16 సీట్లు ఇందిరానగర్ విద్యార్థులకే రావడం పాఠశాల ప్రతిభకు నిదర్శనమని తెలిపారు. ఆటో డ్రైవర్లు, కార్మికులు, కూలీల పిల్లలు అకడమిక్‌గా టాప్‌లో ఉండటం గర్వకారణమని చెప్పారు. ప్రస్తుతం 260 మంది పదో తరగతి విద్యార్థుల్లో 600 మార్కుల్లో 550 పైగా మార్కులు సాధించిన 16 మందికి క్యాష్ ప్రైజ్‌తో పాటు సిల్వర్ మెడల్స్ అందజేస్తానని ప్రకటించారు. పాఠశాలకు యోగా ఇన్‌స్ట్రక్టర్‌ను కేటాయిస్తామని, విదేశీ భాషా కోర్సులను కూడా తిరిగి ప్రారంభిస్తామని తెలిపారు. మంచి హాజరు, చదువులో క్రమశిక్షణ పాటించే విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు కూడా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

పంచాయతీలు, వార్డులలో

రిజర్వేషన్ ప్రక్రియను చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ హైమావతి



ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 21: గ్రామపంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ ప్రక్రియపై శుక్రవారం జిల్లా కలెక్టర్ కే హేమావతి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పంచాయతీ శాఖ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి తగు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధన మేరకు జిల్లాలో 508 గ్రామపంచాయతీలు, 4,508 వార్డులలో రిజర్వేషన్ ప్రక్రియను చేపట్టాలని సూచించారు. గ్రామపంచాయతీ ఎన్నికలలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల కొరకు 2011 సెన్సెస్ , బీసీ రిజర్వేషన్ల కొరకు సామాజిక సర్వే 2024 ప్రకారం మొత్తం 50 శాతం మించకుండా రిజర్వేషన్ ప్రక్రియ ఆయా డివిజన్ల ఆర్డీవోల నేతృత్వంలో చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో జడ్పి సీఈఓ రమేష్, డీపీఓ విజయ్ కుమార్, సిద్దిపేట గజ్వేల్ ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, డివిజనల్ పంచాయతీ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీలు తదితరులు పాల్గొన్నారు.



విధులు సక్రమంగా నిర్వహించని అధికారులపై చర్యలు

- జిల్లా కలెక్టర్ హైమావతి

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 21: సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్, ఓపి రిజిస్టర్ వెరిఫై చేశారు. ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, జూనియర్ అసిస్టెంట్ మాత్రమే విధులకు హాజరు. మెడికల్ ఆఫీసర్ తో సహా మిగతా వారందరూ గైర్హాజరు పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ ఆఫీసర్ కె. మంజుల సెలవులో ఉన్నట్లు సిబ్బంది తెలపగా డిఎంఅండ్‌ఎచ్ఓ కీ ఫోన్ చేసి అనుమతి తీసుకున్నారా అని ఆరా తీసి అనుమతి లేనిదే సెలవు తీసుకుని ఇష్టానుసారంగా సమయ వేళలు పాటించకున్న, విధులు సక్రమంగా నిర్వహించనీ ప్రతి ఒక్క అధికారి జీతంలో కోత విధించడం తో పాటు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నీరు పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం కోసం ప్రభుత్వం మంచి భవనం, వైద్య పరికరాలు, స్టాఫ్ ను అందజేస్తుందని సిబ్బందికి తెలిపారు. అనంతరం సిద్దిపేట రూరల్ మండలం పుల్లూర్ గ్రామంలోనీ (ఐకెపి) వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోజు వారిగా లోడ్ కాగానే ట్రక్ షిట్ జెనరేట్ చెయ్యాలని రైతులకు పే మెంట్ లో జాప్యం కాకుండా చూసుకోవాలని సెంటర్ సిబ్బంది నీ ఆదేశించారు. ఇక్కడ లోడ్ చేసిన ధాన్యం అన్నదాత మిల్ గాడిచర్ల పల్లి, లక్ష్మీ నర్సింహ మిల్ పుల్లూరు లోని మిల్లులకు పంపిస్తున్నట్లు సిబ్బంది కలెక్టర్ కి తెలిపారు. సెంటర్ లో అన్ని సౌకర్యాలు ఉండాలని తేమశాతం రాగానే గన్నిలలో నింపి వెంటనే లోడ్ చెయ్యాలని సెంటర్ సిబ్బందిని ఆదేశించారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున టార్పలిన్ కవర్లు కప్పుకోవాలని రైతులకు సూచించారు.



వైజ్ఞానిక ప్రదర్శనలో ఆకట్టుకున్న అంబిటస్ విద్యార్థి

- ఫైర్ ఫైటింగ్ రోబో తో మన్ననలు
- రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 21;- జిల్లాలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఇన్స్పైర్, వైజ్ఞానిక ప్రదర్శన 2025 కార్యక్రమంలో పట్టణంలోని అంబిటస్ పాఠశాల విద్యార్థి ప్రదర్శన అమితంగా ఆకట్టుకుంది. మారుతున్న సాంకేతికను పుణికిపుచ్చుకుని సరికొత్త ఆలోచనతో ఆవిష్కరించిన ప్రయోగం అందరి మన్ననలు అందుకుంది. మూడు రోజుల పాటు కొనసాగిన వైజ్ఞానిక ప్రదర్శనలో అంబిటస్ పాఠశాలలోని తొమ్మిదవ తరగతి చదువుతున్న జి. హర్షిత్ రెడ్డి ప్రదర్శన అందరిని అద్భుతంగా ఆకట్టుకోవడం జరిగింది. ఫైర్ ఫైటింగ్ రోబోటింగ్ ప్రదర్శన అత్యంత ఆలోచింప చేసింది. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు మనుషులు వెళ్లేందుకు సాధ్యం కానీ కఠినమైన ప్రదేశాల్లోకి ఈ రోబోట్లను పంపి రిమోట్ల ద్వారా మంటలను ఎలా కంట్రోల్ చేయవచ్చో అత్యంత చాలా చక్కగా వివరించడం అందరిని ఆకట్టుకుంది. ఈ ప్రదర్శన రాష్ట స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. సిద్దిపేట పట్టణం నుండి రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఏకైక పాఠశాల అంబిటస్ కావటం గమనార్హం.

విద్యార్థికి అభినందనలు...

విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు ఎప్పుడూ అంబిటస్ యజమాన్యం ముందు ఉంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎడ్ల జ్యోతి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపిక కావడానికి కారణమైన ఉపాధ్యాయులను, వైజ్ఞానిక ప్రదర్శనలు రాష్ట్ర స్థాయికి ఎంపికైన హర్షిత్ రెడ్డిని పాఠశాల యాజమాన్యం అభినందించారు. వైజ్ఞానిక ప్రదర్శనలో సత్తా చాటిన విద్యార్థి హర్షిత్ రెడ్డిని ముగింపు సమావేశంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ పిల్లల్లోని సృజనాత్మకత పెంపొందించేందుకు ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు.



టెట్ 3 పేపర్ పరీక్షలు పెట్టాలి

- రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ అధ్యక్షులు మహేంద్రారెడ్డి

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 21: తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న అన్ని విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయులకు వారి సబ్జెక్టు ఆధారంగా కంటెంట్, మెథడాలజీ, చైల్డ్ సైకాలజీ, పెడగాజీ, జీ.కె కి సంబంధించిన టెట్ 3 పేపర్లను తయారు చేయాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు పిన్నింటి మహేంద్రారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులందరికీ పాస్ మార్కులు ఒకే విధంగా ఉండాలన్నారు. 10 సంవత్సరాల సర్వీసు ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. 3 నెలలకు ఒకసారి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు పరీక్షను నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులందరూ టెట్ పరీక్షకు సిద్ధమవుతూ ఉంటే విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతుంది. కాబట్టి ప్రభుత్వం పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.




రోడ్డు ప్రమాదాలను నివారించాలి

- ట్రాఫిక్ నిబంధాలను పాటించాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 21: జిల్లాలో రోడ్డు ప్రమాదాల వల్ల ప్రాణ నష్టం, ఆర్థిక నష్టం జరుగుతున్న సందర్భంలో రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలలో గణనీయమైన తగ్గుదల సాధ్యమని తెలిపారు. ప్రమాదాలకు ప్రధాన కారణాలు మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ లేదా మెసేజ్‌లు టైప్ చేస్తూ డ్రైవింగ్ చేయొద్దని పేర్కొన్నారు. అతివేగం, ఓవర్‌టేకింగ్, సిగ్నల్ జంపింగ్, ఓవర్‌లోడింగ్, హెల్మెట్/సీట్‌బెల్ట్ ఉపయోగించకపోవడం ప్రమాదాలకు ప్రధాన కారణంగా సూచించారు. అలసట, నిద్రమత్తు, పొగమంచు, రోడ్డుపై కనిపించే దూరం తగ్గడం వంటి పరిస్థితుల్లో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయవద్దన్నారు. ద్విచక్ర వాహన దారులు ఐఎస్‌ఐ మార్కు హెల్మెట్, కారు ప్రయాణికులు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. చలికాలంలో పొగమంచు ఎక్కువగా ఉన్నప్పుడు హెడ్లైట్లు, ఫాగ్ లైట్లు ఆన్‌లో ఉంచి, వాహనాల మధ్య సురక్షిత దూరం పాటించాలన్నారు. బ్లాక్‌స్పాట్లను గుర్తించి తగిన సంకేత బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్ ఏర్పాటు చేయడం, రోడ్డు భద్రతా కమిటీల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ స్కూళ్లు, కాలేజీలలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా వైద్య అధికారి శ్రీరామ్, పోలీస్, అధికారులు పాల్గొన్నారు.

మనస్థాపం చెంది వృద్ధురాలి ఆత్మహత్య



ప్రతి పక్షం, దుబ్బాక, నవంబర్ 21: సంవత్సరం క్రితం భర్త చనిపోగా వున్న ముగ్గురు కుమారులు వివిధ ప్రాంతాలకు జీవనోపాధి కోసం వెళ్లగా ఒంటరిగా జీవిస్తున్న వృద్ధురాలు మనస్థాపానికి గురై కూడవెల్లి వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట జిల్లా అక్బర్ పేట భూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దుబ్బాక మండలం రామక్కపేట గ్రామానికి చెందిన సామల మణెమ్మ (69) ఈ నెల 17 తేదీన ఉదయం దుబ్బాకలో వుంటున్న తన చెల్లెలు ఇంటికి వెళ్ళొస్తానని అనడంతో ఆమె కొడుకు నాగరాజు దుబ్బాక బస్టాండ్ లో వదిలిపెట్టి వెళ్లాడని, అదే రోజు రాత్రి తన చిన్నమ్మకు ఫోన్ చేసి అమ్మ వచ్చిందా అని అడగగా, రాలేదని చెప్పడంతో ఆచూకీ కోసం బంధువులకు ఫోన్ చేసినా వివరాలు తెలియక పోవడంతో, గురువారం దుబ్బాక పోలీస్ స్టేషన్లో వృద్ధురాలు తప్పిపోయినట్లు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన సాయంత్రమే కూడవెల్లి వాగులో శవం కనిపించగా, బంధువులకు సమాచారం ఇవ్వడంతో అక్కడి వచ్చిన బంధువులు మృతదేహం సామల మణెమ్మదే అని గుర్తించారు. కొడుకు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు అక్బర్ పేట భూంపల్లి ఎస్సై హరీష్‌గౌడ్ అన్నారు.



శ్మశాన వాటికలో హైమాస్ట్ లైట్లు

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 21: సిద్దిపేట పట్టణం ప్రశాంత్ నగర్ లోని స్మశాన వాటిక లో రూ.2లక్షల తో ఏర్పాటు చేసిన ఐమాస్ట్ లైట్స్ ను మాజీ మంత్రి హరీష్‌రావు ప్రారంభించారు. స్మశాన వాటిక నిర్వాహకులు ఇటీవల హరీష్‌రావుని కలసి రాత్రి వెళ్లల్లో జరిగే దహన కార్యక్రమాలకు ఇబ్బంది గా ఉందని లైట్స్ ఏర్పాటు చేయాలని కోరారు. వారి కోరిక మేరకు లైట్స్ మంజూరు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు రాజనర్సు, మచ్చ వేణుగోపాల్ రెడ్డి, కొండం సంపత్ రెడ్డి పాల్గొన్నారు.

క్లిన్ అండ్ గ్రీన్ సిద్దిపేటగా నిత్యం విరాజిల్లుతోంది

- ఆదర్శ, అభివృద్ధి, అవార్డుల పంట సిద్దిపేట
- చెత్త సేకరణలో మరింత మార్పు రావాలి
- ఇంటి అనుమతులపై పారదర్శకంగా వ్యవహరించాలి
- మున్సిపాలిటీ సమీక్షలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు



ప్రతిపక్షం, సిద్ధపేట టౌన్, నవంబర్ 21: సిద్దిపేట పట్టణం దక్షిణ భారతదేశంలోనే ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుకున్నామని, బెస్ట్ సిద్దిపేట.. క్లిన్ అండ్ గ్రీన్ సిద్దిపేట గా నిత్యం విరాజిల్లుతోందిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ అన్నారు. సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో హరీష్‌రావు సిద్దిపేట పట్టణ అభివృద్ధి, పరిశుభ్రత, పారదర్శక పరిపాలనపై కీలక సూచనలు చేశారు. సిద్దిపేట పట్టణం దక్షిణ భారత దేశంలోనే ఆదర్శ పట్టణంగా పేరు పొందిందని, ఈ ప్రతిష్ఠను నిలబెట్టుకోవడానికి ప్రతి శాఖ మరింత సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు. "బెస్ట్ సిద్దిపేట-క్లిన్ అండ్ గ్రీన్ సిద్దిపేట"గా పట్టణం ఎల్లప్పుడూ మెరుగైన స్థాయిలో ఉండాలని హరీష్ రావు అన్నారు. పట్టణం క్లిన్, గ్రీన్, సేఫ్ సిద్దిపేటగా నిలవాలంటే చెత్త సేకరణ వ్యవస్థలో మరింత మార్పులు తీసుకురావాలని, ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఆయన అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. "సిద్దిపేట సుప్రభాతం... చెత్త బండి వచ్చింది" అనే పిలుపును ప్రతి ఇంటికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై చెత్త పారవేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, బ్లాక్ స్పాట్‌స్‌ను గుర్తించి వెంటనే శుభ్రపరిచే విధానాన్ని అమలు చేయాల్సిందిగా ఆదేశించారు. ప్రతి వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య బాధ్యులను నియమించి పరిశుభ్రతపై మరింత దృష్టి పెట్టాలన్నారు. ఇంటి అనుమతులు మరియు ఇంటి నంబర్ల విషయంలో పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలని, దరఖాస్తుల పరిశీలనలో అలసత్వం అస్సలు ఉండకూడదని హరీష్‌రావు స్పష్టం చేశారు. ఇంటి నంబర్ల కోసం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు ఎందుకు పూర్తికావడం లేదని ఆరా తీస్తూ, వచ్చే వారం లోపల పెండింగ్‌లో ఉన్న అన్ని ఇంటి నంబర్ల దరఖాస్తులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న ఇతర పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని సూచించారు. సిద్దిపేట ప్రజల సహకారంతో, అధికారులు సమన్వయంతో పనిచేస్తే సిద్దిపేట పట్టణం ఎల్లప్పుడూ ఆదర్శ, అవార్డుల పట్టణంగా మెరుగైన స్థాయిలో నిలుస్తుందని హరీష్ రావు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ శ్రీమతి మంజుల రాజానర్సు, వైస్ ఛైర్మన్ కనకరాజు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





పీడీఎస్ యూ సిద్దిపేట జిల్లా నూతన కమిటీ

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 21: పీడీఎస్ యూ సిద్దిపేట జిల్లా 4వ మహాసభ గజ్వేల్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించగా దేవులపల్లి రమేష్ మరోసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు వివరాలను వెల్లడించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా సిద్దిపేటకు చెందిన ప్రణయ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడిగా రాహుల్, జిల్లా సహాయ కార్యదర్శిగా భరత్, కోశాధికారిగా గౌతం ఎన్నికయ్యారు. అదనంగా నలుగురు జిల్లా కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. కొత్తగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి రమేష్, ప్రధాన కార్యదర్శి ప్రణయ్ కుమార్‌లు విద్యలో శాస్త్రీయ దృక్పథం, విద్యా హక్కుల పరిరక్షణ కోసం పీడీఎస్యూ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానం, యుజిసిల నూతన నిబంధనలు విద్యార్థులపై బలవంతంగా రుద్దబడుతున్నాయని, దీని వల్ల స్వదేశీ విద్య వ్యవస్థ తీవ్ర నష్టాలను ఎదుర్కొంటుందని పేర్కొన్నారు. జిల్లా బాధ్యతలు తనపై ఉంచినందుకు రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి. శ్రీకాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజులకు ధన్యవాదాలు తెలిపారు.



కర్ణాటకలో సీఎం మార్పు ఉండదు. సీఎం సిద్ధరామయ్య ఐదేళ్లు పూర్తిగా పనిచేస్తారు. అందుకు నేనూ సహకరిస్తాను. తామిద్దరం హైకమాండ్ ఆదేశాలను పాటిస్తాం. అందరికీ మంత్రిపదవి అవకాశం రావాలని సీఎం యోచిస్తున్నారు. అందుకే క్యాబినెట్‌లో మార్పులు చేయాలనుకుంటున్నారు. ఈక్రమంలోనే పార్టీ ఎమ్మెల్యేలు ఢిల్లీకి వచ్చారు.
- కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

ప్రాంతీయం



పిల్లల్లో ఉన్న ఆలోచనలకు రూపం ఇచ్చేది సైన్స్ ఫెయిర్

- ఇన్నోవేషన్ లేకపోతే ప్రపంచం ముందుకు సాగదు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 21: పిల్లల్లో ఉన్న ఆలోచనలకు ఒక రూపం ఇచ్చేది సైన్స్ ఫెయిర్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ అన్నారు. సిద్దిపేట బాలికల హై స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమంలో హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ విజ్ఞానం, ఇన్నోవేషన్ ప్రాముఖ్యతపై వివరించారు.హరీష్ రావు మాట్లాడుతూ 'పిల్లల్లో ఉన్న ఆలోచనలకు ఒక రూపం ఇచ్చేది సైన్స్ ఫెయిర్. ఇన్నోవేషన్ లేకపోతే ప్రపంచం ముందుకు సాగదు. కరెంట్, టెలిఫోన్, కంప్యూటర్, ఇప్పుడు ఏఐ ఇవన్నీ ఇన్నోవేషన్ ఫలితాలే. ఇన్నోవేషన్‌కు ఆకాశమే హద్దు' అని అన్నారు. ప్రస్తుత యుగంలో విద్యార్థులు కొత్త ఆలోచనలతో ముందుకు రావాలని, ప్రతి విద్యార్థిలో సైంటిస్ట్, ఇంజనీర్ ఉన్నారని ఆయన ప్రోత్సహించారు. సిద్దిపేటలో ఈ సంవత్సరం 1,853 ప్రాజెక్టులు ప్రదర్శనలో పెట్టడం ఆనందకరమని, ప్రతి సంవత్సరం పాల్గొనేవారి సంఖ్య పెరుగుతోందని హరీష్ రావు తెలిపారు. సిద్దిపేటను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టాలని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై కూడా స్పందించిన ఆయన, సమస్యలన్నింటినీ రాబోయే అసెంబ్లీలో ప్రస్తావిస్తాను అని హామీ ఇచ్చారు. సైన్స్ ఫెయిర్‌ను విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయులు, సిబ్బందిని హరీష్ రావు అభినందించారు.

ఏడుగురు గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

1.2 కిలోల గంజాయి స్వాధీనం



ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 21 : గంజాయి స్మగ్లింగ్, విక్రయిస్తున్న ముఠాను మోపాల్ పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించి మోపాల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సౌత్ రూరల్ సీఐ సురేష్‌కుమార్ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. మోపాల్ మండలం కంజర గ్రామ శివారులో గంజా అమ్ముతున్నారనే నమ్మదగిన సమాచారం మోపాల్ పోలీసు లకు రావడంతో ఎస్సై సుష్మిత వెంటనే తన పోలీసు సిబ్బందితో కలిసి ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. ఈ అపరేషన్ సమయంలో అక్కడ అనుమానాస్పదంగా ఉన్న నిజామాబాద్ వినాయక్ నగర్‌కు చెందిన అమీర్ ఖాన్, నర్సింగ్ పల్లి గ్రామ చెందిన గ్రామపంచాయతీ వర్కర్ షేక్ అఫ్రోజ్, కంజర గ్రామానికి చెందిన బట్నానాష్ శివ తేజ అనే ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరు మహారాష్ట్ర నాందేడ్‌కు రైల్ లో వెళ్లి అక్కడ కిలో గంజను రూ. 10వేలకు కొనుకుంటూ, అట్టి గంజను ముగ్పాల్ కు తీసుకోని వచ్చి, దానిని 5 గ్రాములకు ఒక కవర్ చొప్పున తయారుచేసి, ఒక్కొక్క కవర్ ను రూ. 200 నుంచి రూ.300ల వరకు ఇక్కడి అమాయక ప్రజలకు అమ్ముతున్నారు. అంతేకాక మైనర్ లకు కాలేజీ విద్యార్థులకు గాంజా ను విక్రయిస్తున్నారు. వీరు ఎక్కువగా యూత్ ను టార్గెట్ చేస్తూ గంజను అమ్ముతున్నారు. ఈ ముగ్గురి వద్ద నుంచి మొత్తం 1.2 కిలోలు గంజాయి ను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాక వీరి వద్ద నుండి గంజా రవాణాకు ఉపయోగించిన 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పై ముగ్గురు నిందితులకు గంజను సప్లై చేస్తున్న నాందేడ్ కు చెందినా నిందితులను పట్టుకునేందుకు ముగ్పాల్ ఎస్సై సుస్మిత తన సిబ్బందితో కలిసి నాందేడ్ కు వెళ్లి అక్కడ నాందేడ్‌లో షేక్ ఇమ్రాన్, మీర్జా జుబేర్, అమూల్ చౌరే, షేక్ షేర్ఖాన్లిం దితులను దాకచక్యంగా పట్టుకున్నారు. వీరు గంజను అక్కడ నాందేడ్ చుట్టూ ప్రక్కల ప్రాంతాలలో కొనుక్కొని రూ.10 వేలకు కిలో చొప్పున నిజామాబాదుకు చెందిన పై ముగ్గురికి అమ్ముతున్నారు. ఈ నలుగురి వద్ద నుండి మొత్తం గంజా సుమారు 900 గ్రాములను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 7 గురు నిందితులను చట్ట రిత్య అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచయం ఉన్నట్లు సీఐ తెలిపారు. గంజాయి స్మగ్లర్లను పట్టుకున్న సిఐఎస్ఐ, సిబ్బందిని పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య అభినందించినారు.



ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశం అని రాష్ట్ర సమాచార కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో సమాచార హక్కు చట్టం, అప్పీళ్ల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల పౌర సమాచార అధికారులతో సమీక్షా సమావేశాన్ని రాష్ట్ర సమాచార కమిషనర్ నిర్వహించారు.

ప్రతిపక్షం, హనుమకొండ



భారత్ ప్రపంచంలోనే నెంబర్ వన్ గా నిలవాలి

- ఎంపీ మాధవనేని రఘునందన్ రావు

ప్రతిపక్షం, దుబ్బాక, నవంబర్ 21: దేశం ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా నిలవాలని, భారతదేశాన్ని 2047 నాటికి వికసిత దేశంగా తీర్చిదిద్దేందుకు యువత ముందుకు రావాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. సర్దార వల్లభాయ్ పటేల్ 150వ జయంతి పురస్కరించుకొని శుక్రవారం దుబ్బాక పట్టణంలోని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ తో కలిసి ఎక్తా ర్యాలీని ప్రారంబించారు. ఈ సందర్భంగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ హైదరాబాద్, జమ్ముకాశ్మీర్ వంటి కొన్ని రాజ్యాలు స్వతంత్ర్య దేశాలుగా కొనసాగాలని ప్రయత్నించినప్పటికీ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 13 నెలల తరువాత హైదరాబాద్ 1948 సెప్టెంబర్ 15న అధికారికంగా భారతదేశంలో విలీనమైందని గుర్తుచేశారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా దేశం ఒకటిగా నిలబడటానికి ఆరోజు సర్దార్ వల్లభాయ్ పటేల్ తీసుకున్నటువంటి ఆ నిర్ణయం ఉపయోగపడిందన్నారు. బావి తరాలు 2047 వరకు ఈ దేశానికి స్వతంత్రం వచ్చి మన దేశానికి స్వతంత్రం.నిర్మించినటువంటి సర్దార్ వల్లభాయ్ పటేల్ యొక్క 150వ జయంతిని మనమందరం గుర్తించుకోవాలని చెప్పిన భారత ప్రభుత్వం నరేంద్ర మోడీ నాయకత్వంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 736 జిల్లాల్లో ఇలాంటి ర్యాలీ లని మహి భారత్ అనేటువంటి భారత ప్రభుత్వ సంస్థ ద్వారా నిర్వహించడం జరుగుతోంది అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేష్‌గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు భైరి శంకర్, మండల అధ్యక్షుడు మంద అనిల్ రెడ్డి, మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు దోరగల్ల శ్రీకాంత్ యాదవ్, తహసీల్దారు సంజీవ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్‌కూమర్, ఎంఈఓ జోగు ప్రభుదాసు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పగడ్బందిగా రోడ్డు భద్రత చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ కె హైమావతి



ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 21: జిల్లాలో వివిధ రోడ్లపై ప్రయాణిస్తున్న ప్రతి వాహనదారుడి ప్రాణాలు ముఖ్యమని, పగడ్బందిగా రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి అధికారులను ఆదేశించారు. క్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్లో రోడ్డు భద్రత కమిటీ, మత్తు పదార్థాల వినియోగ నివారణకు సంబంధించి అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్కేఆర్ పరిధిలోని రాజీవ్ రహదారి వెంబడి పోలీస్, రెవెన్యూ అధికారులు కలిసి పర్యవేక్షణలో 32 జంక్షన్ లను గుర్తించిన ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత చర్యలు నెలలోపు పూర్తి చెయ్యాలని హెచ్కేఆర్ అధికారులను ఆదేశించారు. దుద్దేడ కుకునూరుపల్లి వద్ద సర్వీస్ రోడ్డు కోసం భూ సేకరణ, అనధికారిక డివైడర్ కటింగ్ మూసివెయ్యాలని నేషనల్ హైవే నిర్మాణంలో సైతం భద్రత చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొమురవెల్లి కమన్ వద్ద ప్రమాదాలు జరగకుండా బస్ బే ఏర్పాటుకు భూ సేకరణ చేసి భద్రత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో మత్తు పదార్థాల అక్రమ రవాణా అరికట్టడానికి అందరూ అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన లేబర్ మత్తు పదార్థాలు వాడకుండా, అక్రమ రవాణా చేయకుండా తరచూ పర్యవక్షణ చేయాలని పోలీస్, ఎక్సైజ్ అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, ఏసీపీలు రవీందర్ రెడ్డి, సదానందం, నర్సింలు, ఎక్సైజ్ సూపర్డెంట్ శ్రీనివాస మూర్తి, ఆర్టీఏ మెంబర్ సూర్య వర్మ, ఆర్ అండ్ బి, డిఎఫ్ఓ శ్రీనివాస్, డిఎం అండ్ హెచ్ ఓ ధనరాజ్, డీపీవో స్వరూప రాణి, డిఈఓ శ్రీనివాస్ రెడ్డి, డీడబ్ల్యు ఓ శారద, డ్రగ్స్ ఇన్స్పెక్టర్ వినయ సుస్మిత, ట్రాఫిక్ సిఐ, నేషనల్ హైవే హెచ్ కె ఆర్ ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ప్రపంచ మత్స్యకార దినోత్సవం

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్21: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ చేపల మార్కెట్లో ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి జనవేని శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చేపల విక్రయదారులను సన్మానించి మిఠాయిలు తినిపించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధి కోసం 1954 నవంబర్ 21న కొంతమంది మేధావులు మగ, ఆడ చేప పిల్లలను ఒక తొట్టిలో వేయడం జరిగిందన్నారు. వాటి సంపర్కంతో అనేక చేప పిల్లలు పుట్టడంతో ఆరోజు నుండి నవంబర్ 21న ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షులు ఎడల రమేష్ ముదిరాజ్ ఉపాధ్యక్షులు కేశవేని రమేష్ ముదిరాజ్. హుస్నాబాద్ టౌన్ అధ్యక్షులు రాగుల శ్రీనివాస్ ముదిరాజ్, అక్కన్నపేట మండల అధ్యక్షులు కాశ బోయిన రవి ముదిరాజ్, మత్స్యశాఖ అధ్యక్షులు పోన్నం మల్లయ్య ముదిరాజ్, పినకాశి రమేష్ ముదిరాజ్, చింతల బాలరాజు ముదిరాజ్, మాచర్ల చందర్ ముదిరాజ్, ఐలయ్య ముదిరాజ్, మీర్జాపూర్ మత్స్య శాఖ అధ్యక్షులు సంపత్ ముదిరాజ్, ముదిరాజ్ ముఖ్య నాయకులు కులస్తులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ చేయాలి

- సీనియర్ కాంగ్రెస్, బీసీ నాయకుడు శ్రీనివాస్



ప్రతిపక్షం, ఉప్పల్, నవంబర్21: దేశంలోని నిరుపేదలకి చౌక దరల దుకాణం ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయాల్సిన అవసరం ఎంతో ఉందని సీనియర్ కాంగ్రెస్, బీసీ నాయకుడు కొలిపాక శ్రీనివాస్ అన్నారు. కేంద్ర ప్రభుతం ప్రతి కుటుంబానికి 25 కేజీల సన్న బియ్యంతో పాటు నిత్యవసరాలు తక్కువ ధరకు అందించాలని అన్నారు. నేడు జీఎస్టీ వల్ల లక్షల కోట్ల ఆదాయం వస్తోందని, నరేంద్ర మోడీ విదేశాల్లో నుండి నల్ల ధనం రప్పించి ప్రతి నిరుపేద కు 15లక్షల రూపాయలు నగదు జమ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. బీసీలకి 42 శాతం రిజర్వేషన్పై పార్లమెంట్లో బిల్లు పెట్టి ఆమోదించాలని కోరారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రజా పాలనకు స్ఫూర్తిగా తీసుకుని దేశ వ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ దేశవ్యాప్తంగా చేయాలని డిమాండ్‌చేశారు.



సత్యసాయి సేవలు అమోఘం

- సేవా భావంతో సత్య సాయి సేవా సంస్థ జిల్లా కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 21: ప్రభుత్వ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యార్థులకు చలి నుంచి రక్షణగా బ్లాంకెట్స్, రగ్గుల పంపిణీ ఏర్పాటుకు సత్యసాయి సేవా సంస్థ ముందుకు రావడం గర్వకారణం అని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం సత్య సాయి సేవా సంస్థ సభ్యులు జిల్లా కలెక్టర్ కార్యాలయానికికు చేరుకొని, చలి నుండి రక్షణగా రగ్గులు, బ్లాంకెట్స్ జిల్లా కలెక్టర్ కు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సత్య సాయి శత వర్ష జయంతి వేడుకల సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సంక్షేమ కోసం సత్యసాయి ట్రస్ట్ సేవా దృక్పథం అభినందనీయమని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో పనిచేసే హౌస్ కీపింగ్, చిరు మహిళా ఉద్యోగులకు, చీరలు, ప్రభుత్వ విద్యార్థుల సంక్షేమం కోసం రగ్గులను పంపిణీ చేశారు. విద్యార్థుల సంక్షేమం కోసం సత్యసాయి సేవా మెదక్ వారు సేవా భావంతో చీరలు, దుప్పట్లు, రగ్గులు అందించారని, అవసరం ఉన్నా పాఠశాల విద్యార్థులకు అవసరమయ్యే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు శిరిగ ప్రభాకర్, బాధ్యులు నగేష్, సత్యనారాయణ, అగ్య, మనస్విత,ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.



అక్రమ ఇసుక రవాణాను తక్షణమే నిలిపివేయాలి

- కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చిన బీఆర్ఎస్ నేతలు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 20:- మెదక్ నియోజవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి ముఖ్యంగా మెదక్ మండలం సంగాయిగూడ తండా హల్దీ వాగు నుండి గత నెల రోజులుగా రాత్రిపగలు జేసీబీల సహాయంతో టిప్పర్ల ద్వారా హైదరాబాదు, జహీరాబాద్, బీదర్ నగరాలకు ఇసుక అక్రమంగా తరలించి అమ్ముకుంటున్నారని, వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని శుక్రవారం మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి, మెదక్ జిల్లా కలెక్టర్ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికార పార్టీ నాయకుల అండదండలతో మెదక్ ప్రాంతం నుండి హైదరాబాద్, జహీరాబాద్, బీదర్ నగరాలకు సంగాయిగూడ తండా హల్దీ వాగు నుండి జేసీబీ సహాయంతో గత నెల రోజులగా టిప్పర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని అన్నారు. పోలీసులు చూసి చూడనట్లు వదిలేస్తున్నారని ప్రశ్నిచారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై పోలీసులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు దొరకని ఇసుక అక్రమంగా హైదరాబాద్కు ఎలా తరలిస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే అక్రమంగా ఇసుక దందా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి, లేనిచో బిఆర్ఎస్ పార్టీ తరఫున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు విశ్వం, భీమరి కిషోర్, ఆర్కే శ్రీనివాస్, మాయ మల్లేశం, మెదక్ మండల మాజీ వైస్ ఎంపీపీ మార్గం ఆంజనేయులు, నాయకులు కొత్తపల్లి కిష్టయ్య, గట్టయ్య, యాదగిరి, లింగా రెడ్డి, ప్రభాకర్, జుబెర్ అహ్మద్, మేకల సాయిలు, యామి రెడ్డి, సాప సాయిలు, స్వామి నాయక్, రంజిత్, లడ్డు, చంద్ పాషా తదితరులు ఉన్నారు.


విద్యార్థులు ఒక లక్ష్యంతో ముందుకు సాగాలి

- బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గం ఇన్చార్జి తిరుపతి రెడ్డి
- తెలంగాణ ఆదర్శ పాఠశాలలో సొంత నిధులతో నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు



ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 21: విద్యార్థులు ఒక లక్ష్యంతో ముందుకు సాగి, అనుకున్నది సాధించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మెదక్ నియోజకవర్గ ఇన్చార్జి కంఠరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు త్రాగడానికి స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని సంకల్పంతో సుమారు లక్ష రూపాయలు సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన మంచి నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏపీజే అబ్దుల్ కలాం సూచించిన విధంగా కలలు కని, వాటిని సహకారం చేసేందుకు కృషి చేయాలని అన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యంతో మంచి ఫలితాలు సాధించే విధంగా ముందుకు సాగాలని దిశా నిర్దేశం చేశారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరానని, తన లక్ష్యం ఎమ్మెల్యే కావాలని ఉందని దాన్ని సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ఎంసెట్ కోచింగ్ కోసం ఒక శిక్షకుడిని ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నానని సూచించారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె. జితేందర్ గౌడ్, కల్వకుంట పిఎసిఎస్ చైర్మన్ అందె. కొండల్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాణిక్ రెడ్డి, నాయకులు నర్సారెడ్డి,రాజేందర్ గుప్తా,నరేందర్ రెడ్డి,శ్యామ్ రెడ్డి, సాంగు.స్వామి,యేసుపాల్, రాములు, శ్రీకాంత్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

“



నాస్తికుడిగా ఉండటం నేరం కాదని రాజమౌళిపై విషం చిమ్మేవారు తెలుసుకోవాలి. దేవుణ్ని నమ్మనివాడు ఆయనపై మూవీ తీయడమేంటని ప్రశ్నిస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ మూవీ తీయాలంటే డైరెక్టర్ గ్యాంగ్‌స్టర్ అవ్వాలా? నిజమేంటంటే నమ్మని వ్యక్తికే దేవుడు వందరెట్లెక్కువ సక్సెస్ ఇచ్చాడు. అంటే దేవుడు మీ కంటే నాస్తికులనే ఎక్కువ ప్రేమిస్తుండాలి. మరి రాజమౌళితో దేవుడికిలేని ఇబ్బంది మీకెందుకు.

- ట్విట్టర్లో దర్శకుడు ఆర్జీవి

లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్

- రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ముందస్తు ప్రణాళికలు
- నెలవారీ సమీక్ష నిర్వహించిన జిల్లా ఎస్పీ





ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, నవంబర్ 21: లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని,రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో అయన నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై సమీక్ష చేస్తూ, ముఖ్యంగా గ్రేవ్ కేసుల్లో ఎస్ ఓ పి ప్రకారం నాణ్యమైన, వేగవంతమైన దర్యాప్తు జరపాలని, తద్వారా బాధితులకు అండగా నిలవాలని సూచించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తుతో పాటు విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని, లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ రూపొందించాలని ఎస్పి అధికారులకు సూచించారు. ఎస్.హెచ్.ఓలు తమ ఏరియాలోని ప్రతి గ్రామాన్ని సందర్శించి, ఆ ప్రాంతాలలోని సమస్యలను తెలుసుకోవాలని చెప్పారు. విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామలపై పూర్తి అవగాహన కలిగి, ముందస్తు సమాచారాన్ని సేకరించి, చిన్న ఘటనకైనా సమాచారం వచ్చే విధంగా గ్రామస్థులతో బలమైన సంబంధాలు ఏర్పాటు చేసుకొనేలా సిబ్బందికి తరచూ తెలియజేయాలన్నారు. రౌడీ షీటర్స్, సస్పెక్ట్ ల కదళిక పై నిఘా ఉంచి, తరుచూ చెక్ చేయాలని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఎలాంటి అలసత్వం తగదు అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ కే. నరసింహారెడ్డి, ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి, ఐపీఎస్, డీఎస్పీలు శ్రీనివాసరావు, విట్టల్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మదుసుధన్, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ మురళి, పిసిఆర్ ఇన్స్పెక్టర్ నరేష్, సిసియస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



అవినీతి రహితంగా పనిచేస్తాం

- ప్రమాణం చేసిన మున్సిపల్ సిబ్బంది
- ప్రజలకు అవసరమైన సేవలు అందించాలి
- అడిషనల్ కమిషనర్ మారుతీ ప్రసాద్

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 21: ప్రజలకు అవసరమైన మునిసిపల్ సేవలు అందించడానికి, సమస్యలు పరిష్కరించడానికి వార్డు అధికారులు సదా సన్నద్ధంగా ఉండాలని రామగుండం నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్ అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం వార్డు అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ఆస్తి పన్ను వసూళ్ల శాతాన్ని పెరగడానికి మరింత శ్రద్ధ చూపాలని అన్నారు.త్వరలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేసే కార్యక్రమం ఉన్నందున సన్నద్ధంగా ఉండాలని అన్నారు.ఈ సందర్భంగా అవినీతి రహితంగా పని చేస్తామనిసిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.ఈ సమావేశంలో నగర పాలక సంస్థ సూపరింటెండింగ్ ఇంజనీర్ గురువీర,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి వి.రామన్,అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు,సెక్రెటరీ ఉమా మహేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.



వయోవృద్ధుల భద్రత ప్రతీ ఒక్కరి బాధ్యత

- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, నవంబర్ 21: వయోవృద్ధుల అనుభవం, జ్ఞానం, విలువలు సమాజ నిర్మాణానికి అత్యంత ప్రాముఖ్యమని, వారికి గౌరవం, ఆరోగ్యం, భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. అంతర్జాతీయ వయోవృద్ధులు దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రం లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. మహిళలు, పిల్లలు, వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం - మన ఆకాంక్షలు, మన శ్రేయస్సు, మన హక్కులు" అనే శీర్షికన జిల్లా కేంద్రం లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వయోవృద్ధుల అనుభవం, జ్ఞానం, విలువలు సమాజ నిర్మాణానికి అత్యంత ప్రాముఖ్యమని, వారికి గౌరవం, ఆరోగ్యం, భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వము అమలు చేస్తున్న వివిధ పథకాల పై ఆయన వివరించారు. సమాజానికి అనుభవం, ధర్మం, విలువల ప్రతి రూపమని, వారి ఆరోగ్యం, భద్రత, గౌరవం ప్రభుత్వం సమాజం ఉమ్మడిగా కాపాడాల్సిన బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సంవత్సరం థీమ్ "మన ఆకాంక్షలు, మన శ్రేయస్సు, మన హక్కులు" వయోవృద్ధుల పాత్రను ప్రపంచవ్యాప్తంగా ఉన్నతంగా ప్రతిబింబిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వయోవృద్ధులకు వివిధ రకాల క్రీడలలో గెలుపొందిన వారికి మెమోంటోలు అందించారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీ డబ్ల్యూ ఓ ప్రమీల , రెడ్ క్రాస్ సొసైటీ రాజన్న, తహసిల్దార్ జనార్ధన్, మాజీ గ్రంథాలయ ఛైర్మెన్ రాజేశ్వర రావ్, విఠల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ , వయోవృద్ధులు పాల్గొన్నారు.



పత్తి కొనుగోలును మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మార్కెటింగ్, సీసీఐ అధికారులు, మిల్లుల యాజమాన్యంను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం ఇంద్రనగర్ పరిధిలో ఉన్న భవానీ కాటన్ ఇండస్ట్రీస్ లో పత్తి కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఇక్కడ ఉన్నవే బ్రిడ్జి కాంటా వద్ద కలెక్టర్ స్నేహ శబరీష్, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, ఎల్కతుర్తి మార్కెట్ కమిటీ ఛైర్మన్ సంతాజీ, వైస్ ఛైర్మన్ స్రవంతి, పత్తి రైతు శ్రీనివాస్ లు కొబ్బరికాయలు కొట్టారు. పత్తి ని తీసుకువచ్చిన వాహనం వద్ద రిబ్బన్ కట్ చేసి పత్తి కొనుగోలు ను ప్రారంభించారు.

ప్రతిపక్షం, హనుమకొండ



ఖానాపూర్ పట్టణంలోని శ్రీ శ్రీ శ్రీ పంచ ముఖి ఆంజనేయ స్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ యజ్ఞము కార్యక్రమంలో భాగంగా పంచముఖి ఆంజనేయ స్వామి వారి విగ్రహ దాత: ఖానాపూర్ తాజా మాజీ మున్సిపల్ ఛైర్మన్ రాజుర సత్యం శైలజ దంపతులకు పంచముఖి ఆంజనేయ స్వామి క్షేత్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నూతన పట్టు వస్త్రాలు సమర్పణ కార్యక్రమం నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈరోజు నుండి మూడు రోజులపాటు విగ్రహ ప్రతిష్టపన, మహా అన్నదాన కార్యక్రమం మరియు పాలు పూజా కార్యక్రమాలు ఉంటాయని అన్నారు.

ప్రతిపక్షం, నిర్మల్



పాత డిజైన్ ప్రకారమే మంచిప్ప రిజర్వాయర్

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- పల్లె దవాఖాన ను ప్రారంభం

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 21: ఎన్నికల్లో ఇచ్చిన మాటను తప్పకుండా పాత డిజైన్ ప్రకారమే మంచిప్ప రిజర్వాయర్ ఉంటుందని, మంచిప్ప, తాండాలకు ఎటువంటి ఇబ్బంది ఉండదని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. మంచిప్ప గ్రామంలో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానను శుక్రవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత డిజైన్ ప్రకారమే మంచి రిజర్వాయర్ నిర్మాణం జరుగుతుందని, సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. మంచిప్ప గ్రామం ఇతర తండాలకు ఎటువంటి ఇబ్బంది ఉండకుండా, ఒక్క గుంట భూమి కూడా రిజర్వాయర్ లోకి పోదని అన్నారు. మంచిప్ప రిజర్వాయర్ ను పెంచి నిర్మిస్తామని ప్రభుత్వం చెపితే మీతో పాటు నేను ఉద్యమం చేశాను అని గుర్తు చేశారు. పల్లె దవాఖానతో చుట్టుపక్కల గ్రామాల, తండాల ప్రజలకు ఆరోగ్యపరంగా పల్లె దవాఖాన ఎంతో ఉపయోగపడుతుంద న్నారు. వృద్ధులకు, గర్భిణీలకు, వ్యాధిగ్రస్తులకు మంచి వైద్యం అందించడానికి పల్లె దవాఖాన ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. రాబోవు మూడు సంవత్సరాల్లో మంచిప్ప గ్రామం ఎవరు కూడా ఇల్లు లేకుండా ఉండకూడదని ఇందిరమ్మ ఇల్లు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ ముప్పగంగారెడ్డి, మండల అధ్యక్షులు సాయి రెడ్డి, మోపాల్, మండల యూత్ అధ్యక్షులు రాజేష్ ,మాజీ జెడ్పిటిసి మోహన్, మాజీ ఎంపీటీసీ శంకర్, డాక్టర్లు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



మాలల రణభేరి' సభను విజయవంతం చేయాలి

- మాల మహానాడు పిలుపు

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 21: మాలల న్యాయమైన హక్కుల సాధన కోసం 23న హైదరాబాద్‌లోని సరూర్నగర్ వేదికగా నిర్వహించనున్న 'మాలల రణభేరి' బహిరంగ సభను విజయవంతం చేయాలని మాల మహానాడు నాయకులు పిలుపునిచ్చారు. హుస్నాబాద్ మాల మహానాడు ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ చౌరస్తాలో సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. మధ్యాహ్నం రెండు గంటలకు సభ ప్రారంభమవుతుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ నాయకులు కేకే మాట్లాడుతూ ప్రభుత్వంపై పలు కీలక డిమాండ్లు చేశారు. సుప్రీంకోర్టు సూచనలకు విరుద్ధంగా, 2011 జనాభా లెక్కల ఆధారంగా సరైన ఎంపరికల్ డేటా లేకుండా కులాల వారీగా చేసిన ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ బోజు రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు యాస శ్రీనివాస్, హుస్నాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు నోముల బాలయ్య, లీగల్ సెల్ అడ్వైజర్ చావుల రాజమౌళి, సావుల శ్రీనివాస్, జిల్లా సోషల్ మీడియా ఇంచార్జీ ఆరే శరత్, లీగల్ సెల్ రిపోర్టర్ బోడుమల్ల సంపత్, బత్తుల రాజయ్య, వెన్న రాజయ్య, మాశం కొమురయ్య, గిరిమల్ల ప్రసాద్ తదితర మాల బాంధవులు పాల్గొన్నారు.



బయో మెడికల్ వ్యర్థాలను
బహిరంగ ప్రదేశాల్లో వేయొద్దు

- కాలుష్య నియంత్రణ మండలి ఏజెన్సీకి ఇవ్వాలి
- అదనపు కలెక్టర్ అరుణశ్రీ

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 21: హానికరమైన బయో మెడికల్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో పడ వేయకుండా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పని చేస్తున్న ఏజెన్సీకి అప్పగించాలని ఆసుపత్రి నిర్వహకులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు),రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణశ్రీ కోరారు. ఈ మేరకు డీఎం అండ్ హెచ్ఓతో కలిసి స్థానిక ప్రభుత్వ, సింగరేణి, ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులతో శుక్రవారం ఎన్టీపీసీ మిలీనియం హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాడిన సిరంజీలు, ప్లాస్టర్, దూది తదితర ప్రమాదకర వ్యర్థాలను సాధారణ చెత్తలో పడవేస్తే చెత్త తొలగించేటప్పుడు మున్సిపల్ సిబ్బందికి హాని జరిగే అవకాశం ఉన్నందున ఈ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణించి సదరు ఆసుపత్రి నిర్వహకులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. డీఎంహెచ్ఓ వాణిశ్రీ మాట్లాడుతూ బయో మెడికల్ వ్యర్థాలను కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలోపని చేస్తున్న వెంకట రమణ ఇన్సినరేటర్స్ కు మాత్రమే అప్పగించాలని అన్నారు. సదరు ఏజెన్సీ నిర్వాహకులు క్రమం తప్పకుండా ఆసుపత్రుల నుండి బయో మెడికల్ వ్యర్థాలను సేకరించాలని అన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన ఆసుపత్రుల లైసెన్సులను రద్దు చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా బయో మెడికల్ వ్యర్థాలను వేరు చేసి పసుపు, ఎరుపు, నీలం డబ్బాల్లోవేయడంపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, ప్రభుత్వ, సింగరేణి ఎన్టీపీసీ ఆసుపత్రుల వైద్యాధికారులు, ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు, నగర పాలక సంస్థ శానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నాణ్యత ప్రమాణాలు పాటించాలి: ఏ ఈ ఓ

ప్రతిపక్షం, సోన్, నవంబర్ 21: మండలంలోని వివిధ గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ విస్తరణ అధికారిని ఉమ మహేశ్వరి శుక్రవారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు పారదర్శకంగా చేపట్టాలని అన్నారు. తూకం విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. తూకం వేసిన ధాన్యం వెను వెంటనే మిల్లులకు చేరేలా చూడాలని అన్నారు. సేకరించిన ధాన్యం వివరాలు ఆన్లైన్ లో నమోదు చేయాలని అన్నారు. ఇందులో కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైతులు ఉన్నారు.



వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

ప్రతిపక్షం, చిగురుమామిడి, నవంబర్ 21: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో వేర్వేరు చోట్ల జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడం, అతివేగం కారణంగానే ఈ ప్రమాదాలు సంభవించినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ రెండు ఘటనలపై చిగురుమామిడి ఎస్సై సాయికృష్ణ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం అర్ధరాత్రి సుమారు 00:30 గంటల ప్రాంతంలో కొండాపూర్ గ్రామం వెలుపల ఈ ఘోర ప్రమాదం జరిగింది. సుందరగిరి నుంచి హుస్నాబాద్ వైపు వెళుతున్న టీఎస్ 15 ఈహెచ్ 4957 నెంబరు గల పల్సర్ ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. వేగం కారణంగా నియంత్రణ కోల్పోయిన వాహనం రోడ్డు పక్కనే ఉన్న పొదల్లోకి దూసుకెళ్లింది.ఈ ఘటనలో వాహనాన్ని నడుపుతున్న గగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన దొంతరవేని విజయ్ కుమార్ (22) తలకు తీవ్ర గాయాలయ్యాయి. రక్తస్రావం అధికమవడంతో అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వెనుక కూర్చున్న వ్యక్తికి స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

టీవీఎస్ ఎక్సెల్ ను ఢీకొట్టిన ట్రాక్టర్

మండలంలోని సుందరగిరిగగిరెడ్డిపల్లి మార్గంలో మరొక ప్రమాదం జరిగింది. సుందరగిరి గ్రామ శివారులో పొలాల దారి నుండి మెయిన్ రోడ్డులోకి ఆకస్మాత్తుగా వస్తున్న ఓ ట్రాక్టర్ అటుగా వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక భాగం నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు సుందరగిరి గ్రామానికి చేందిన ద్విచక్ర వాహనదారుడు గందె రాజయ్య (69) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్పందించి అంబులెన్స్‌లో అతడిని హుస్నాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే రాజయ్య మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు.

చిగురుమామిడి ఎస్ఐ సాయికృష్ణ కేసు నమోదు చేసి, రెండు ఘటనలపై విచారణ కొనసాగిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రామగుండంలో అనైతిక, అరాచక పాలన

- బీఆర్ఎస్ నాయకుడు హరీష్ రెడ్డి



ప్రతిపక్షం ప్రతిపక్షం, గోదావరిఖని, నవంబర్ 21: రామగుండంలో అనైతిక, అరాచక పాలన కొనసాగుతోందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఉదయం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే వైఖరిని ఎండగట్టారు. దారి మైసమ్మ ఆలయాల కూల్చివేత ఘటనపై స్పష్టమైన ప్రకటన లేకపోవడం, బాధ్యులపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ తప్పిదం నుండి ప్రజల ఆలోచనలు మళ్లించేందుకే రామగుండం గుట్టపై ఆలయ నిర్మాణం అంటూ పూజా కార్యక్రమాలు చేపట్టారని విమర్శించారు.బూడిద,మట్టి, ఇసుక దందాలపై వస్తున్న డబ్బులను గుట్టపై నిర్మిస్తున్న ఆలయానికి కేటాయిస్తూ తమ సొంత డబ్బులతో నిర్మిస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటుండడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. మద్దతు ధర లేక ఆందోళన చెందుతున్న పత్తి రైతులను పట్టించుకున్న వారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు.ఇందిరమ్మ ఇళ్లపై, సింగరేణి నిధులపై స్థానికఎమ్మెల్యే శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఎఫ్సీఎల్ దోషులను కటకటాల వెనక్కి పంపుతానన్న ఎమ్మెల్యే, ఎందుకు ఆ హామీని నెరవేర్చడం లేదని నిలదీశారు. ఈ స్కాంలో రాజ్ ఠాగూర్ కు 25 లక్షలు ముట్టడం వల్లనే నోరు మెదపడం లేదని ఆరోపించారు.కూల్చివేతలు, బెదిరింపులు, అక్రమ అరెస్టులు తప్ప గడిచిన రెండేళ్లలో రామగుండంలో జరిగింది ఏమీ లేదని విమర్శించారు.ప్రభుత్వ సంస్థ అయిన జెన్కో భవనాన్ని కూడా అర్ధరాత్రి దౌర్జన్యంగా కూల్చివేయడం అవమానసమని మండిపడ్డారు.అక్రమాలు, అరాచకాలకు పాల్పడుతున్న ఎమ్మెల్యే,అతని అనుచరులు రాబోయే రోజుల్లో ఫలితం అనుభవించక తప్పదని హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఐత శివకుమార్, మెరుగు చంద్రమౌళి, పోలాడి శ్రీనివాసరావు, అనుముల కళావతి, పర్స స్వాతి, వంశీకృష్ణ, కృష్ణస్వామి, పోషం, సంపత్, సురేష్‌సాయి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

“



మత్స్యకారులకు తమ పార్టీ అండగా ఉంటుంది. సముద్రాన్ని జీవనాధారంగా చేసుకుని, ఎగసిపడుతున్న కెరటాలతో నిత్యం పోరాటం చేస్తూ జీవనం సాగిస్తున్నా గంగ పుత్రులందరికీ ప్రపంచ మత్స్యకార దినోత్సవ శుభాకాంక్షలు. వారి సంక్షేమం, సాధికారతే లక్ష్యంగా 4 పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండ్ సెంటర్ల నిర్మాణాన్ని చేపట్టాం. రూ.4,913 కోట్లు లబ్ధి చేకూర్చాం.

-వైసీపీ అధినేత జగన్

ప్రాంతీయం



జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులివ్వాలి

- **ఇండ్లస్థలాలు కేటాయించి, దాడుల నుంచి రక్షణకు చట్టం చేయాలి**
- **టీడబ్ల్యూజేఎఫ్ వినతి**

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 21 : జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు తీరిపోయి ఏడాదిన్నర గడుస్తున్నా ఇంకా స్టిక్కర్లతో కొనసాగిస్తున్నారని వాటి స్థానంలో కొత్త కార్డులు ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ప్రతినిధులు అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ కు వినతి ఇచ్చారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో అక్రిడేషన్ కమిటీలు వేసి వెంటనే కొత్తవి జారీ చేయాలని డిమాండ్ చేశారు. టీడబ్ల్యూజేఎఫ్ హడ్ హక్ కమిటీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా నిజామాబాద్ కలెక్టరేట్లో శుక్రవారం అదనపు కలెక్టర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ. జిల్లా కేంద్రాలతో పాటు నియోజకవర్గ కేంద్రాల్లో, మండలాల్లో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. నిత్యం ఒత్తిడితో విధులు నిర్వర్తించే జర్నలిస్టులకు ఎలాంటి కొర్రీలు లేకుండా ప్రయివేటు, కార్పోరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వాస్తవాలు వెలుగులోకి తెస్తున్నజర్నలిస్టులపై ఈ మధ్య కాలంలో దాడులు పెరుగుతున్నాయని, అక్రమ కేసులు పరిపాటిగా మారాయని వాటిని నివారించేందుకు జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు రాంచందర్, ఎం.భాస్కర్, కె.వెంకటేశ్, ఎం.మధు, ఏ.అనిత, పరమేశ్వర్, రాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

అంత్యపుష్కరాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



ప్రతిపక్షం, భూపాలపల్లి ప్రతినిధి, నవంబర్ 21: రాబోయే సంవత్సరం కాళేశ్వరంలో మే 21 నుండి జూన్ 1వ తేదీ వరకు జరగనున్న సరస్వతి అంత్యపుష్కరాల ఏర్పాట్లపై ముందుగానే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను కోరారు. సరస్వతి అంత్యపుష్కరాలు, కాళేశ్వరం అభివృద్ధికి మాస్టర్ ప్రణాళిక తదితర అంశాలపై రెవెన్యూ, పోలీస్, దేవాదాయ, ఆర్ అండ్ బి, పంచాయతి, పంచాయతి రాజ్ ఇంజినీరింగ్, విద్యుత్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, తదితర శాఖల అధికారులతో కాళేశ్వరంలో సమావేశం నిర్వహించారు. శాఖల వారిగా చేపట్టాల్సిన పనులపై స్పష్టమైన ప్రణాళికలు, అంచనా నివేదికలు, మార్పులు, చేర్పుల వివరాలను త్వరితగతిన సమర్పించాలన్నారు.కాళేశ్వరంలో శాశ్వత హెలిపాడ్ నిర్మాణం చేపట్టాలని స్పష్టంచేశారు. పుష్కర ఘాట్ల వద్ద భక్తులకు బట్టలు మార్చుకునే గదులను, ఏర్పాటు చేయాలని, నూతనంగా నిర్మించిన మరుగుదొడ్ల వద్ద పూర్తిస్థాయిలో సిసి రోడ్డు నిర్మాణం జరపాలని, పిండ ప్రధానం షెడ్డును త్వరగా పూర్తిచేసి, భక్తులకు అందుబాటులోకి తేవాలని తెలిపారు. మరుగుదొడ్ల నుంచి వచ్చే మురుగునీరును తరలించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. సరస్వతి ఘాటును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కళ్యాణ కట్ట భవనం త్వరగా పూర్తి చేయాలన్నారు. అలాగే సరస్వతి మాత విగ్రహం పై కప్పు, ప్లాట్ ఫామ్ పనులను డిసెంబర్ వరకు పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, కాటారం డిఎస్పీ సూర్యనారాయణ, దేవాలయ ఈఓ మహేష్, ఆర్ అండ్ బి ఈ ఈ రమేష్, పీఆర్ ఈ ఈ వెంకటేశ్వర్లు, విద్యుత్తుశాఖ డీఈ పాపిరెడ్డి, డివిజనల్ పంచాయతి అధికారి మల్లికార్జున్ రెడ్డి, తహసీల్దార్ రామారావు, ఇరిగేషన్ డీఈ ప్రకాష్, దేవాదాయ శాఖ ఏఈ అశోక్ కుమార్, సింగిల్ విండో చైర్మన్ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కస్తూర్బా హాస్టల్‌లో ఆహారంపై

అదనపు కలెక్టర్ ఆగ్రహం

- **సరుకులు సరఫరా చేయని వారిపై చర్యలకు ఆదేశం**

ప్రతిపక్షం, భూపాలపల్లి ప్రతినిధి, నవంబర్ 21: విద్యార్థులకు మెనూ ప్రకారంగా భోజనం అందించడం లేదని, కూరగాయలు లాంటి ఇతర నిత్యావసరాల సరఫరాల జరగటం లేదని తెలుసుకున్న అదనపు జిల్లా కలెక్టర్ ప్రిన్సిపాల్ పై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు సరఫరాదారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహాముత్తారం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మహాముత్తారం మండలంలోని కస్తూర్బా విద్యాలయంలోని వసతి సదుపాయాలు, విద్యార్థినులకు అందిస్తున్న భోజనం, మెనూ నిర్వహణ, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు, హాజరు రిజిస్టర్, వంటశాల పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించారు.ఆహార మెనూ అమలు చేయకపోవడం లేదని ప్రిన్సిపాల్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ పర్యవేక్షణ చేసి ఆయా ఇన్‌చార్జ్‌లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూరగాయలు సక్రమంగా సరఫరా చేయకపోవడం పై విద్యాశాఖ అధికారి విచారణ నిర్వహించాలన్నారు. తనిఖీలో పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, సహకార అధికారి వాలియా నాయక్, తహసీల్దార్ శ్రీనివాస్, పౌర సరఫరాల శాఖ ఆర్ఐ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమిష్టి కృషికి నిదర్శనమే అవార్డులు

- **కలెక్టర్ అభిలాష అభినవ్**

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 21 : అధికారుల సమిష్టి కృషికి నిదర్శనంగానే అవార్డులు, రివార్డులు లభిస్తాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇటీవల జిల్లాకు లభించిన 'జల సంచాయ్ - జనభాగిదారి' అవార్డు సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జల సంరక్షణలో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, ప్రజల భాగస్వామ్యమే ఈ అవార్డుకు కారణం అన్నారు. లక్ష్యాలను సమయానికి చేరుకోవడమే కాకుండా, అమలు విధానంలో పారదర్శకత చూపడంతోనే రాష్ట్ర స్థాయిలో జిల్లా ముందంజలో నిలిచింది అని పేర్కొన్నారు. జిల్లాలో భూగర్భ జలాల సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి నిల్వ ప్రాజెక్టులు, ప్రజా భాగస్వామ్య కార్యక్రమాలలో అధికారులు అద్భుతంగా పని చేశారని కొనియాడారు. ముందుముందు ఇదే ఉత్సాహం కొనసాగించాలని సూచించారు.పలువురు క్షేత్రస్థాయి ఉద్యోగులు మాట్లాడుతూ, అత్యల్ప సమయంలో సమర్థవంతంగా కార్యక్రమాలు పూర్తి చేయడానికి కలెక్టర్ మార్గనిర్దేశం ముఖ్య కారణమని తెలిపారు. అనంతరం కలెక్టర్ కేక్ కట్ చేసి, అవార్డు సాధనలో సేవలందించిన అధికారులకు శాలువాలు చుట్టి సన్మానం చేసి, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం 18 ఫాగింగ్ యంత్రాలను మండల స్థాయిలో ఎంపీఓలకు కలెక్టర్ పంపిణీ చేశారు. వర్షాకాలంలో దోమల నిర్మూలనకు వీటిని సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్‌డీవో విజయలక్ష్మి, జెడ్పీ సీఈవో గోవింద్, డిపిఓ శ్రీనివాస్, ఎంపీడీవోలు, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు అన్ని రంగాల్లో అవగాహన కలిగి ఉండాలి

- **ఐరన్ మ్యాన్ ఆఫ్ ఇండియా ట్రైకత్లాన్ విజేత డాక్టర్ నరసింహారెడ్డి**

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్, 21 : విద్యార్థులు చదువుతోపాటు తమ అభిరుచిని ఇతర రంగాలలో ప్రదర్శించాలని ఇందుకోసం శారీరక దృఢత్వంతో పాటు అనేక రంగాల పట్ల అవగాహన కలిగి ఉన్నప్పుడే విజయాలు సాధిస్తామని నిర్మల్ ఐరన్ మ్యాన్ ఆఫ్ ఇండియా ట్రైకత్లాన్ విజేత డాక్టర్ నరసింహారెడ్డి అన్నారు మామడ మండలం పోన్కల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 75 వేల రూపాయల విలువ చేసే సీలింగ్ ఫ్యాన్ లను పాఠశాలకు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.విద్యార్థులు తమకు ఇష్టమైన రంగాలను ఎంచుకొని అందులో రాణించడం కోసం నిరంతరం కఠోర సాధన చేయాలని ఇందుకోసం ఉపాధ్యాయులు, సమాజంలో వివిధ రంగాల్లో విజయాలు సాధించిన వారి నీ ప్రేరణంగా తీసుకొని ముందుకు వెళ్లాలని ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా గ్రామ విద్యాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ అభివృద్ధి కమిటీ బాధ్యులు పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు డాక్టర్ నరసింహ రెడ్డి ని ఘనంగా శాలువలు, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గ్రామ విద్యాభివృద్ధి కమిటీ చైర్పర్సన్ సుదర్శన్, పాఠశాల గ్రంథాలయానికి పదివేల రూపాయల విలువైన పుస్తకాలను విరాళంగా అందించారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరవింద్ కుమార్ మాట్లాడుతూ పాఠశాలలోని సౌకర్యాలను విద్యార్థులు వినియోగించుకొని చదువుతో పాటు వివిధ రంగాల్లో రాణించాలని కోరారు .ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



డొంకేశ్వర్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- **తహసీల్దార్ కార్యాలయం, రైతు వేదిక, కొనుగోలు కేంద్రం సందర్శన**
- **భూభారతి దరఖాస్తులపై సమీక్ష**
- **కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పెండింగ్ అర్జీలపై ఆరా**

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 21 : డొంకేశ్వర్ మండల కేంద్రంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులపై ఒక్కో గ్రామం వారీగా రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్ష జరిపారు. వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్ లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు, ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి, ఎంత మందికి నోటీసులు ఇచ్చారు, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియకు అనుగుణంగా ఆన్ లైన్లో అన్ని అంశాలను అప్లోడ్ చేశారా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించాలని అన్నారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులకు సంబంధించి, స్పష్టమైన కారణాలను పేర్కొనాలని సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సన్నాహక ప్రక్రియను చేపడుతున్న తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. గడువులోపు ఎస్.ఐ.ఆర్ పూర్తి చేయాలని అన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ మంజూరీలపై ఆరా తీశారు. దరఖాస్తులు అందిన వెంటనే అర్హులైన వారిని గుర్తిస్తూ వెంటవెంటనే మంజూరీ జాబితాలు పంపాలని ఆదేశించారు. ఆధార్ అవసరం అయిన విద్యార్థులకు జనన ధృవీకరణ పత్రాలను సత్వరమే మంజూరు చేయాలని అన్నారు. అనంతరం కలెక్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యం సేకరణ తీరును పరిశీలించారు. కాగా, రైతు వేదికను సందర్శించిన సందర్భంగా కలెక్టర్ స్థానిక రైతులతో భేటీ అయ్యారు. ధాన్యం అమ్మకాల విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యాయా అని ఆరా తీయగా, అలాంటిదేమీ లేదని ధాన్యం అమ్మకాలు సాఫీగా జరిగాయని రైతులు తెలిపారు. ఆయిల్ పామ్ సాగును ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని గుర్తు చేశారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ నరేష్ కుమార్, మండల వ్యవసాయ అధికారి మధుసూదన్ తదితరులు ఉన్నారు.

వరి పంట కోతలు జరుగుతున్నందున

వ్యవసాయ సర్వీసుల రిలీజ్ చేపట్టాలి

- **ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి**



ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 21: వరి కోతలు పూర్తి అవుతున్న నేపథ్యంలో యుద్ధప్రాతిపదికన వ్యవసాయ సర్వీసుల రిలీజ్ చేయాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి 17 సర్కిళ్ల ఎస్ఈలను ఆదేశించారు. శుక్రవారం హన్మకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ కార్పొరేట్ కార్యాలయం నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే మూడు నెలల వారిగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకొని అనుకున్న లక్షాలకు అనుగుణంగా వేగవంతగా వ్యవసాయ సర్వీసుల మంజూరు పనులు చేపట్టి , సర్వీసులను రిలీజ్ చేయాలని తెలిపారు . పురోగతిలో ఉన్న సర్వీసుల మంజూరు పనులు పూర్తి చేయాలనీ అన్నారు . పెండింగ్ లో ఉన్న పనులను కూడా పూర్తి చేయాలనీ చెప్పారు . కావాల్సిన మెటీరియల్ అందుబాటులో ఉందని, ఆలస్యం కాకుండా మంజూరు చేయడానికి కావాల్సిన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు . అలాగే ఎలక్ట్రిక్ వెహికల్ ఛార్జింగ్ స్టేషన్ ల సర్వీసుల మంజూరుకు సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు . టిజి ఐ పాస్ , హెచ్ టి (సింగిల్ విండో) సర్వీసుల పై సమీక్షిస్తూ సర్వీసుల మంజూరులో జాప్యం లేకుండా మంజూరు చేయాలని చెప్పారు . ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సి.ఈ టి . సదర్ లాల్ , 17 సర్కిళ్ల ఎస్ ఈ లు , కమర్షియల్ డిఈ జమున , ఏడీఈ మధుకర్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



సమాచార కమిషనర్ అయోధ్య రెడ్డిని కలిసిన కలెక్టర్

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 21: రాష్ట్ర సమాచార కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి హనుమకొండ జిల్లా పర్యటన నిమిత్తం శుక్రవారం హనుమకొండలోని హరిత కాకతీయకు చేరుకోగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పర్యటన నిమిత్తం వచ్చిన సమాచార శాఖ కమిషనర్ అయోధ్య రెడ్డికి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ మొక్కలను అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.



నూతన విద్యుత్ సర్కిల్ కార్యాలయం పనుల పరిశీలన

- **ఎన్పిడిసిఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి**

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 21: వరంగల్ లోని ములుగు రోడ్ లో నూతనంగా నిర్మించే వరంగల్ సర్కిల్ కార్యాలయ నిర్మాణ పనులను శుక్రవారం ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి పరిశీలించారు . అలాగే వరంగల్ డిస్ట్రిక్ట్ స్టోర్స్ నిర్మాణ పనులను కూడా పరిశీలించి తగు సూచనలు అధికారులకు సూచించారు. ఈ సందర్భాంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే గణతంత్ర దినోత్సవానికి పూర్తి కావాలని ఆదేశించారు . పనుల పురోగతి పై చర్చిస్తూ చాలా అధునాతనంగా తీర్చిదిద్దాలని , పచ్చదనం , మొక్కలు ఉండేలా ఏర్పాట్లు చేయాలనీ అన్నారు . వరంగల్ డిస్ట్రిక్ట్ స్టోర్స్ డిసెంబర్ 31 వరకు పూర్తి అయ్యేలా అన్ని సత్వర చర్యలు చేపడుతూ పనులు ముమ్మరంగా జరిగేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎస్ఈ కాసిడి గౌతమ్ రెడ్డి , డిఈ ఆనందం , అనిల్ కుమార్ , ఈ ఈ సివిల్ వెంకటేశ్వర్లు , వెంకట్రామ్ ఏ.డీఈ సివిల్ ప్రణయ్ , ఏ.ఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలి

- **బోధన్ డివిజన్ సమీక్షలో పోలీస్ కమిషనర్**



ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 21 : బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ లలో పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం బోధన్ రూరల్ సర్కిల్ కార్యాలయం లో బోధన్ డివిజన్ లోని అన్ని పోలీస్ స్టేషన్ అధికారులతో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఆధ్వర్యంలో నెలవారి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమీక్ష సమావేశంలో పెండింగ్ కేసులు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోక్సో, గ్రేవ్ కేసులలో త్వరితగతిన ఇన్వేస్టిగేషన్ పూర్తి చేయాలని, పెండింగ్లో ఉన్న (అండర్ ఇన్వేస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి అడిగి, గ్రేవ్, నాన్ గేవ్ కేసులలో ఇన్వేస్టిగేషన్ చేసేటప్పుడు ప్రతీ కేసులలో క్వాలిటీ ఇన్వేస్టిగేషన్తో పూర్తి పారదర్శకంగా చేయాలన్నారు. కేసు నమోదు నుండి చార్జీషీటు వరకు ప్రతివిషయాన్ని కూలంకుశంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలని, పోక్సో, గ్రేవ్ కేసులలో త్వరితగతిన ఇన్వేస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జీషీటు దాఖాలు చేయాలని సూచించారు. ప్రతీ అధికారికి సీసీటీఎన్ఎస్ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలి అన్నారు. సైబర్ నేరాల పై ప్రజలలో అవగాహణ కార్యక్రమాలను నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి ప్రజలలో రోడ్డు భద్రత నిబంధనల పై అవగాహన కల్పించాలన్నారు. గ్రామ పోలీస్ అధికారులు ప్రతీ రోజు గ్రామాన్ని సందర్శించి ప్రజలతో మమేకంమవుతు నేర నియంత్రణకు కృషి చేయాలని అన్నారు. ఆన్లైన్ మోసాలకు గురి అయినట్లయితే 1930 కాల్ చేసి లేదా ఎన్.సి.ఆర్.పి https:// www.cybercrime.gov. ఇంకా పోర్టల్ యందు ఫిర్యాదు నమోదు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో బోధన్ ఏసీపీ పి. శ్రీనివాస్, బోధన్ ఎస్ హెచ్ ఓ వి. వెంకట్ నారాయణ, రుద్రూర్ సీఐ కృష్ణ, ఎస్సైలు మచ్చేందేర్ రమ, చంద్ర మోహన్, సునీల్, సాయన్న, ఏ ఎస్సైలు రామరాజు, సీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

"



రాబోయే ఐదేళ్లలో తాను సంపాదించే డబ్బులో 90%, ఢిల్లీలో కుటుంబం కోసం ఇల్లు మినహా 20ఏళ్లలో సంపాదించిన ఆస్తులను పార్టీకే ఇచ్చేస్తా. ప్రజలు కూడా ఏటా రూ.వెయ్యి చొప్పున విరాళం ఇవ్వాలి. జనవరి 15 నుంచి బిహార్ నవ్‌నిర్మాణ్ సంకల్ప యాత్ర చేస్తాం. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం.

- జన్ సురాజ్ చీఫ్ ప్రశాంత్ కిశోర్

విశ్వ వీక్షణం

ఢిల్లీకి చేరిన కర్ణాటక సీఎం 'పంచాయితీ'

- సిద్ధరామయ్యను మార్చే అవకాశం



ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, బెంగళూరు, నవంబర్ 21: ఇప్పటికే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పరిస్థితి దారుణంగా మారింది. కర్ణాటక , తెలంగాణలో మాత్రమే ఆ పార్టీ అధికారంలో ఉంది. ఇటీవల బిహార్ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మహా గర్ బంధన్ గెలుస్తుందని, అందులో కాంగ్రెస్ పార్టీకి సింహభాగం లభిస్తుందని అందరూ అనుకున్నారు. కానీ, ఊహించిన విధంగా బిహార్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఫలితాలు రాలేదు. పైగా ఈసారి సింగిల్ డిజిట్ స్థానాలకు మాత్రమే కాంగ్రెస్ పార్టీ పరిమితం అయిపోయింది. ఒకరకంగా ఆ పార్టీ అగ్రనాయకత్వానికి బిహార్ ఎన్నికలు తీవ్ర ఇబ్బందికరంగా పరిణమించాయి. ఈ పరిణామాలు ఇలా ఉండగానే కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక రాష్ట్రంలో పరిస్థితులు వేగంగా మారిపోతున్నాయి. ఇక్కడ సిద్ధరామయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. కొంతకాలంగా ఇక్కడ ముఖ్యమంత్రి మార్పు ఖాయమని, ఇక ఆయన స్థానంలో డీకే శివకుమార్ ను ముఖ్యమంత్రిగా చేస్తారని ప్రచారం మొదలైంది. ఈ క్రయంలో ఉన్నట్టుండి కర్ణాటక రాష్ట్రంలో ఊహించని విధంగా రాజకీయ పరిణామాలు మారిపోయాయి. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కొంతమంది ఎమ్మెల్యేలతో కలిసి ఢిల్లీ వెళ్లారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సరిగ్గా రెండున్నర సంవత్సరాలు అవుతోంది. ఈ క్రమంలో పవర్ షేరింగ్ కోసం అధిష్టానం మీద ఒత్తిడి తీసుకురావడానికి డీకే శివకుమార్ ఢిల్లీ వెళ్ళినట్టు తెలుస్తోంది. కచ్చితంగా సీఎం మార్పు ఉంటుందని తెలుస్తోంది. అయితే ఈ పరిణామాలపై డీకే వర్గం ఇంతవరకు నోరు మెదపలేదు.



స్కీయింగ్
మంచులో భలే మజా!!

చలికాలం సీజన్‌లో అనేక పర్వత ప్రాంతాల్లో మంచు కురుస్తోంది. స్కీయింగ్‌ను ఇష్టపడే వ్యక్తులకు ఇది చాలా ఉత్తేజకరమైన సమయం. స్కీయింగ్‌కు అనువైన 5 ప్రదేశాల గురించి ఇక్కడ మేము మీకు చెప్పబోతున్నాము. మీరు ఈ ప్రదేశాలలో మరిన్ని సాహసోపేతమైన కార్యకలాపాలను చేయవచ్చు. శీతాకాలం వచ్చిన వెంటనే, ప్రజలు పర్వతాలను సందర్శించడానికి ప్రణాళికలు వేస్తారు. హిమపాతాన్ని ఆస్వాదించడానికి ఇదే సరైన సమయం. ప్రస్తుతం, కాశ్మీర్, నైనిటాల్ (హిమపాతం గమ్యస్థానాలు భారతదేశం) వంటి అనేక ప్రదేశాలలో హిమపాతం ఉంది, ఆ తర్వాత ఈ ప్రదేశాలలో పర్యాటకుల వరద ఉంది. స్కీయింగ్ ప్రియులకు ఇది చాలా మంచి సమయం. మీరు కూడా మంచు మీద జారిపడి పర్వతాల అందాలను ఆస్వాదించాలనుకుంటే, భారత దేశంలో స్కీయింగ్ చేయడానికి చాలా గొప్ప ప్రదేశాలు ఉన్నాయి. భారతదేశంలో స్కీయింగ్ కోసం 5 ఉత్తమ ప్రదేశాల గురించి తెలుసుకుందాం.

ఔలి, ఉత్తరాఖండ్

ఇది ఎందుకు ప్రత్యేకం ఔలి గర్వాల్ హిమాలయాల్లో ఉంది. నందా దేవి మరియు మన పర్వతం యొక్క అద్భుతమైన వీక్షణలతో, ఔలిలో అనేక స్కీయింగ్ వాలులు ఉన్నాయి, ఇవి ప్రారంభ మరియు అనుభవజ్ఞులైన స్కీయర్‌లకు సరిపోతాయి. ఏమి చేయాలి ఇక్కడ స్కీయింగ్‌తో పాటు ట్రెక్కింగ్, పారాగ్లైడింగ్ మరియు కేబుల్ కార్ రైడ్ కూడా చేయవచ్చు.

గుల్మార్గ్, కాశ్మీర్

ఇది ఎందుకు ప్రత్యేకం గుల్మార్గ్ ఆసియాలో అత్యుత్తమ స్కీయింగ్ గమ్యస్థానంగా పరిగణించబడుతుంది. ఇక్కడ మీరు వివిధ కష్ట స్థాయిల వాలులను కనుగొంటారు. ఏమి చేయాలి స్కీయింగ్ కాకుండా, మీరు ఇక్కడ లోయను అన్వేషించవచ్చు మరియు షేర్‌ఎకశ్మీర్ నేషనల్ పార్క్‌లో వన్యప్రాణులను కూడా చూడవచ్చు.

సోలాంగ్ వ్యాలీ, హిమాచల్ ప్రదేశ్

ఇది ఎందుకు ప్రత్యేకం మనాలి సమీపంలో ఉన్న సోలాంగ్ వ్యాలీ స్కీయింగ్ మరియు ఇతర సాహస క్రీడలకు ప్రసిద్ధి చెందిన ప్రదేశం. ఇక్కడ మీరు మంచు మీద చేసిన స్నోమెన్ మరియు స్నోబాల్ ఫైట్‌లను కూడా ఆస్వాదించవచ్చు. ఏమి చేయాలి స్కీయింగ్‌తో పాటు, మీరు ఇక్కడ పారాగ్లైడింగ్, జిప్‌లైనింగ్ మరియు స్నో మొబైలింగ్ కూడా చేయవచ్చు.

నరకంద, హిమాచల్ ప్రదేశ్

ఇది ఎందుకు ప్రత్యేకం సిమ్లా సమీపంలో ఉన్న నరకంద ప్రశాంతమైన మరియు అందమైన హిల్ స్టేషన్. ఇక్కడ మీరు ప్రశాంతమైన వాతావరణంలో స్కీయింగ్‌ని ఆనందిస్తారు. ఏమి చేయాలి స్కీయింగ్‌తో పాటు, మీరు ట్రెక్కింగ్‌కు వెళ్లి ఇక్కడ స్థానిక మార్కెట్‌లను సందర్శించవచ్చు.

కుఫ్రి, హిమాచల్ ప్రదేశ్

ఇది ఎందుకు ప్రత్యేకం కుఫ్రి అనేది సిమ్లా సమీపంలోని ఒక చిన్న హిల్ స్టేషన్, ఇది స్కీయింగ్ మరియు ఇతర చలికాలపు కార్యకలాపాలకు ప్రసిద్ధి.
ఏమి చేయాలి స్కీయింగ్ కాకుండా, మీరు గుర్రపు స్వారీ మరియు స్థానిక సంస్కృతిని ఇక్కడ అనుభవించవచ్చు.

స్కీయింగ్ కోసం ఎలా సిద్ధం కావాలి?

- **దుస్తులు- వెచ్చని బట్టలు, చేతి తొడుగులు, టోపీ మరియు స్కీ బూట్లు తీసుకోవాలి**
- **భద్రతా సామగ్రి- హెల్మెట్ మరియు గాగుల్స్ ధరించడం మర్చిపోవద్దు**
- **శిక్షకుడు- మీరు మొదటిసారి స్కీయింగ్ చేస్తుంటే, శిక్షకుడి పర్యవేక్షణలో చేయండి**
- **ఆరోగ్యం - స్కీయింగ్ అనేది శారీరకంగా అలసిపోయే పని, కాబట్టి బాగా సిద్ధంగా ఉండండి**









రేషన్ కార్డుదారులకు బిగ్ అలర్ట్

- భారీ సంఖ్యలో లబ్దిదారుల తొలగింపు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 21: దేశంలో చాలా మంది ఆర్థికంగా బలహీనంగా ఉన్నారు. అవసరమైన ప్రజలకు రెండు పూటలా ఆహారం కూడా దొరకదు. ఇలాంటి పరిస్థితులలో భారత ప్రభుత్వం జాతీయ ఆహార భద్రతా చట్టం కింద ఉచిత రేషన్ ఇస్తోంది. ఉచిత రేషన్, తక్కువ ధరలో రేషన్ పొందడానికి రేషన్ కార్డు తప్పనిసరి. ఇటీవల రేషన్ కార్డుల నుంచి పెద్ద సంఖ్యలో పేర్లు తొలగిస్తున్నారనే అంశం వెలుగులోకి వచ్చింది. అర్హత లేని వారిని తొలగించాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిసింది. అనేక చోట్ల మరణించిన వ్యక్తుల పేర్లతో కూడా సంవత్సరాలుగా రేషన్ తీసుకుంటున్నట్లు తనిఖీలలో తేలింది. ఈ క్రమంలో గత కొన్ని నెలలలో ప్రభుత్వం ఉచిత రేషన్ పథకం నుంచి 2.25 కోట్ల పేర్లను తొలగించింది. కేవలం అర్హులకే లబ్ధి అందాలని మంత్రిత్వ శాఖ అధికారులు చెబుతున్నారు. చాలా మంది ప్రభుత్వ పథకాల ప్రయోజనం పొందడానికే రేషన్ కార్డులు పొందారని తేలింది. కొంతమంది ఆరు నెలలుగా రేషన్ తీసుకోలేదు. దీనితో ప్రభుత్వం అలాంటి కుటుంబాలను పీడీఎస్ జాబితా నుంచి తొలగించడానికి సిద్ధమవుతోంది. ఒకవేళ మీ రేషన్ కార్డు యాక్టివ్ గా లేకపోతే ఈ కేవైసీ చేయడం మర్చిపోవద్దు. అప్డేట్ చేయని కార్డులు మొదట డీయాక్టివేట్ చేస్తారు. తర్వాత తొలగిస్తారు.



భారీ ఉగ్ర కుట్రను ఛేదించిన గుజరాత్ ఏటీఎస్

- ప్రాణాంతక రసాయనాలతో దాడులకు ప్లాన్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 21: ఐసిస్ ఉగ్రవాదుల భారీ 'ఉగ్ర' కుట్ర బట్టబయలైంది. హరిద్వార్ , ఢిల్లీ, లక్నో, అహ్మదాబాద్,, ముంబై, కోల్‌కతా సహా ప్రధాన నగరాలలో ప్రాణాంతక రసాయనాలతో ఉగ్రదాడులకు కుట్రలు చేశారని గుజరాత్ ఉగ్రవాద వ్యతిరేక దళం (ఏటీఎస్) గుర్తించింది. ఐసిస్‌తో లింకులున్న అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్, ఆజాద్ సులేమాన్ షేక్, మహ్మద్ సుహైల్ సలీం ఖాన్‌ను అహ్మదాబాద్‌లో అరెస్టు చేసి ప్రశ్నించినపుడు ఈ వివరాలు వెలుగులోకి వచ్చాయి. ప్రధాన నిందితుడు అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్ హైదరాబాద్ వాసే. ఉగ్రదాడులకు పథక రచనలో ఇతడిది కీలక పాత్ర అని గుజరాత్ ఏటీఎస్ అనుమానిస్తోంది. ఇతడు ఒక డాక్టర్ కూడా. చైనాలో మెడిసిన్ చదివాడు. హైదరాబాద్‌లోని రాజేంద్ర నగర్ ఫోర్ట్‌వ్యూ కాలనీలో ఉంటున్నాడు. ఎంబీబీఎస్ చేసినా ఇంటిలో ఒంటరిగా ఉండేవాడని అధికారులు గుర్తించారు. అతడి ప్రవర్తన వింతగా ఉండేదని విచారణలో తేలింది. వివిధ రసాయనాల కోసం ఆన్‌లైన్‌లో పదేపదే ఆర్డర్లు ఇచ్చాడని కూడా గుర్తించారు. తన ఇంటిలోని ఓ గదిలో రసాయనాలు, ఆముదం నూనె (రైజిన్)తో రహస్య ప్రయోగాలు చేస్తుండేవాడని నిర్ధారించారు. అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు పలుమార్లు ప్రశ్నించగా, కమర్షియల్ అవసరాలకు వినియోగించే ఒక కెమికల్ తయారు చేస్తున్నానని అహ్మద్ నమ్మించాడు. ఎన్‌క్రిప్టెడ్ యాప్స్, సోషల్ మీడియా యాప్స్ ద్వారా అతివాద గ్రూపులు, ఐసిస్ ఉగ్రవాదులతో టచ్‌లో ఉండేవాడని గుర్తించారు. హైదరాబాద్ నుంచి కోల్‌కతా, అహ్మదాబాద్, ముంబై నగరాలకు వెళ్లొచ్చాడు. ఉగ్రదాడుల కోసం అక్కడ రెక్కీ నిర్వహించి ఉండొచ్చని అనుమానిస్తున్నారు.



దుబాయి ఎయిర్ షోలో అపశ్రుతి: పైలట్ మృతి

- విన్యాసాలు చేస్తుండగా కూలిన 'తేజస్' విమానం


ప్రతిపక్షం ప్రత్యేక ప్రతినిధి, దుబాయి (యూఏఈ), నవంబర్ 21: దుబాయి ఎయిర్ షోలో శుక్రవారం అపశ్రుతి చోటు చేసుకుంది. విన్యాసాల సందర్భంగా భారత్‌కు చెందిన తేజస్ ఫైటర్ జెట్ ఒక్కసారి కుప్పకూలింది. వేగంగా నేలను తాకింది. కొన్ని క్షణాల వ్యవధిలో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఘటనాస్థలంలో భారీగా పొగలు అలుముకున్నాయి. తీవ్ర గాయాలతో పైలట్ ప్రాణాలు కోల్పోయారు. భారత వాయుసేనలో వినియోగిస్తున్న తేలికపాటి యుద్ధ విమానం 'హాల్' తేజస్. ఈ ఘటన మీద భారత వైమానిక దళం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. పైలట్ కుటుంబానికి సానుభూతి తెలిపింది. ఈ కష్ట సమయంలో పైలట్ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చింది. ఘోర ప్రమాదానికి గల కారణాలపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. నెగెటివ్ జీఫోర్స్ టర్న్ నుంచి పైలట్ యుద్ధవిమానాన్ని వెనక్కి మళ్లించే క్రమంలో ప్రమాదం జరిగినట్లు సమాచారం. ప్రపంచంలోనే అతిపెద్దది అయిన దుబాయి ఎయిర్‌షోలో పలు దేశాలకు చెందిన విమానయాన సంస్థలు పాల్గొంటాయి. ఈ యుద్ధ విమానాలు ప్రమాదానికి గురవడం ఇది రెండవ సారి. మార్చిలో రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో కూలిపోయింది. పైలట్ సురక్షితంగా బయటపడ్డారు.

'సిర్' మీద విచారణకు 'సుప్రీం' ఓకే

- ఈసీ నుంచి సమగ్ర వివరణ కోరుతూ నోటీసులు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 21: కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా తలపెట్టిన 'సమగ్ర ఓటరు జాబితా ప్రత్యేక సవరణ' మీద నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కేరళ, ఉత్తరప్రదేశ్ సహా ఇతర రాష్ట్రాలలో ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణకు సుప్రీంకోర్టు శుక్రవారం అంగీకరించింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం పిటిషన్లను విచారించనున్నారు. వివరణ ఇవ్వాలంటూ ఎన్నికల కమిషన్‌కు నోటీసులు కూడా జారీ చేసింది. కేరళలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగాల్సి ఉందని అందువల్ల ఎస్ఐఆర్ విషయంలో అత్యవసర విచారణ అవసరమని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. కేరళ పిటిషన్లను ఈ నెల 26న విచారిస్తామని ధర్మాసనం పేర్కొంది. ఇతర రాష్ట్రాల నుంచి దాఖలైన పిటిషన్లను డిసెంబర్ మొదటి లేదా రెండో వారంలో విచారిస్తామంది. వాస్తవానికి దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహించాలని ఈసీ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు ఇప్పటికే విచారిస్తోంది. అటు, తమిళనాడు, బెంగాల్‌లో ఎస్ఐఆర్ నిర్వహణను సవాల్ చేస్తూ డీఎంకే, సీపీఎం, పశ్చిమ్ బెంగాల్ కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు, ఎన్నికల కమిషన్ నుంచి వేర్వేరుగా స్పందనలు కోరింది.







రెండో టెస్టు నుంచి కెప్టెన్ గిల్ ఔట్

- గాయం కారణంగా తప్పకున్న స్టార్ బ్యాటర్

దక్షిణాఫ్రికాతో గౌహతిలో జరగబోయే రెండో టెస్టు నుంచి కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గాయం కారణంగా వైదొలిగాడు. గౌహతి నుంచి ముంబైకి పయనమయ్యాడు. గిల్ స్థానంలో జట్టు బాధ్యతలను రిషబ్ పంత్ చూసుకుంటాడు. కోల్‌కతాలో జరిగిన తొలి టెస్ట్ లోనే గిల్‌కు గాయమైంది. మ్యాచ్ రెండో రోజున బ్యాటింగ్‌కు వచ్చిన వెంటనే, కొన్ని బంతులు ఆడి రిటైర్డ్ హర్ట్‌గా మైదానం నుంచి వెళ్లిపోయాడు. అయితే, తుది జట్టు ఎంపికలో గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని జట్టు మేనేజ్‌మెంట్‌కు కొన్ని ఇబ్బందులు తప్పవంటున్నారు. గిల్ ఆడే నాలుగో స్థానంలో సాయి సుదర్శన్ లేదా నితీశ్ కుమార్ రెడ్డిలలో ఒకరికి అవకాశం దక్కవచ్చు. అదనపు స్పిన్నర్ అక్షర్ పటేల్‌ను బెంచ్‌కే పరిమితం కావచ్చు. నెట్ ప్రాక్టీస్‌లో కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్ మాత్రమే పాల్గొన్నారు. కాగా టీమిండియా దక్షిణాఫ్రికాతో ఈ నెల 29 నుంచి వన్డే సిరీస్ కూడా ఆడాల్సి ఉంది. గిల్ మెడ నొప్పితో బాధపడుతున్నందున, వన్డే సిరీస్‌లో అతను పాల్గొంటాడా లేదా అనేది అనుమానమే.

దక్షిణాఫ్రికా జట్టుకు గట్టి ఎదురుదెబ్బ

- రెండో టెస్టు నుంచి కగిసో రబాడా ఔట్

భారత్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో ఇప్పటికే 1-0 ఆధిక్యంలో ఉన్న దక్షిణాఫ్రికా జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ ఫాస్ట్ బౌలర్ కగిసో రబాడా గాయం కారణంగా రెండో టెస్టుకు కూడా దూరమయ్యాడు. పక్కటెముకల ఒత్తిడి గాయంతో బాధపడుతున్న అతడు గౌహతిలో జరిగే రెండో టెస్టుతో పాటు, ఆ తర్వాత జరగబోయే వైట్ బాల్ సిరీస్‌కు కూడా అందుబాటులో ఉండడని క్రికెట్ సౌతాఫ్రికా ప్రకటించింది. కోల్‌కతాలో జరిగిన తొలి టెస్టుకు కూడా రబాడా దూరమైన సంగతి తెలిసిందే. గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడం, నొప్పి ఇంకా కొనసాగుతుండటంతో అతడిని సిరీస్ నుంచి తప్పిస్తున్నట్లు తెలిపింది. రబాడా స్థానంలో ఇప్పటికే లుంగి ఎంగిడిని జట్టులోకి తీసుకున్నారు. రబాడా నాలుగు వారాల పాటు వైద్య పర్యవేక్షణలో ఉంటాడని, రెండో టెస్ట్ ముగిసిన తర్వాత దక్షిణాఫ్రికాకు తిరిగి వెళతాడని సీఎస్ఏ వివరించింది. రబాడా గైర్హాజరీతో గౌహతి టెస్టులో సౌతాఫ్రికా ఎలాంటి మార్పులు లేకుండా బరిలోకి దిగే అవకాశం ఉంది. కోల్‌కతా టెస్టులో ఎనిమిది వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచిన స్పిన్నర్ సైమన్ హార్మర్ సఫారీ బౌలింగ్‌కు నాయకత్వం వహించాడు. అతడికి మరో స్పిన్నర్ కేశవ్ మహారాజ్‌తో పాటు, పేస్ ఆల్‌రౌండర్లు మార్కో యన్‌సెన్, వియాన్ ముల్డర్, కార్బిన్ బాష్ సహకారం అందించారు. గౌహతి టెస్టులోనూ సత్తా చాటి, 25 యేండ్ల తర్వాత భారత గడ్డపై టెస్టు సిరీస్ గెలవాలని టెంబా బవుమా సేన పట్టుదలగా ఉంది. చివరిసారిగా 2000వ సంవత్సరంలో హన్సీ క్రోన్యే కెప్టెన్సీలో దక్షిణాఫ్రికా జట్టు భారత్‌లో టెస్టు సిరీస్ కైవసం చేసుకుంది.



సెమీ ఫైనల్ లో ఓడిన భారత 'ఎ' జట్టు

- సూపర్ ఓవర్ లో చతికిలపడిన భారత బ్యాటర్లు


ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ సెమీ ఫైనల్ మ్యాచులో భారత జట్టు ఓడిపోయింది. సూపర్ ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన ఈ పోరులో బంగ్లాదేశ్ జట్టు విజయం సాధించింది. ఫలితంగా టీమిండియా ఫైనల్ కు చేరుకుండానే టోర్నీ నుంచి తప్పుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 'ఎ' జట్టు 20 ఓవర్లలో 194 పరుగులు చేసింది. భారత్ 'ఎ' జట్టు కూడా సరిగ్గా 194 పరుగులే చేయడంతో మ్యాచ్ టై అయ్యింది. దీంతో సూపర్ ఓవర్ నిర్వహించారు. సూపర్ ఓవర్‌లో భారత జట్టు రెండు వికెట్లను కోల్పోయినా ఒక్క పరుగు కూడా చేయలేకపోయింది. ఫామ్‌లో ఉన్న వైభవ్ సూర్యవంశీని సూపర్ ఓవర్ బ్యాటింగ్‌కు పంపకపోవడంపై విమర్శలొచ్చాయి. ఇటు బంగ్లా జట్టు లక్ష్యాన్ని ఛేదించి ఫైనల్‌కు చేరుకుంది. టాస్ గెలిచిన టీమిండియా ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. బంగ్లా జట్టు 6 వికెట్లు కోల్పోయి 194 పరుగులు చేసింది. బంగ్లాదేశ్ ఓపెనర్ హబీబుర్ రహమాన్ దూకుడుగా ఆడి 65 పరుగులు చేశాడు. మెహ్రూబ్ హుస్సేన్ 48 పరుగులు చేశాడు. బంగ్లాదేశ్ జట్టు చివరి ఐదు ఓవర్లలో ఏకంగా 75 పరుగులు సాధించింది. భారత బౌలర్లలో నమన్ ధీర్ 19వ ఓవర్‌లో 28 పరుగులు, విజయ్‌కుమార్ వైశాఖ్ చివరి ఓవర్‌లో 22 పరుగులు ఇచ్చారు. దీంతో ఛాలెంజింగ్ స్కోరును చేరుకుంది. అటు, సూపర్ ఓవర్‌లో పొరపాట్ల కారణంగా సెమీఫైనల్ నుంచే భారత్ ఇంటిదారి పట్టింది.



దాయాది దేశాల మధ్య మరో ఆసక్తికర పోరు


- ఫిబ్రవరి మధ్యలో తలపడనున్న భారత్, పాకిస్తాన్

టీ20 ప్రపంచ కప్ 2026లో జరగనుంది. ఇందుకోసం క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. ఈ మెగా టోర్నీలో భారత్, పాకిస్తాన్ మరోసారి తలపడనున్నాయి. దాయాదుల మధ్య ఫిబ్రవరి మధ్యలో పోరు జరిగే అవకాశం ఉంది. ఆసియా కప్‌లో రెండు జట్లు మూడు మ్యాచులు ఆడాయి. మూడింటిలో టీమిండియా ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. పాక్ తో కేవలం ఐసీసీ టోర్నీలలో మాత్రమే ఆడతామని బీసీసీఐ స్పష్టం చేసిన నేపథ్యంలో అభిమానులు, భారత్, పాక్ పోరాటం ఎప్పుడా! అని ఎదురు చూస్తున్నారు. 2026 ఫిబ్రవరి 15న కొలంబోలో ఈ రెండు జట్ల మధ్య రసవత్తర మ్యాచ్ జరిగే అవకాశం ఉంది. ఏ ఫార్మాట్‌లో అయినా పాకిస్తాన్‌పై టీమిండియా ఆధిపత్యాన్ని కొనసాగించింది. ఈ టీ20 ప్రపంచ కప్‌లోనూ సత్తా చాటాలని భావిస్తోంది. టీ20 ప్రపంచ కప్ లో టీమిండియా తమ తొలి మ్యాచ్‌ను అమెరికా జట్టుతో ఆడే అవకాశం ఉంది. గత ప్రపంచ కప్‌లో అమెరికా జట్టు ఊహించిన దానికంటే బాగా ఆడింది. కాబట్టి ఈసారి భారత్, అమెరికా పోరాటం ఆసక్తికరంగా ఉండనుంది. భారత జట్టు సెమీఫైనల్ చేరుకుంటే మార్చి ఐదున ముంబై వాంఖడే స్టేడియంలో జరుగుతుంది. ఫైనల్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరగనుంది. మార్చి ఎనిమిదిన ఈ కీలక మ్యాచ్ జరిగే అవకాశాలు ఉన్నాయి.




'మరుదనాయగం' మళ్లీ మొదలు కానుందా?

విఖ్యాతనటుడు కమల్‌హాసన్ కలల ప్రాజెక్ట్ అనగానే.. ఠకీమని గుర్తొచ్చే పేరు 'మరుదనాయగం'. శతాబ్దాల కిందటి ఈ ద్రవిడ మహాయోధుడి కథను తెరకెక్కించాలనేది కమల్‌హాసన్ దశాబ్దాలనాటి కల. 1996లోనే దీనికి ఆయన అంకురార్పణ చేశారు. సినిమాకు పదికోట్లు అంటే భారీ బడ్జెట్‌గా చెప్పుకునే ఆ రోజుల్లోనే 50కోట్ల అత్యంత భారీ బడ్జెట్ తో ఈ సినిమా నిర్మించేందుకు కమల్ నిర్ణయించారు. దాదాపు ఏడాదిన్నరపాటు ఈ సినిమాపై వర్క్ చేశారు. టెస్ట్ షూట్ చేశారు. కొన్ని రియల్ లొకేషన్స్‌లో షూట్ కూడా చేశారు. యాక్షన్ సీన్స్‌కి భారీగా డబ్బులు ఖర్చు పెట్టారు. అప్పటికే 5కోట్ల వరకూ ఈ సినిమాకోసం వెచ్చించారు. ఇది అప్పట్లో చాలా పెద్ద మొత్తం. ఆ క్రమంలో అనుకోని ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో సినిమా అటకెక్కింది. అయితే 'మరుదనాయగం'ని కమల్ మర్చిపోలేదు. నేటికీ అప్పుడప్పుడు ఈ సినిమా గురించి ప్రస్తావిస్తూనే ఉంటారాయన. ఇదిలావుంటే.. ఇప్పుడు ఈ డ్రీమ్ ప్రాజెక్ట్‌పై కదలిక మొదలైంది. అప్పట్లో 50కోట్లు అనుకున్న ఈ సినిమా.. అలాగే ఇప్పుడు తీస్తే 500కోట్లు పైమాటే అని అంచనా. అయితే.. తాజాగా వచ్చిన ఏఐ టెక్నాలజీ ఈ సినిమాకు వరం కానున్నదని టాక్. ఏఐ సహాయంతో కేవలం 25శాతం బడ్జెట్‌తోనే 'మరుధనాయగం'ని పూర్తి చేయొచ్చని కొన్ని వీఎఫ్ఎక్స్ కంపెనీలు కమల్‌ని సంప్రదించాయట. కమల్ కూడా ఈ విషయంపై ఉత్సాహంగా ఉన్నట్టు సమాచారం. అదే గనుక జరిగితే.. భారతీయ సినిమాకే కమల్ మార్గదర్శకుడవుతారని పలువురు అభిప్రాయపడుతున్నారు.



రాజాసాబ్... రెబల్ సాబ్

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ అభిమానులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ది రాజా సాబ్' సినిమాకు సంబంధించిన కీలక అప్‌డేట్ విడుదలైంది. హారర్ చిత్రాల దర్శకుడు మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ మాస్ ఎంటర్‌టైనర్ 'ది రాజా సాబ్' నుంచి మొట్టమొదటి పాట విడుదల తేదీని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ మూవీ ఫస్ట్ సింగిల్ రెబల్ సాబ్ ను నవంబర్ 23న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తుండగా.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, జరీనా వాహబ్, రిద్ది కుమార్ కథానాయికలుగా నటిస్తుండగా బోమన్ ఇరానీ, సంజయ్ దత్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు.



పబ్లిసిటీ స్టంట్ అన్నారు..

'ఈ సినిమా క్లైమాక్స్ హార్డ్‌హిట్టింగ్‌గా ఉంటుందని మేము ప్రమోషన్‌లో చెబితే అది పబ్లిసిటీ స్టంట్ అని కొందరన్నారు. కానీ ఇప్పుడు వారే సినిమా ఎమోషనల్‌గా ఉందని, మైండ్ బ్లోయింగ్ అంటున్నారు. సినిమాకు అంతటా పాజిటివ్ రివ్యూస్ వచ్చాయి' అన్నారు దర్శకుడు వేణు ఊడుగుల. ఆయన షోరన్నర్‌గా, ఓ నిర్మాతగా తెరకెక్కించిన 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. అఖిల్‌రాజ్, తేజస్విని జంటగా నటించిన ఈ చిత్రానికి సాయిలు కంపాటి దర్శకుడు. బన్నీవాసు, వంశీ నందిపాటి థియేట్రికల్ రిలీజ్ చేశారు. శుక్రవారం సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ సినిమాను ప్రతీ ఒక్కరు ఓన్ చేసుకుంటున్నారని, ఓ స్వచ్ఛమైన ప్రేమకథను దర్శకుడు నిజాయితీతో తెరకెక్కించారని బన్నీ వాసు తెలిపారు. ఈ సినిమా విషయంలో తమ నమ్మకం నిజమైందని నిర్మాత రాహుల్ మోపిదేవి అన్నారు. ఈ సినిమాతో తన పదేళ్ల కష్టం ఫలించిందని హీరో అఖిల్‌రాజ్ ఆనందం వ్యక్తం చేశారు. సినిమా చూస్తూ కన్నీళ్లు ఆపుకోలేకపోయామని తన ఫ్రెండ్స్ చెబుతున్నారని కథానాయిక తేజస్విని తెలిపింది.

'ప్రేమంటే' క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

- హీరో ప్రియదర్శి

ప్రియదర్శి లేటెస్ట్ బ్లాక్ బస్టర్ ప్రేమంటే. ఆనంది హీరోయిన్ గా నటించింది. సుమ కనకాల ఒక ముఖ్యమైన పాత్ర చేశారు. నవనీత్ శ్రీరామ్ డైరెక్టర్. పుస్కూర్ రామ్ మోహన్ రావు, జాన్వీ నరంగ్ నిర్మాణంలో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై నిర్మించిన చిత్రాన్ని రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా ప్రజెంట్ చేసింది. దివంగత నారాయణ్ దాస్ నారంగ్ గారికి ట్రిబ్యుట్‌గా నిలిచే ఈ చిత్రానికి ఆదిత్య మెరుగు సహ నిర్మాత. నవంబర్ 21న విడుదలైన ఈ సినిమా అద్భుతమైన రెస్పాన్స్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకొని సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్ లో హీరో ప్రియదర్శి మాట్లాడుతూ.. "ఇంత మంచి సూపర్ హిట్ సినిమా ఇచ్చినందుకు ప్రేక్షకులకు థాంక్యూ వెరీ మచ్. మా నిర్మాతలకు డైరెక్టర్ కి టీం అందరికి థాంక్యూ. సినిమాకు వచ్చిన రెస్పాన్స్ నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. సినిమాని మీ అందరూ అప్రిషియేట్ చేస్తున్నందుకు థాంక్యూ వెరీ మచ్. ఆడియన్స్ సినిమా చూసి హ్యాపీగా నవ్వుకుంటూ బయటికి రావడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఈ క్లీన్ ఎంటర్టైన్మెంట్ ని మీరందరూ తప్పకుండా థియేటర్స్ లో చూడాలని కోరుకుంటున్నాను"అన్నారు.



Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200